

'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 213

సోమవారం 23-10-2023



స్త్రీ శక్తి విజయం విజయ దశమి

విజయదశమి సందర్భంగా ప్రత్యేక కథనం

-12లో




బంగారం మార్చుకుంటున్నారా?

ఆభరణం కోసమా.. పెట్టుబడి కోసమా? రెండింటికీ ఒకటే అనుకూలం కాదు

-15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


56 Years of Service
130+ Showrooms
20 Cities Across India
SHOWROOMS OPEN AT 10 AM
vijay sales
Shop On www.vijaysales.com
మా నూతన షోరూమ్
పోలీస్ స్టేషన్ ఎదురుగా మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, హైదరాబాద్.
మారుతి సుజుకి ఎరీనా ఎదురుగా, కర్మన్‌ఘాట్, హైదరాబాద్.
కస్టమర్లకు, తయారీదారులకు మరియు శ్రేయోభిలాషులకు 'దసరా' పర్వదిన శుభాకాంక్షలు.
5 రోజుల దసరా సేల్
20th-24th అక్టోబర్ 2023
NO CIBIL, NO WORRIES
We accept EMI cards
LG
Life's Good.
CHEER INDIA ON.
TURN YOUR STADIUM ON.
This Cricket Season, transform your home into a stadium with an LG TV.
HDR10 Pro
AI Sound Pro
ThinQ AI webOS
Powerful Gameplay
UR8050
LG UHD AI ThinQ
3 YEAR WARRANTY (With Select LG TVs)
Up to 10% CASHBACK Max ₹5000* ON SELECT CREDIT / DEBIT CARDS
UPTO 30% OFF ON LG SOUNDBAR* (With Select LG TVs)
1 EMI FREE
FIXED EMI Starting from ₹2,999*
Get 3 months of Apple TV+ Free
Get upto ₹5000 Flight Voucher
Paytm Cashback No Cost EMI on EMI transaction
HDB Financial Services 12% Cash Back Plus 5x MY VS Reward Points UPTO ₹12000
Up To ₹15,000/- Instant Discount and Cashback on Banks & Paper Finance
ICICI Bank HDFC Bank HSBC YES BANK OneCard IndusInd Bank Bajaj Finance IDFC First Bank kotak DBS RBL Bank Federal Bank
FREE Delivery
₹1 Down Payment on Bajaj Finance EMI
SONY BRAVIA XR LED X90L SERIES
Range starts from Rs.1,29,990/-
Special Festive OFFERS
3 YEARS WARRANTY
INSTANT CASHBACK Rs.10,000/-
1 EMI FREE
BUY NOW AT Rs.3,995/-
SOUNDBAR COMBO OFFER SAVE UPTO Rs.49,990/-
SAMSUNG 4K UHD LED TV 75
EMI STARTS FROM ₹2,990/-
CASHBACK UP TO ₹9,000/-
SANSUI
PRICE ₹2,19,000
SPECIAL PRICE ₹1,49,000
HDB Financial Services
₹12,000* CASHBACK + 5X MY VS LOYALTY POINTS
DOWN PAYMENT ₹49,667/- | EMI ₹12,417 x 8 mths | NO COST EMI
86
BUY ANY LED TV & GET BOAT 2.0 SOUNDBAR AAVANTE RHYTHM, PRICE ₹7,990/- OFFER PRICE ₹3,790/-
iPhone 15
PRICE ₹79,900/-
Cashback ₹5,000
Trade in Value ₹15,000
Trade in Bonus ₹6,000
Effective Price* ₹53,900/-
Per Day EMI ₹82*
oppo Find N3 Flip 5G 12GB | 256GB
AVAILABLE NOW
Cashback Upto ₹12,000*/- Upto 24 Months NO COST EMI. on Leading Banks.
VSP ₹94,999/-
SMART WATCH WITH BT CALLING
VSP ₹1,999/- | SPECIAL PRICE ₹599/-
On purchase of Select Smartphones
ONEPLUS NORD CE3 LITE 5G 8GB | 256GB
VSP ₹21,499/-
Per Day EMI ₹119*
vivo V29 5G 8GB | 128GB
AVAILABLE NOW
Upto 10% Cashback on Leading Banks.
VSP ₹32,999/-
Per Day EMI ₹165*
MacBook Air M1 8GB | 256GB
PRICE ₹83,490/-
Cashback ₹5,000
Trade in Value ₹15,000*
Trade in Bonus ₹10,000*
Effective Price ₹53,490*/-
Per Day EMI ₹81*
HP PAVILION, VICTUS, SPECTRE, OMEN, ENVY
ONE EMI FREE*
LENOVO LEGION GAMING, YOGA SERIES, SLIM 5 & FLEX 5
• YOGA, LEGION: 10% upto ₹10000 Cashback
• Slim 5, Flex 5: 5% upto ₹5000 Cashback
• Exchange Bonus upto ₹10000/-
Per Day EMI ₹81*
ASUS ROG, STRIX, TUF GAMING, ZEPHYRUS DUO
Per Day EMI ₹150*
ACER ASPIRE, SWIFT, SPIN, NITRO, PREDATOR
• Upto ₹4000/- CashBack on Select Banks CC/DC
• Upto 18 months EMI offer on Select Paper Finance
Per Day EMI ₹103*
Fully Automatic Top Load Machine (7 kg) EMI START FROM ₹1,500 Cashback Upto ₹3,000*/-
Fully Automatic Top Load Machine (9 kg) EMI START FROM ₹2,167 Cashback Upto ₹7,000*/-
Fully Automatic Front Load Machine (7 kg) EMI START FROM ₹2,708 Cashback Upto ₹2,500*/-
Fully Automatic Front Load Machine (8 kg) EMI START FROM ₹3,000 Cashback Upto ₹3,000*/-
Fully Automatic Front Load Machine (9 kg) EMI START FROM ₹2,333 Cashback Upto ₹7,500*/-
Fully Automatic Washer/Dryer/Refresher (8.5/5.5kg) EMI START FROM ₹4,917 Cashback Upto ₹7,500*/-
1.5T 5 Star Inverter AC
AMSTRAD BLUE STAR DAIKIN Godrej LG O GENERAL MITSUBISHI ELECTRIC Panasonic SAMSUNG VOLTAS
EMI STARTS FROM ₹3,400/-
Direct Cool Refrigerators (200 Ltrs) EMI START FROM ₹1,460 Cashback Upto ₹2,500*/-
Frost-Free Refrigerators (240 Ltrs) EMI START FROM ₹1,833 Cashback Upto ₹2,500*/-
Frost-Free Refrigerators (350 Ltrs) EMI START FROM ₹3,166 Cashback Upto ₹5,000*/-
Frost-Free Refrigerators (400 Ltrs) EMI START FROM ₹2,633 Cashback Upto ₹10,000*/-
Side by Side Refrigerator
EMI START FROM ₹5,000/-
Effective Price Starting From ₹47,990/-* (after cashback)
GET 240 Ltrs Frost-Free Refrigerator | 10kg Top Load Washing Machine | Samsung Mobile Galaxy S23
On Select Side by Side Models
SMALL APPLIANCES
UPTO 60% OFF
విజయ్ సేల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్ | వరంగల్ | విజయవాడ | విశాఖపట్నం | రాజమండ్రి | తిరుపతి | కాకినాడ | ముంబై | ఢిల్లీ | థానే | నవీ ముంబై | పూనే | సూరత్ | వడోదర
అహ్మదాబాద్ | గురుగ్రామ్ | ఫరీదాబాద్ | నోయిడా | ఇందిరాపురం
SCAN FOR STORES
ఏ.ఎస్.రావు నగర్ | అత్తాపూర్ | బీహెచ్ఈఎల్ | పీర్జాదిగూడ (బోడుప్పల్) | హస్తినాపురం | కర్మన్‌ఘాట్ | చంపాపేట్ | కొత్తపేట | కొండాపూర్ | కూకట్‌పల్లి | మలక్‌పేట్ | మదీనాగూడ | మైలార్‌దేవ్‌పల్లి | మెహదీపట్నం | నాగోల్ | నల్లకుంట
| నాచారం | శాలిబండ | సుచిత్ర X రోడ్స్ | సన్ సిటీ | టోలిచౌకి | వనస్థలిపురం | వరంగల్ | హన్మకొండ
MY VS Rewards SHOP.EARN.REDEEM
Scan to Shop Online www.vijaysales.com


'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

సత్యమేవ జయతే
సాక్షి


WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 213

సోమవారం
23-10-2023



పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు
సాక్షి
విజయదశమి శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఢిల్లీకి 'గాలాడటం' లేదు

దేశ రాజధానిలో వాయు నాణ్యత ఈ సీజన్‌లో మొదటిసారిగా ఆదివారం 'వెరీ పూర్' స్థాయికి పడిపోయింది.

వివరాలు 6లో ▸



హమాస్‌పై ముప్పేట దాడి

హమాస్, ఇజ్రాయెల్ సైన్యం మధ్య ఘర్షణలు మరింత ఉధృతం అవుతున్నాయి. ఇజ్రాయెల్ భీకర యుద్ధం ప్రారంభించింది.

వివరాలు 6లో ▸



ఫిలిప్పీన్స్ నౌకలను ఢీకొట్టిన చైనా

దక్షిణ చైనా సముద్రంలోని వివాదాస్పద ప్రాంతంలో ఆదివారం ఫిలిప్పీన్స్, చైనా మధ్య మరోసారి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

వివరాలు 6లో ▸



మహిళా పైలట్లకు ప్రాధాన్యం

గగన్‌యాన్ మిషన్‌లో మహిళా పైలట్లు, మహిళా శాస్త్రవేత్తలకే ప్రాధాన్యం ఇస్తామని ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడించారు.

వివరాలు 6లో ▸

జంగ్ తెలంగాణ

మూడో వంతు స్థానాల్లో..

ముస్లింలే కీలకం

హైదరాబాద్ పాతబస్తీ సహా 40 వరకు నియోజకవర్గాల్లో వీరి ప్రభావం

పార్టీల గెలుపోటములు ప్రభావితం చేసే అవకాశం

ఈ వర్గం ఓటర్లను ఆకర్షించేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రయత్నాలు

పోరుగల్లు.. పోటాపోటీ

పట్టు నిలుపుకునేందుకు బీఆర్ఎస్
పాగా వేసేందుకు కాంగ్రెస్

రైతులే కీలకం

అన్నదాతల కోసం ఎన్నో పథకాలు తెచ్చాం.. అసెంబ్లీ ఎన్నికల్లో 75పైగా సీట్లు ఖాయం

పీటీఐ ప్రత్యేక ఇంటర్వ్యూలో ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బఘేల్

- వివరాలు 13,14 పేజీల్లో

సోషల్ మీడియాలో హోరెత్తించండి

వార్ రూమ్, నియోజకవర్గ ఇన్‌చార్జిలకు కేటీఆర్, హరీశ్ దిశా నిర్దేశం




సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్, హరీశ్‌రావు

2014 ఎన్నికల తర్వాత దాని ప్రాధాన్యత పెరిగింది

మోదీ కూడా దాని ద్వారానే ప్రధాని స్థాయికి ఎదిగారు

వాటిని దృష్టిలో పెట్టుకుని ప్రచార వ్యూహం రూపొందించుకోండి

సాక్షి, హైదరాబాద్

ఎన్నికల ప్రచారంలో భాగంగా సభలు, సమావేశాలు నిర్వహించడంతో పాటు ప్రసార, సామాజిక మాధ్యమాలను విరివిగా ఉపయోగించుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు పార్టీ నేతలకు సూచించారు. ఓటర్లను ప్రభావితం చేయడంలో సామాజిక మాధ్యమాల పాత్రను కూడా దృష్టిలో పెట్టుకుని ప్రచార వ్యూహం రూపొందించుకోవాలన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని జల విహార్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ముఖ్య ప్రచారకర్తలు, వార్ రూమ్ ఇన్‌చార్జిల సమావేశం జరిగింది. కేటీఆర్‌తో పాటు మంత్రి హరీశ్‌రావు హాజరై ఎన్నికల ప్రచారం, సమన్వయం తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ప్రతి నియోజక వర్గానికి వార్ రూమ్‌తో పాటు పర్యవేక్షణకు సెంట్రల్ వార్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కేటీఆర్ వెల్లడించారు. ఈ వార్ రూమ్‌లలో 380 మందికి పైగా పాలుపంచుకుంటున్నారన్నారు. సెంట్రల్ వార్ రూమ్ ద్వారా అందే సూచనలు, ఆదేశాలను క్షేత్ర స్థాయిలో అమలయ్యేలా ఇన్‌చార్జిలు బాధ్యత తీసుకోవాలని చెప్పారు.

వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్ లాంటివి వాడండి

2014 ఎన్నికల తర్వాత సోషల్ మీడియా ప్రాధాన్యత పెరిగిందని, మోదీ కూడా సోషల్ మీడియాను అడ్డుపెట్టుకుని ప్రధాని స్థాయికి ఎదిగారని కేటీఆర్ చెప్పారు. వాట్సాప్‌తో పాటు ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితరాలను ప్రచార వేదికలుగా ఉపయోగించుకోవాలని సూచించారు. విపక్ష పార్టీలు

మిగతా 5వ పేజీలో ▶



హనుమకొండలోని పద్మాక్షిగుట్ట వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు
- 'సాక్షి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

బీజేపీ తొలి జాబితాలో బీసీలకు 36% సీట్లు

52 మంది అభ్యర్థులతో జాబితా విడుదల

బీసీలకు 19 స్థానాలు కేటాయింపు

రెడ్లు-12, వెలమ-5, ఎస్సీ-8, ఎస్టీ-6, వైశ్య, ఉత్తరాది లోధీలకు ఒక్కొక్కటి

అన్ని కేటగిరీలు కలుపుకొని మహిళలకు 12 సీట్లు

అసెంబ్లీ బరిలోకి ఎంపీలు బండి, ధర్మపురి, సోయం

హుజూరాబాద్‌తో పాటు గజ్వేల్ నుంచీ ఈటల పోటీ

దుబ్బాక, గోషామహల్‌లో మళ్లీ సిట్టింగ్‌లకే..

మంత్రి కేటీఆర్‌కు పోటీగా సిరిసిల్ల బరిలో రాణి రుద్రమ

పెండింగ్‌లో పలు కీలక స్థానాలు.. నెలాఖరులోగా మరో రెండు, మూడు జాబితాల్లో మిగతా అభ్యర్థుల ఖరారు!


ఈటల రాజేందర్


బండి సంజయ్


రఘునందన్‌రావు


ధర్మపురి అర్వింద్



సోయం బాపూరావు

సాక్షి, హైదరాబాద్/ సాక్షి, న్యూఢిల్లీ

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ అధిష్టానం విడుదల చేసింది. ఆ పార్టీ ఆశావహుల్లో రెండు, మూడు రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరదించింది. 52 నియోజక వర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ముందే చెప్పినట్లు అత్యధికంగా బీసీలకు 19 స్థానాల్లో అవకాశం కల్పించింది. రెడ్డి 12, వెలమ 5, ఎస్సీలకు 8, ఎస్టీలకు 6, వైశ్యులు 1, ఉత్తరాది అగర్వాల్ (లోధి)వర్గానికి చెందిన ఒకరికి చోటు లభించింది. మొత్తంగా 12 మంది మహిళలకు (బీసీ, ఎస్సీ, ఎస్టీ, జనరల్ కేటగిరీలు కలుపుకుని) అవకాశం కల్పించింది. ఎంపీలు బండి సంజయ్ (కరీంనగర్), ధర్మపురి అర్వింద్ (కోరుట్ల), సోయం బాపూరావు (బోథ్)లను అసెంబ్లీ బరిలోకి దించింది. సిట్టింగ్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ హుజూరాబాద్‌తో పాటు సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న గజ్వేల్‌లో కూడా పోటీ చేసేందుకు అవకాశం కల్పించింది. మరో సిట్టింగ్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్‌పై ఆదివారం సస్పెన్షన్ ఎత్తివేసిన నేపథ్యంలో ఈసారి కూడా గోషామహల్ సీటునే ఇచ్చారు. ఎమ్మెల్యే రఘునందన్‌రావు మరోసారి దుబ్బాక నుంచి బరిలో నిలిచారు. అధికార బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ (సిరిసిల్ల)పై బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమను పోటీకి దింపారు. కాగా కేంద్రమంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, మరో ఎంపీ కె.లక్ష్మణ్‌లకు మొదటి జాబితాలో చోటు కల్పించలేదు. నెలాఖరులోగా రెండు లేదా మూడు జాబితాల్లో మిగతా 67 సీట్లకు అభ్యర్థులు ఖరారు కావొచ్చని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి. హైదరాబాద్ నగరంలోని నియోజకవర్గాలతో ఉమ్మడి జిల్లాలు అన్నీ కవర్ అయ్యేలా (పాతబస్తీ, పార్టీకి అంతగా బలం లేని ఇతర చోట్ల కలిపి), బీసీలు, మహిళలు, రెడ్డి, వెలమ ఇతర సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులకు సీట్లు ఖరారు చేశారు. మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లలో మాదిరిగా

మిగతా 2వ పేజీలో ▶

26న త్రిపుర గవర్నర్‌గా ఇంద్రసేనారెడ్డి ప్రమాణం



ఈ నెల 26వ తేదీ ఉదయం 11 గంటలకు త్రిపుర గవర్నర్‌గా నల్లు ఇంద్రసేనారెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాష్ట్రపతి వెలువరించిన ఉత్తర్వులను (వారెంట్) త్రిపుర గవర్నర్ ఏడీసీ మేజర్ రోహిత్ సేథీ ఇంద్రసేనారెడ్డికి అందజేశారు. -2లో

31న కాంగ్రెస్ పాలమూరు ప్రజాభేరి

హాజరుకానున్న ప్రియాంకాగాంధీ



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 31న పాలమూరు ప్రజాభేరి పేరుతో కొల్లాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. మాజీ మంత్రి జూపల్లి పార్టీలో చేరిక సందర్భంలోనే ప్రియాంకా గాంధీతో కొల్లాపూర్‌లో సభ ఏర్పాటు చేయించాలని భావించినా అప్పుడు సాధ్యం కాకపోవడంతో ఇప్పుడు ఆమెతో సభ నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు సభ ఏర్పాట్లపై హైదరాబాద్‌లోని మల్లు రవి నివాసంలో జూపల్లి కృష్ణారావు, జగదీశ్వర్‌రావు, ప్రతాప్‌గౌడ్, విజయభాస్కర్‌రెడ్డి ఆదివారం చర్చించారు. ఈ సందర్భంగా రవి, జూపల్లి, జగదీశ్వరరావు మాట్లాడుతూ పాలమూరు ప్రజాభేరి బహిరంగ సభకు అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణలో కేసీఆర్ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని, తెలంగాణ ఇచ్చిన సోనియమ్మకు ఈ ఎన్నికల్లో విజయాన్ని బహుమతిగా ఇవ్వాలని పిలుపునిచ్చారు.



భారత్ 5/5

మొహమ్మద్ షమీ ఐదు వికెట్ల ప్రదర్శన...విరాట్ కోహ్లి 95 పరుగుల జోరు వెరసి భారత్‌కు ప్రపంచకప్‌లో ఐదో గెలుపును అందించాయి. దాంతో సొంతగడ్డపై జరుగుతున్న వన్డే ప్రపంచకప్‌లో అజేయ యాత్ర కొనసాగిస్తున్న టీమిండియా తమ విజయాల స్కోరును 5/5గా మార్చుకుంది. ఆదివారం ధర్మశాలలో జరిగిన పోరులో భారత్ 4 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది. డరైల్ మిచెల్ 130, రచిన్ రవీంద్ర 75 పరుగుల సహకారంతో న్యూజిలాండ్ 50 ఓవర్లలో 273 పరుగులు చేసింది. అనంతరం భారత్ 48 ఓవర్లలో 6 వికెట్లకు 274 పరుగులు సాధించింది. రోహిత్ శర్మ 46, జడేజా 39 నాటౌట్ స్కోర్లతో టీమ్ విజయంలో కీలక పాత్ర పోషించారు. విజయదశమి వేడుకల కోసం ఆటగాళ్లు స్వస్థలాలకు వెళ్లనుండగా...స్వల్ప విరామం తర్వాత వచ్చే ఆదివారం లక్నోలో జరిగే మ్యాచ్‌లో ఇంగ్లండ్‌తో భారత్ తలపడుతుంది.

వివరాలు 16లో

సెలవు

విజయదశమి సందర్భంగా నేడు (సోమవారం) సాక్షి కార్యాలయానికి సెలవు. కావున మంగళవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.

100 ఎంబీబీఎస్ సీట్లు మిగులు!



రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో పెద్ద ఎత్తున ఎంబీబీఎస్ సీట్లు మిగిలిపోయినట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు చెబుతున్నాయి. దాదాపు 100 వరకు ఎంబీబీఎస్ సీట్లు మిగిలినట్లు సమాచారం. త్వరలో అన్ని కాలేజీలు జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)కు సమాచారం ఇచ్చిన తర్వాత మిగిలిపోయిన సీట్ల సంఖ్యపై స్పష్టత వస్తుందని చెబుతున్నారు.

వివరాలు 8లో



... ఓటర్లను ఆకర్షించడానికట!

కాళేశ్వరంతో ఆర్థిక వ్యవస్థకు చిల్లు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రచారం చేసుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పెద్ద చిల్లుగా మారిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రాజెక్టు పరిధిలోని లక్ష్మి బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పలువురు ఇంజనీర్లు తొలి నుంచీ అనుమానం వ్యక్తం చేస్తున్నారని, ఈరోజు ఆ అనుమానాలు నిజమయ్యాయని పేర్కొన్నారు. లక్షన్నర కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టు పతనమవుతుంటే ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం దారుణమన్నారు. కుంగిన బ్రిడ్జిని పరిశీలించేందుకు ఈటల రాజేందర్ నేతృత్వంలో బీజేపీ బృందం వెళ్లనున్నట్టు ప్రకటించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాజాసింగ్‌లతో కలసి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ''కాళేశ్వరం ఇంజనీరింగ్ మార్వెల్ అని కేసీఆర్ జబ్బలు చరచుకున్నారు. మూడేళ్లలో ప్రాజెక్టు కుంగడం నిజంగా ఇంజనీరింగ్ అద్భుతమే. కేసీఆర్ 80వేల పుస్తకాలు చదివి, సూపర్ ఇంజనీర్ అవతారమెత్తి, ఇంజనీరింగ్ నిపుణుల మాటలు ఖాతరు చేయకుండా ప్రాజెక్టు నిర్మించారు. అంచనాలు భారీగా పెంచారు. రాష్ట్ర సంపదను కొల్లగొట్టారు. గోదావరి వరదలు వచ్చినప్పుడు పంపుహౌజ్‌లు మునిగి భారీ నష్టం వచ్చింది. ఇప్పుడు ప్రాజెక్టు కుంగిపోతోంది. లోపాలన్నీ బయటపడుతున్నాయి''అని కిషన్‌రెడ్డి విమర్శించారు. ఏటా 400 టీఎంసీలు ఎత్తిపోసి రైతులకు ఇస్తామన్న కేసీఆర్.. గత నాలుగేళ్లలో ఎన్ని ఎకరాలకు, ఎన్ని టీఎంసీల నీళ్లు అందించారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు భద్రతపై తక్షణమే డ్యామ్ సేఫ్టీ అథారిటీతో

మిగతా 8వ పేజీలో ▶

మూడేళ్లలోనే ప్రాజెక్టు కుంగిపోవడం ఇంజనీరింగ్ అద్భుతమా?: కిషన్‌రెడ్డి

- దీనిపై ఇంజనీర్లు తొలి నుంచీ అనుమానాలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు
- సీఎం కేసీఆర్ తానే ఇంజనీరునని, తానే డిజైన్ చేశానని చెప్పారు
- డ్యాం సేఫ్టీ అథారిటీని రప్పించి సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్


రాజాసింగ్‌ను ఆలింగనం చేసుకున్న కిషన్‌రెడ్డి

మరింత కుంగిన మేడిగడ్డ బ్యారేజీ!

- 7వ బ్లాక్‌లోని 20వ పియర్‌కు పగుళ్లు.. రెండు, మూడు ఫీట్ల మేర కుంగిపోయిన రోడ్డు
- వంతెనపై తెలంగాణ–మహారాష్ట్ర మధ్య రాకపోకలు నిలిపివేత
- మొత్తం 85 గేట్లు ఎత్తి నీటిని వదిలేస్తున్న ఇంజనీర్లు -8లో

ఎల్‌ఏసీ వెంట మోహరింపులు

- చైనా దుందుడుకు వైఖరి
- 2022లో భారీగా నిర్మాణాలు
- విమానాశ్రయం, హెలిప్యాడ్లు
- డ్రాగన్ దేశం వద్ద 500 అణు వార్‌హెడ్లు!
- 2030 కల్లా రెట్టింపయ్యే చాన్స్
- అమెరికా రక్షణ శాఖ తాజా నివేదికలో వెల్లడి



'చైనాలో సైనిక, భద్రతాపరమైన పరిణామాలు–2023' పేరిట అమెరికా రక్షణ శాఖ తాజాగా ఒక సమగ్ర నివేదికను విడుదల చేసింది. భూటాన్ వెంబడి వివాదాస్పద ప్రాంత సమీపంలో చైనా ఏకంగా ఊళ్లనే ఏర్పాటు చేసిందని తెలిపింది. ప్రయోగానికి అన్నివిధాలా సిద్ధంగా ఉన్న అణు వార్ హెడ్లు చైనా వద్ద ఏకంగా 500 దాకా ఉన్నట్టు నివేదిక పేర్కొంది.

- వివరాలు 6లో

క్లుప్తంగా...

కాంగ్రెస్‌ను నమ్మితే మనకూ కర్ణాటక గతే

విద్యుత్ కోతలతో ఆ రాష్ట్రవాసులు అల్లాడుతున్నారు: మంత్రి జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీని నమ్మితే కర్ణాటకలో కరెంట్ కోతలతో తలెత్తుతున్న పరిస్థితులే రాష్ట్రంలోనూ ఉంటాయని విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో విప్ బాల్క సుమన్, బీఆర్‌ఎస్ నేత రాజారాం యాదవ్‌లతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వస్తే కనీసం 5 గంటల కరెంటు కూడా ఉండదని ఆరోపించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను నమ్మి కర్ణాటక ప్రజలు ఓట్లేస్తే బెంగళూరు సహా అన్ని ప్రధాన నగరాల్లో కరెంటు కోతలు ఉన్నాయని చెప్పారు. కర్ణాటకతో ఇక్కడి రైతులు, ప్రజలు పోల్చుకోవాలని జగదీశ్‌రెడ్డి సూచించారు. కాంగ్రెస్ చెప్పే మాటలు నమ్మితే 2014కు ముందున్న పరిస్థితులు రాష్ట్రంలో మళ్లీ ఏర్పడతాయన్నారు. జానారెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు నాగార్జునసాగర్‌లో రాత్రిపూట కరెంట్ ఉండేదా అని జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణలో 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తే బీఆర్‌ఎస్‌కు ప్రచారం చేస్తానని చెప్పి జానారెడ్డి చేయలేదని విమర్శించారు.

బీజేపీకి మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి రాజీనామా

సాక్షి, హైదరాబాద్: బీజేపీకి మాజీ ఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డి గుడ్‌బై చెప్పారు. ఈ మేరకు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ఓ లేఖను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డికి పంపించారు. పార్టీలో తనకు ఇప్పటివరకు అందించిన సహకారానికిగాను కిషన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.

మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్ పార్టీలో చేరిన చందర్‌రావును ఆలింగనం చేసుకుంటున్న ఎంపీ ఉత్తమ్

కోదాడ: సూర్యాపేట జిల్లా కోదాడ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ సీనియర్ నేత వేనేపల్లి చందర్‌రావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం రాత్రి కోదాడ పట్టణంలో జరిగిన కార్యక్రమంలో చందర్‌రావుతోపాటు కోదాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు ఎర్నేని బాబు, మహబూబ్ జానీ, బుర్రా సుధారాణిపుల్లారెడ్డి, మునగాల, చిలుకూరు, మోతె, అనంతగిరి ఎంపీపీలు ఎలకా బిందు, బండ్ల ప్రశాంతి కోటయ్య, ఆశా శ్రీకాంత్‌రెడ్డి, చుండూరు వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీలు పుల్లారావు, బాణాల కవిత, బొలిశెట్టి శిరీష, నల్లపాటి ప్రమీల, కొణతం ఉమ, నడిగూడెం వైస్ ఎంపీపీ బడేటి వెంకటేశ్వర్లు, బేతవోలు సర్పంచ్ వట్టికూటి నాగయ్య, సింగారం మాజీ సర్పంచ్ వెంపటి వెంకటేశ్వరరావుకు పీసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కోదాడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పద్మావతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్ ప్రధాని కాకుండా అడ్డుకున్న కాంగ్రెస్

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

లాలాపేట (హైదరాబా ద్): నాటి జనసంఘ్ నుంచి.. నేటి బీజేపీ వరకు ఎస్సీలకు పెద్ద పీట వేసింది భారతీయ జనతా పార్టీ అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. లాలాపేటలోని నఫీజ్ గార్డెన్‌లో శారదామల్లేశ్ ఆధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్ నియోజకవర్గ ఎస్సీల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముఖ్య అతిథిగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. నాడు డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్‌ను దేశ ప్రధాని చేసేందుకు జనసంఘ్ ప్రయత్నం చేస్తే.. కాంగ్రెస్ అడ్డుకుని చరణ్‌సింగ్‌ను ప్రధానిని చేసిందని విమర్శించారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో 12 మంది ఎస్సీ సామాజికవర్గానికి చెందిన మంత్రులున్నారని తెలిపారు. మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాజకీయ లబ్ధికి అమలు సాధ్యం కాని హామీలతో ఎస్సీలను మోసం చేస్తున్నారని విమర్శించారు.

బీజేపీ తొలి జాబితాలో బీసీలకు 36% సీట్లు

▶ మొదటి పేజీ తరువాయి

ఇక్కడ కూడా.. గతంలో పార్టీ అభ్యర్థులు 3, 4 స్థానాల్లో నిలిచిన పలు స్థానాలకు అభ్యర్థులను ముందుగా ప్రకటించారనే చర్చ పార్టీలో జరుగుతోంది. తొలి జాబితాలో పార్టీకి చెందిన పలువురు సీనియర్లకు కూడా కోటు దక్కలేదు.

కిషన్‌రెడ్డి, లక్ష్మణ్ దూరం!

తొలి జాబితాలో లేని అంబర్‌పేట, మునుగోడు, గద్వాల, ముషీరాబాద్, మహబూబ్‌నగర్, ఉప్పల్, ఎల్బీనగర్ తదితర స్థానాల్లో ఎవరికి టికెట్ లభిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. అంబర్‌పేట నుంచి కిషన్‌రెడ్డి పోటీ చేస్తారో లేదో చర్చనీయాంశంగా మారింది. కిషన్‌రెడ్డితో పాటు పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ (ముషీరాబాద్) పోటీకి దూరంగా ఉంటామని జాతీయ నాయకత్వానికి చెప్పినట్టు సమాచారం. దీంతో అంబర్‌పేటలో కిషన్‌రెడ్డి భార్య కావ్యారెడ్డి లేదా నగర సెంట్రల్ పార్టీ అధ్యక్షుడు డా.ఎస్.గౌతమ్‌రావు బరిలో నిలుస్తారా? మరో బీసీ నేతకు అవకాశం ఇస్తారా? వేచి చూడాల్సి ఉంది. అయితే తాను అంబర్‌పేట నుంచి పోటీ చేయాలా వద్దా? అన్నదానిపై హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందని, అది పార్టీ అంతర్గత వ్యవహారమని కిషన్‌రెడ్డి ఆదివారం మీడియాకు తెలిపారు. ఇక ముషీరాబాద్ నుంచి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి పేరు దాదాపు ఖరారైనట్టు చెబుతున్నారు. మునుగోడు, ఎల్బీనగర్‌ల నుంచి కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి, ఆయన సతీమణి పోటీ చేయాలని భావిస్తున్నారు. గద్వాల నుంచి పోటీకి పార్టీ జాతీయ అధ్యక్షురాలు డీకే అరుణ, మహబూబ్‌నగర్ నుంచి పోటీకి మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి సిద్ధమైనా మొదటి జాబితాలో ఈ సీట్లు ఖరారు చేయలేదు.

బలం లేని చోట్ల బీసీలకు?

బీసీలకు ఎక్కువ సీట్లు కేటాయించినా పార్టీ బలంగా లేని పాతబస్తీ, ఇతర చోట్ల ఇచ్చారంటూ కొందరు అసంతృప్తి



వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెడ్డి కులస్తులకు ఎక్కువ సీట్లు కేటాయించారని, అయితే బీసీలకు తగిన ప్రాధాన్యత లేని నియోజకవర్గాల్లో ఇచ్చారని అంటున్నారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా లాంటి సీట్లు బీసీలకు ఇవ్వడాన్ని ఎలా అర్థం చేసుకోవాలని ప్రశ్నిస్తున్నారు. జనగామలో బలమైన నేత బీరప్పకు ఇవ్వలేదని చెబుతున్నారు. అయితే ఈ వాదనను ఇతర నేతలు ఖండిస్తున్నారు. బీసీలకు సంబంధించి పలువురికి గెలిచే సీట్లు, పార్టీకి పట్టున్న నియోజకవర్గాల్లోనే అవకాశం కల్పించారని అంటున్నారు. పార్టీ బలంగా ఉన్న కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో పలు సీట్లు బీసీలకు కేటాయించడం వారికి పెద్దపీట వేసినట్టేనని వివరిస్తున్నారు. ఇక వరంగల్ పశ్చిమ స్థానం నుంచి టికెట్ ఆశించిన ఏనుగుల రాకేశ్‌రెడ్డి రెబల్‌గా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. మరోవైపు తనతో పాటు బీజేపీలోకి వచ్చిన కరీంనగర్ మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమకు వేములవాడ టికెట్ ఇవ్వకపోతే తాను కూడా పోటీకి దూరంగా ఉంటానని ఈటల పేర్కొనడంతో ఆ నియోజకవర్గాన్ని పెండింగ్‌లో పెట్టినట్టు తెలుస్తోంది.

'జనసేన'తో పొత్తుపై నిర్ణయం తీసుకోలేదు: కిషన్‌రెడ్డి

ఈ ఎన్నికల్లో జనసేనతోనూ సీట్ల సర్దుబాటు చేసుకోవాల్సి ఉంటుందనే నాయకత్వం సంకేతాలిస్తోంది. జనసేన 12 సీట్లు కోరుతోందని, హైదరాబాద్‌లో ఒకటి, మరో రెండు సీట్లు రాష్ట్రంలోని ఇతర చోట్ల ఇవ్వాల్సి ఉంటుందని నాయకులు అంచనా వేస్తున్నారు. అయితే తెలంగాణలో జనసేనకు గుర్తింపు లేకపోవడంతో పాటు నాయకులు, కేడర్ లేని పరిస్థితుల్లో ఆ పార్టీకి రెండు, మూడు సీట్లు ఇచ్చినా తమకు నష్టమేనని కొందరు పార్టీ నేతలు అంటున్నారు. కాగా జనసేనతో పొత్తుపై ప్రాథమికంగా చర్చించామని, అయితే దీనిపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కిషన్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు.

సామాజికవర్గాల వారీగా..

- 19 మంది బీసీలలో మున్నూరు కాపు-2, ముదిరాజ్-3, యాదవ్-3, గౌడ్-3, విశ్వకర్మ-1, పద్మశాలి-1, పెరిక-2, ఆరే కటిక-1, ఆరే మరాఠా-1, లోధా-2 ఉన్నారు.
- 19 ఓసీలలో 12 మంది రెడ్డి, 5 వెలమ, ఒక వైశ్య, ఒక నార్త్ ఇండియన్ అగర్వాల్ ఉన్నారు.
- 8 మంది ఎస్సీలలో ఒకరు బైండ్ల, 5 మాదిగ, 2 మాల ఉన్నారు.
- 6 మంది ఎస్టీల్లో 4 లంబాడా, ఒక కోయ ఒక గోండు ఉన్నారు.

ఉమ్మడి జిల్లాల వారీగా..

తొలి జాబితాలో ఎక్కువగా ఉత్తర తెలంగాణ పరిధిలోని నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లు స్పష్టమౌతోంది. హైదరాబాద్ పరిధిలో 7 నియోజక వర్గాలు, ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో తొమ్మిది చొప్పున స్థానాలు, ఆదిలాబాద్‌లోని 7, నిజామాబాద్‌లోని 5, నల్లగొండ, మెదక్‌లోని నాలుగేసి చొప్పు న, రంగారెడ్డిలో 3, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని రెండేసి చొప్పున నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించారు.

అభ్యర్థుల జాబితా

1) సిర్పూర్ - పాల్వాయి హరీశ్ బాబు
2) బెల్లంపల్లి (ఎస్సీ) - అమరాజుల శ్రీదేవి
3) ఖానాపూర్ (ఎస్టీ) - రమేష్ రాథోడ్
4) ఆదిలాబాద్- పాయల్ శంకర్
5) బోథ్(ఎస్టీ) - సోయం బాపూరావు
6) నిర్మల్- ఏలేటి మహేశ్వర్ రెడ్డి
7) ముథోల్ - రామారావు పటేల్
8) ఆర్మూర్ - పైడి రాకేశ్ రెడ్డి
9) జుక్కల్ (ఎస్సీ) - టి.అరుణతార
10) కామారెడ్డి- కె.వెంకటరమణా రెడ్డి
11) నిజామాబాద్ అర్బన్- ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా
12) బాల్కొండ - ఆలేటి అన్నపూర్ణమ్మ
13) కోరుట్ల - ధర్మపురి అర్వింద్
14) జగిత్యాల- బోగ శ్రావణి
15) ధర్మపురి (ఎస్సీ)- ఎస్.కుమార్
16) రామగుండం- కందుల సంధ్యారాణి
17) కరీంనగర్ - బండి సంజయ్ కుమార్
18) చొప్పదండి (ఎస్సీ)- బొడిగె శోభ
19) సిరిసిల్ల- రాణి రుద్రమరెడ్డి
20) మానకొండూరు (ఎస్సీ)- ఆరెపల్లి మోహన్
21) హుజూరాబాద్ - ఈటల రాజేందర్
22) నర్సాపూర్ - ఎర్రగొల్ల మురళీ యాదవ్
23) పటాన్‌చెరు -టి.నందీశ్వర్ గౌడ్
24) దుబ్బాక - మాధవనేని రఘునందన్ రావు
25) గజ్వేల్ - ఈటల రాజేందర్
26) కుత్బుల్లాపూర్ - కూన శ్రీశైలం గౌడ్
27) ఇబ్రహీంపట్నం - నోముల దయానంద్ గౌడ్
28) మహేశ్వరం - అందెల శ్రీరాములు యాదవ్
29) ఖైరతాబాద్ - చింతల రామచంద్రారెడ్డి
30) కార్వాన్ - అమర్‌సింగ్
31) గోషామహల్ - టి.రాజాసింగ్
32) చార్మినార్ - మేఘారాణి
33) చాంద్రాయణగుట్ట - సత్యనారాయణ ముదిరాజ్
34) యాకుత్‌పురా - వీరేందర్ యాదవ్
35) బహదూర్‌పురా - వై.నరేశ్ కుమార్
36) కల్వకుర్తి - తల్లోజు ఆచారి
37) కొల్లాపూర్ - ఎ.సుధాకర్ రావు
38) నాగార్జున సాగర్ - కె.నివేదితా రెడ్డి
39) సూర్యాపేట - సంకినేని వెంకటేశ్వరరావు
40) భువనగిరి - గూడూరు నారాయణరెడ్డి
41) తుంగతుర్తి (ఎస్సీ) - కడియం రామచంద్రయ్య
42) జనగాం - డా.ఆరుట్ల దశమంత్ రెడ్డి
43) స్టేషన్ ఘన్‌పూర్ (ఎస్సీ) - డా.గుండె విజయ రామారావు
44) పాలకుర్తి - లేగ రామ్మోహన్ రెడ్డి
45) డోర్నకల్ (ఎస్టీ) - బూక్యా సంగీత
46) మహబూబాబాద్ (ఎస్టీ) - జాటాత్ హుస్సేన్ నాయక్
47) వరంగల్ పశ్చిమ - రావు పద్మ
48) వరంగల్ తూర్పు - ఎర్రబెల్లి ప్రదీప్ రావు
49) వర్ధన్నపేట (ఎస్సీ)- కొండేటి శ్రీధర్
50) భూపాలపల్లి- చందుపట్ల కీర్తి రెడ్డి
51) ఇల్లందు (ఎస్టీ) - రవీంద్ర నాయక్
52) భద్రాచలం (ఎస్టీ) - కుంజా ధర్మారావు

మేం చేయకపోతే మీరు చేశారా?

బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి ధ్వజం

- దేశంలోని 5 లక్షల గ్రామాలకు కరెంటు ఇచ్చింది కాంగ్రెస్
- ఉచిత విద్యుత్, రూపాయి కిలో బియ్యం, ఉపాధి హామీ పథకాలు మేం తెచ్చినవే



సాక్షి, హైదరాబాద్: తెలంగాణతో సహా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి పనులు చేయకపోతే బీఆర్‌ఎస్ చేసిందా? అని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత కె. జానారెడ్డి ప్రశ్నించారు. మంత్రి కేటీఆర్ సంస్కారం లేకుండా రాహుల్ గాంధీ గురించి విమర్శలు చేస్తున్నారని, సంస్కారం లేని వారి గురించి తాను ఎక్కువ మాట్లాడబోనని వ్యాఖ్యానించారు. కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ అసమ్మతి నేత జగదీశ్వరరావు పార్టీ నుంచి వెళ్లిపోయిన నేపథ్యంలో ఆయనను బుజ్జగించిన జానారెడ్డి ఆదివారం తన నివాసంలో మళ్లీ కాంగ్రెస్ కండువా కప్పారు. అనంతరం జగదీశ్వరరావు, జూపల్లి కృష్ణారావు ఇతర నేతలతో కలసి జానారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ గురించి కేటీఆర్ మాట్లాడుతున్నారని, 1995 నాటికే దేశంలోని ఐదు లక్షల గ్రామాలకు విద్యుత్ అందించింది కాంగ్రెస్ పార్టీయేనని చెప్పారు. తమ హయాంలోనే రైతులకు ఉచిత విద్యుత్, రూపాయికి కిలోబియ్యం, ఆహారభద్రత, ఉపాధి హామీ, సమాచార హక్కు చట్టాలు అమలయ్యాయని, ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల్లో మార్పులు వచ్చాయని వివరించారు. తెలంగాణ రాష్ట్రం కోసం పదవులు కోల్పోయింది కాంగ్రెస్ నేతలయితే, ప్రజలను మోసం చేసి అధికారం దక్కించుకుంది బీఆర్‌ఎస్ నేతలని ధ్వజమెత్తారు. గత తొమ్మిదిన్నరేళ్లలో బీఆర్‌ఎస్ చేస్తానని చెప్పిన పనుల్లో ఎన్ని అమలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. దళితుడికి సీఎం పదవి, మూడెకరాల భూమి పంపిణీ ఎక్కడకు పోయాయని ప్రశ్నించారు. 'అటవీ హక్కులు కాంగ్రెస్ కల్పించకపోతే పోడు భూములు వచ్చేవా? 2004లోనే ఉచిత కరెంటు రైతులకు ఇచ్చి వారి కరెంటు బిల్లులను మాఫీ చేసింది కాంగ్రెస్ కాదా? అంతకంటే మీరు ఎక్కువేం చేశారు? మేం ఇచ్చిన వాటిని కొనసాగించారు'అని వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని ఐదున్నర లక్షల కోట్ల అప్పుల పాలు చేశారని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీపై పూర్తిస్థాయి అధ్యయనం చేసిన తర్వాత మాట్లాడతానని అన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని, ఆ పార్టీని ప్రజలు సహించే స్థితిలో లేరని జానా అన్నారు.

80 స్థానాల్లో గెలుస్తాం

త్వరలోనే కాంగ్రెస్ రెండో జాబితా: రేవంత్‌రెడ్డి

- ఢిల్లీలోని వార్‌రూమ్‌లో ముగిసిన స్క్రీనింగ్ కమిటీ భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 80 స్థానాల్లో విజయం సాధించడం ఖాయమని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. త్వరలోనే కాంగ్రెస్ రెండో జాబితా విడుదల చేస్తామని చెప్పారు. ఆదివారం తెలంగాణ అసెంబ్లీ అభ్యర్థుల రెండో జాబితాపై కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ ఢిల్లీలోని వార్‌రూమ్‌లో సమావేశమైంది. కమిటీ చైర్మన్ మురళీధరన్, పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, రోహిత్ చౌదరి, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిగ్నేష్ మేవానీ, సునీల్ కనుగోలు తదితరులు ఇందులో పాల్గొన్నారు. భేటీలో అభ్యర్థుల ఎంపిక, పొత్తులో ఉన్న పార్టీలకు సీట్ల కేటాయింపు అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్టు తెలిసింది. ఈ నెల 25 లేదా 26వ తేదీన పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం జరుగనుంది. ఆ తర్వాత రెండో జాబితా విడుదల ఉంటుందని పార్టీ వర్గాలు తెలిపాయి.

నిజాముద్దీన్ దర్గాలో చాదర్ సమర్పణ

రేవంత్‌రెడ్డి ఆదివారం ఢిల్లీలోని నిజాముద్దీన్ దర్గాను సందర్శించారు. పార్టీ నేత అజారుద్దీన్‌తో కలసి చాదర్ సమర్పించారు. అనంతరం రేవంత్ మాట్లాడారు. ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లో సెక్యులర్ ప్రభుత్వం ఏర్పాటు కావాలని కోరుకున్నామని చెప్పారు. మతసామరస్యాన్ని కాపాడే విధంగా పాలన అందించాలని కాంగ్రెస్ యత్నిస్తోందన్నారు. సెక్యులర్‌వాదిగా, కాంగ్రెస్ సిద్ధాంతాలు నమ్మిన వ్యక్తిగా దర్గాకు వచ్చానని పేర్కొన్నారు.

సూర్యాపేటలో బీసీ మీటింగ్ పెట్టనివ్వలేదు

- మహేశ్వర్‌రెడ్డి, గూడూరులను పార్టీ నుంచి బయటకు పంపారు
- ఎంపీ ఉత్తమ్‌పై మాజీ ఎంపీ వీహెచ్ విమర్శలు



సాక్షి, హైదరాబాద్: నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై సొంత పార్టీకి చెందిన మాజీ ఎంపీ, సీనియర్ నేత వి. హనుమంతరావు ధ్వజమెత్తారు. తాను అంబర్‌పేట నియోజకవర్గం నుంచే గతంలో గెలిచి మంత్రిని అయ్యానని, ఆ నియోజకవర్గం అభివృద్ధి కోసం పాటుపడ్డానని, తాను అక్కడ లక్ష్మణ్‌యాదవ్‌కు టికెట్ అడుగుతుంటే ఉత్తమ్ కుమార్‌రెడ్డి జోక్యం చేసుకుంటున్నారని ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ వెల్లడించారు. శ్రీకాంత్‌గౌడ్ అనే వ్యక్తి తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాడని, ఆయన్ని ప్రోత్సహిస్తూ తనపై ఉత్తమ్ దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. సూర్యాపేటలో బీసీ గర్జన సభ పెడతానని అంటే ఉత్తమ్ పెట్టనీయలేదని, ఆయనకు బీసీ ఓట్లు కావాలి కానీ, బీసీల మీటింగ్ వద్దా అని ప్రశ్నించారు. తన మనుషులైన మహేశ్వర్‌రెడ్డి, గూడూరు నారాయణరెడ్డిలను పార్టీ నుంచి బయటకు పంపింది ఉత్తమేనని ఆరోపించారు. పార్టీ మారుతున్నానని ప్రచారం చేసుకుని, బ్లాక్‌మెయిల్ చేసి ఉత్తమ్ స్క్రీనింగ్ కమిటీ లాంటి పదవులు తెచ్చుకున్నాడని విమర్శించారు. అంబర్‌పేట సీటు జోలికొస్తే ఉత్తమ్ వెంటపడుతానని హెచ్చరించారు. పార్టీ నుంచి చాలా మందిని బయటకు వెళ్లేలా చేసిన ఉత్తమ్ తనను కూడా పంపాలని కుట్ర పన్నుతున్నాడని, తాను గాంధీ కుటుంబానికి విధేయుడినని వీహెచ్ స్పష్టం చేశారు.

సోనియా.. తెలంగాణ ప్రజలకు దేవత: మల్లు రవి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీని బలిదేవతగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పోల్చడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి పేర్కొన్నారు. దుర్గాదేవి దేశప్రజలకు అమ్మవారిలాగా కనిపిస్తుందని, అలాగే నాలుగుకోట్ల తెలంగాణ ప్రజలకు సోనియాగాంధీ కూడా దేవతలా కనిపిస్తుందని ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అధికారం ఉందనే అహంకారంతో సోనియాను విమర్శించడం తగదని ఆ ప్రకటనలో మల్లు రవి హితవు పలికారు.

సమస్యలు పరిష్కరించే వరకు ఎన్నికల బహిష్కరణే

కుండిశేకుగూడలో ఆదివాసీల ఏకగ్రీవ తీర్మానం



ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

నార్నూర్: గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేంత వరకు ఎన్నికలు బహిష్కరించాలని ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలంలోని కుండిశేకుగూడ వాసులు తీర్మానం చేశారు. మారుమూల గ్రామమైన కుండిశేకుగూడలో దాదాపు 500కు పైగా ఆదివాసీ గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గతంలో గ్రామానికి తాగునీటి సమస్యతో పాటు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులంతా జిల్లా కేంద్రం వరకు పాదయాత్రగా తరలివెళ్లి కలెక్టరేట్ ఎదుట 20 రోజులపాటు ఆందోళనలు చేపట్టారు. స్పందించిన అప్పటి పీవో వరుణ్‌రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయించి తాగునీటి సౌకర్యం కల్పించారు. త్వరలో బీటీరోడ్డు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. ఆదివారం గ్రామస్తులంతా సమావేశమై గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేంత వరకు ఎన్నికలు బహిష్కరించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. పలు డిమాండ్లతో కూడిన ఫ్లెక్సీతో ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల ప్రచారానికి నాయకులు రావద్దని హెచ్చరిస్తున్నారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ సిడాం దౌలత్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దసరా తర్వాత ప్రచారంలో దూకుడు

- 27 నుంచి రాష్ట్రానికి బీజేపీ అగ్రనేతలు
- 27న అమిత్‌షా, 28, 29 తేదీలలో హిమంత, 31న యోగి పర్యటన

సాక్షి, హైదరాబాద్: దసరా పండుగ తర్వాత బీజేపీ అగ్రనేతలు, పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు రాష్ట్రంలో ఎన్నికల ప్రచారానికి రానున్నారు. వీరి పర్యటనల నిమిత్తం నాలుగు హెలికాప్టర్లను అద్దెకు తీసుకున్నట్టు పార్టీవర్గాల సమాచారం. ఈ నెల 27వ తేదీ నుంచి 31 మధ్య ముఖ్యనేతల విస్తృత ప్రచార కార్యక్రమాలుంటాయని పార్టీ నాయకులు చెబుతున్నారు. ఈ నెల 27న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటన ఖరారైనట్టు తెలుస్తోంది. 28, 29 తేదీలలో అసోం సీఎం హిమంత బిశ్వశర్మ, 31న యూపీ సీఎం యోగి పర్యటిస్తారని సమాచారం. వీరితో పాటు కేంద్రమంత్రి అర్జున్ ముండా, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, కర్ణాటక మాజీ సీఎం బీఎస్ యడ్యూరప్ప, చిరాగ్ పాశ్వాన్, ఇతర జాతీయ నేతలు వివిధ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని తెలుస్తోంది.

ఆరునెలల్లోనే హామీలు పక్కదారి: నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలు పూటకొకటి చొప్పున ఎగిరిపోతున్నాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఆదివారం మంత్రి మీడియాతో మాట్లాడారు. పాలనా సంస్కరణలు, అభివృద్ధి, సంక్షేమం రంగాల్లో తెలంగాణ తొమ్మిదిన్నరేళ్లలో అగ్రభాగాన నిలిచిందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన రాష్ట్రం కేవలం తెలంగాణ మాత్రమేనని పేర్కొన్నారు. ఇదివరకు కాంగ్రెస్ పాలనలో ఎదురైన కష్టాలను ప్రజలు మరిచిపోలేదని, రాష్ట్రంలో వరుసగా మూడో పర్యాయం కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వమే ఏర్పడుతుందని నిరంజన్‌రెడ్డి అన్నారు.

26న త్రిపుర గవర్నర్‌గా ఇంద్రసేనారెడ్డి ప్రమాణం

- త్రిపుర గవర్నర్ ఏడీసీ మేజర్ రోహిత్ సేథీ రాక
- గవర్నర్ నియామకపు ఉత్తర్వుల అందజేత

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 26వ తేదీ ఉదయం 11 గంటలకు త్రిపుర గవర్నర్‌గా నల్లు ఇంద్రసేనారెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గవర్నర్ నియామకానికి సంబంధించి రాష్ట్రపతి వెలువరించిన ఉత్తర్వులను (వారెంట్) త్రిపుర గవర్నర్ ఏడీసీ మేజర్ రోహిత్ సేథీ ఇంద్రసేనారెడ్డికి అందజేశారు. త్రిపుర రాష్ట్రానికి సంబంధించిన భౌగోళిక, ఇతర ముఖ్యమైన సమాచారాన్ని కూడా అందజేశారు. ఇంద్రసేనారెడ్డి ఈ నెల 25వ తేదీ ఉదయమే హైదరాబాద్ నుంచి బయల్దేరి వెళ్లనున్నారు. ఇంద్రసేనారెడ్డిని తోడ్కొని వెళ్లేందుకు ఈ నెల 24న త్రిపుర రాజ్‌భవన్ పేషీ సిబ్బంది హైదరాబాద్ చేరుకుంటారని సమాచారం.



ఇంద్రసేనారెడ్డికి ఉత్తర్వులను అందజేస్తున్న త్రిపుర గవర్నర్ ఏడీసీ మేజర్ రోహిత్ సేథీ

కేసీఆర్ పాలనలో రాష్ట్రం పురోగతి

నీరు, కరెంట్ కోతలకు చెక్

- పండుగలు సంతోషంగా నిర్వహించుకుందాం
- మంత్రి హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట): ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతిపథంలో ముందుకు సాగుతోందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో మంత్రి హరీశ్‌రావు దంపతులు సద్దుల బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్నారు. కోమటి చెరువువద్ద మంత్రితో మహిళలు, యువతులు సెల్ఫీలు, ఫొటోలు దిగడానికి పోటీపడ్డారు. మహిళలు తీసుకువచ్చిన ఫలహారాలు తింటూ మంత్రి వారితో ముచ్చటించారు. అనంతరం మాట్లాడుతూ ఎండాకాలాన్ని వానా కాలంగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, కుంటలు కాళేశ్వరం జలాలతో నిండు కుండల్లా మారాయన్నారు. సమైక్య రాష్ట్రంలో కరెంటు లేక ఇబ్బందులు పడ్డామని, నేడు నీరు, విద్యుత్ సరఫరా నిరంతరం జరుగుతోందని అన్నారు. మహిళల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ప్రజలందరూ బతుకమ్మ పండుగ చేసుకున్న విధంగానే దసరాను కూడా వైభవంగా నిర్వహించుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు ఆయన దసరా శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు బీఆర్‌ఎస్ యువజన నాయకుడు జువ్వన కనకరాజు ఆధ్వర్యంలో తయారు చేసిన భారీ బతుకమ్మను మంత్రి హరీశ్‌రావు తిలకించారు.



మహిళలతో సెల్ఫీ దిగుతున్న మంత్రి హరీశ్‌రావు



ప్రతి దేశ పునాది దాని యువత చదువుకోవడంలో ఉంది.
– డైయోజినీజ్

సాక్షి
సోమవారం, 23 అక్టోబర్ 2023

నిదురించని తోటలోకి

ఒక రాత్రి గజదొంగ ఒక ఇంట్లో ప్రవేశించాడు. అలికిడికి ఇంట్లో ఉన్న ముసలామె లేచింది. 'ఎవరూ?' అని గద్దించింది. 'నేను దొంగని' అన్నాడు దొంగ. 'ఆరి బడవా... నువ్వు రీతి జాతి ఉన్న దొంగవైతే ఇలా ఒంటరి ముసల్ది ఉన్న ఇంట్లో జొరబడతావా? నా కొడుకు పహిల్వాను. పక్క ఊరికి కుస్తీకి వెళ్లాడు. నీకు దమ్ముంటే రేపు నా కొడుకున్నప్పుడు వచ్చి దొంగతనం చెయ్యి' అంది. దొంగకు పౌరుషం వచ్చింది. 'అలాగే. నా రోషం నువ్వెరగవు. కాచుకో' అని వెళ్లిపోయాడు. మరుసటి రోజు కొడుకు వచ్చాడు. తల్లి భోజనం పెడుతూ జరిగింది చెప్పింది. కొడుకు తింటున్న వాడల్లా ముద్ద విడిచి విచారంగా కూచున్నాడు. 'ఏమి నాయనా?' అంది ముసలామె. 'అది కాదమ్మా... నువ్వేలా అలా సవాలు విసిరావు. వాడు దొంగ. ముందు దెబ్బ తీస్తాడో, వెనుక దెబ్బ తీస్తాడో, మత్తుమందు జల్లుతాడో, కొంపకు నిప్పెడతాడో ఎలా తెలుసు? నేరుగా వస్తే పోరాడి గెలుస్తానుగాని దొంగదెబ్బ తీస్తే ఏం చేయను? అవన్నీ కాదు. నిద్రనేది ఒకటి ఉంది కదా... నేను గుర్రు పెట్టి నిద్రపోతున్నప్పుడు వాడు బండరాయి తెచ్చి నెత్తినేస్తే ఏం చేయను' అన్నాడు. ముసలామె తెల్లముఖం వేసింది. మనిషికి నిద్ర ముంచుకొచ్చే రోజుల్లో పుట్టిన కథ ఇది.

ప్రేమ్‌చంద్ రాసిన 'పూస్ కీ రాత్' అనే కథ ఉంది. అందులో ఒక నిరుపేద రైతు తన పొలానికి గడ్డకట్టే చలికాలంలో కాపలా కాయాల్సి వస్తుంది. అతనికి కంబళి ఉండదు. పెళ్లాం, అతను కలిసి కంబళి కోసం మూడు రూపాయలు జమ చేస్తారు కాని ఎవరో అప్పులోడు వచ్చి ఆ డబ్బు పట్టుకెళతాడు. పేదరైతు ప్రతి రాత్రి చలిలో వణుకుతూ నిద్ర పట్టక పొలంలో నానా అవస్థలు పడతాడు. రోజంతా నిద్ర అతడి కనురెప్పల మీదే ఉంటుంది. నిద్ర కావాలి! ఆ రోజు పొలానికి వెళ్లి చలిమంట వేసుకుంటాడు. పక్కనే నడుము వాలుస్తాడు. ఎన్నాళ్లుగా ఆగి ఉందో నిద్ర... కమ్ముకుంది. ఒళ్లెరక్క నిద్ర పోయాడు. మంచును లెక్క చేయక నిద్ర పోయాడు. చలిమంట వ్యాపించి పంటంతా తగలబడినా అలాగే పడి నిద్ర పోయాడు. తెల్లారి భార్య వచ్చి గుండెలు బాదుకుంటూ 'పొలం తగలబడింది' అంటే రైతు లేచి చూసి 'దరిద్రం వదిలింది. ఇప్పుడైనా నిద్రపోని' అని నిద్ర పోతాడు. కష్టం చేసే వాడు నిదురకు పడే కష్టం గురించి ప్రేమ్‌చంద్ రాసిన కథ అది.

నిద్రంటే మనకు చప్పున గుర్తుకొచ్చే జంట ఊర్మిళ, లక్ష్మణస్వామి. అన్నతో పాటు లక్ష్మణుడు అడవికి పోతే పద్నాలుగేళ్లు ఊర్మిళ నిద్ర పోయింది. నిద్ర ఆమెను తన ఒడిలోకి తీసుకుంది. నిద్ర ఆమెను వాస్తవ కలతల నుంచి, భర్త ఎడబాటు దుఃఖం నుంచి, పోచికోలు కబుర్ల నుంచి, ఆరాల నుంచి కాపాడింది. ఊర్మిళకు నిద్ర పట్టకపోయి ఉంటే ఏమై ఉండేదో! శ్రీరాముడి పట్టాభిషేకఘట్టంలో లక్ష్మణుడు హఠాత్తుగా నవ్వడం చూసి ఎవరి వ్యాఖ్యానాలు వారు చేశారు. 'ఎందుకు నవ్వావు లక్ష్మణా' అనంటే 'పద్నాలుగేళ్లు కంటికి రెప్పలా అన్నా వదినలను కాచుకున్నప్పుడు ఒక్కసారి కూడా నిద్ర రాలేదు. తీరా ఇప్పుడు ఇంత గొప్పగా పట్టాభిషేకం జరుగుతుంటే ఈ మోసకారి నిద్ర ముంచుకొస్తున్నదే అని నవ్వాను' అంటాడు.

'కలలు కూడా దోచుకునే దొరలు ఎందుకు?' అంటాడు ఆత్రేయ ఏదో పాటలో. పేదవాడికి ఐశ్వర్యం, వైభోగం లేకపోవచ్చు. ఆరు రకాలుగా తినే వీలు లేకపోవచ్చు. కాని వాడు తుండు తల కింద పెట్టుకున్నాడంటే నిద్రలోకి జారుకుంటాడు. కలల్లో మునిగిపోతాడు. విన్సెంట్ వాన్ గో గీసిన 'నూన్– రెస్ట్ ఫ్రమ్ వర్క్' అనే ప్రఖ్యాత చిత్రం ఉంటుంది. కూలిపని చేసి మధ్యాహ్నం భోజన వేళ గడ్డివాములో కునుకు తీస్తున్న జంటను వేస్తాడు. ఆ క్షణంలో ఆ జంటను చూస్తే వారికి మించిన ఐశ్వర్యవంతులు లేరనిపిస్తుంది. విశ్రాంతినిచ్చే నిద్ర ఎంత పెద్ద లగ్జరీ. కుంభకర్ణుడొక్కడే జీవితమంటే ఉరుకులు పరుగులు కాదని మొదట గ్రహించినవాడు. అతడు ఆరునెలలు నిద్ర పోయేవాడంటే అర్థం– వెకేషన్‌లో ఉండేవాడని! తింటూ నిద్రపోతూ. ఆర్నెల్లు మాత్రమే పని. నెలలో రెండు వారాలు పని చేసి రెండు వారాలు విశ్రాంతి తీసుకునే నాగరిక సమాజం ఎప్పుడో వచ్చే తీరుతుంది.

'నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది' అని రాశాడు శేషేంద్ర. ఇప్పుడు మొక్కలు, పూలు ప్రతి ఇంటా ఉన్నా నిదురకు బీడువారిన కళ్లే చాలా ఇళ్లల్లో. కుక్కి మంచంలో సుఖంగా నిద్రపోయే కాలం నుంచి వేల రూపాయల పరుపు మీద కూడా సరిగా నిద్ర పట్టని మనుషుల సంఖ్య చాప కింద నీరులా పెరుగుతోంది. నిద్ర పట్టక, నిద్ర పోలేక, రాత్రి ఎంతకీ గడవక, నిద్ర మాత్రలు మింగలేక, మింగినా నిద్ర రాక... ఒక గొప్ప వైభోగమయ జీవన క్రియను కోల్పోయిన తాజా నిరుపేదలు. ప్రపంచంలో జపాన్ తర్వాత నిద్ర పట్టని వాళ్లు ఎక్కువ ఉన్న దేశం మనదే.

నిదుర ఎందుకు పట్టదు? లక్ష కారణాలు. కాని ఏది నిశ్చింత బతుకు అనేది ఎవరికి వారు వ్యాఖ్యానించుకుని అంతకు సంతప్తి పడటం నేర్చుకుంటే అదిగో బెడ్‌లైట్ స్విచ్చంత దూరంలో నిద్ర కాచుకుని ఉంటుంది. మీ జీవనంలోనే నిద్ర మాత్ర ఉంటుంది. వెతకండి. గాఢనిద్ర ప్రాప్తిరస్తు!

చేరువ కానివ్వని విరోధం!

కామెంట్



కరణ్ థాపర్

ఇజ్రాయెల్, పాలస్తీనా రెండూ కూడా వేటికవి తామే బాధితులమని సంకేత పరచుకునే ప్రభామండలాన్ని తమ శిరస్సుల వెనుక నేడు ధరించి ఉన్నాయి. ఆ ఇద్దరు ప్రత్యర్థులు రాజీ పడటానికి సిద్ధపడకపోవడం మాత్రమే కాదు, రాజీకి ప్రయత్నించినప్పుడు వారి వారి కరడుగట్టిన సమూహాలు వారిని పూర్తిగా వెనక్కు లాగిపడేయటం కూడా జరిగింది. ఇంకా అధ్వాన్నమైన సంగతి ఏమిటంటే... వారి స్నేహితులు, మిత్ర పక్షాలు.. వారిని చెలిమి వైపు ప్రోత్సహించేందుకు ఇష్టపడే అవకాశం కనిపించకపోవడం! వాషింగ్టన్ లేదా లండన్ గానీ, అరబ్ కేంద్రంగా ఉన్న దేశాలు గానీ నిజమైన రాజీకి వారిని ముందుకు నెట్టే ప్రయత్నం చేయడం లేదు.

ఇజ్రాయెల్–పాలస్తీనా వ్యవహారాలు నాకు ఏ విధంగానూ అంతుబట్టనివి. నిజానికి ఆ రెండు దేశాల మధ్య వివాదం గురించి నాకు తెలిసిన రవ్వంత కూడా నేను ఈ రెండు మూడు వారాలుగా తెలుసుకుంటూ వచ్చినదే. అయితే ఆ తెలివిడి నాకు ప్రశ్నలు అడిగేందుకు సరిపోయేదే తప్ప, జవాబులు ఇవ్వగలిగేటంతటిది కాదు. అయినప్పటికీ ఆ మాత్రపు జ్ఞానం నాలో ఒక అభిప్రాయాన్ని ఏర్పరచి దానిని నేను పూర్తిగా విశ్వసించేలా క్రమంగా నాలో నమ్మకాన్ని పెంచుతూ వచ్చింది. ఈ ఉదయం నేను మీతో పంచుకోవాలని అనుకుంటున్నది ఇదే.

ఇజ్రాయెల్, పాలస్తీనా రెండూ కూడా వేటికవి తామే బాధితులమని సంకేత పరచుకునే ప్రభామండలాన్ని తమ శిరస్సుల వెనుక నేడు ధరించి ఉన్నాయి. అయితే బాధ కంటే కూడా గర్వమే తరచూ ఆ ప్రభామండలం చుట్టూతా కాంతిలా ప్రకాశిస్తూ కనిపిస్తోంది. చరిత్రపై తమ దృష్టికోణమే సరైనదనే నమ్మకంతో, ఎవరికివారు స్వీయ నైతిక వర్తనను కలిగి ఉన్నామన్న విశ్వాసాన్ని సమానంగా కలిగి ఉన్నారు. వారు వర్తమానాన్ని ఎలా చూస్తున్నారన్న విషయంలోనూ ఇదే నిజం. 'అవతలి' దేశం తమ పట్ల ఘోరమైన తప్పిదాలకు ఒడిగట్టిందని ఆ రెండు దేశాలు ప్రగాఢంగా విశ్వసిస్తున్నాయి. అయితే వారు అంగీకరించలేని విషయం ఏమిటంటే... శత్రువు పట్ల తాము వ్యవహరిస్తున్న తీరులో ఇద్దరూ కూడా సరి సమానంగా దోషులేనన్నది!

తమకేదైతే జరిగిందో సరిగ్గా అదే తమ ప్రత్యర్థికీ జరిగిందని వారు అంగీకరించరు, అంగీకరించబోరు. ఆ విధమైన 'సమానత్వాన్నే' వారు నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నారు.

అందుకే చాలా తక్కువ మినహాయింపులతో – వాస్తవానికి మీరు వాటిని బహుశా చేతి వేళ్లపైన కూడా లెక్కించవచ్చు – ఇంటర్వ్యూలన్నీ భయానకమైన ఏకపక్ష ధోరణితో ఉన్నాయి. మీరు ఏ విధంగా ప్రశ్న వేసినా మీకు ఇంటర్వ్యూ ఇస్తున్న ఆహ్వానిత పాలస్తీనీయుడు ఆ ప్రశ్నకు జవాబుగా ఇజ్రాయెల్‌ను తీవ్రంగా విమర్శిస్తూ తామెంత ధర్మబద్ధులో, రుజు ప్రవర్తన కలిగినవారో చెప్పుకుంటారు. ఒక ఇజ్రాయెలీని ఇంటర్వ్యూ చేసినప్పుడు కూడా కచ్చితంగా ఇదే విధమైన స్వీయ సమర్థన వైఖరి వ్యక్తం అవుతుంది. ప్రతి ఒక్క విషయంలోనూ!

ఇజ్రాయెల్, పాలస్తీనా సంక్షోభంపై పద్నాలుగు రోజులలో పది ఇంటర్వ్యూల తర్వాత... ఈ రెండు వర్గాల వారు ఒకే భూమిపై – నిస్సందేహంగా ఒకరితో ఒకరు ఘర్షణ పడుతూనే, గాయాల రక్తం



ఓడుతూనే – కలిసి ఉంటూ కూడా భిన్న ప్రపంచాలలో జీవిస్తున్నారని నేను గ్రహించాను. పర్యవసానంగా తమ భిన్న చరిత్రల నుంచి మాత్రమే కాకుండా తాము పంచుకున్న చరిత్రల నుంచి కూడా వారు అంగీకరించిన కఠిన సత్యాలతో వారికొక జగమొండి ప్రాపంచిక దృష్టి కోణం ఏర్పడింది. తర్వాత అది వర్తమానంలోని విరుద్ధ కోణాలతో బలోపేతం అయింది. వాస్తవాలు ఒకేలా ఉన్నప్పటికీ వాటి అర్థ, వివరణలు పూర్తిగా భిన్నమైనవి.

విచారకరమైన వాస్తవం ఏంటంటే – ఈ రెండు దేశాల స్నేహితులు, మిత్రపక్షాలు దేనికి దానిని విడిగా చూడటం అనే ఏక వైఖరి దృష్టి కోణానికి లోబడి ఉండటం. 'ఏంటిది?!' అని పశ్చిమ దేశాలు ఇజ్రాయెల్‌ను ఏమాత్రం నిలదీయకుండా భూత వర్తమానాలపై ఆ దేశపు దృష్టి కోణాన్ని అంగీకరిస్తుండగా, మధ్యప్రాచ్యంలోని అరబ్, ముస్లిం దేశాలు పాలస్తీనా పట్ల తమ తమ అవగాహనలపై ఒకే విధమైన నిబద్ధతతో నిలబడి ఉన్నాయి. పర్యవసానంగా మీరు ఎవరికి మద్దతు ఇస్తున్నారనేది మీరెలాంటి ఆలోచనను కలిగి వున్నారన్న దానిని మాత్రమే కాక, జరుగుతున్న పరిణామాల పట్ల మీ స్పందనను కూడా నిర్ధారణగా తెలియజేస్తుంది. ఈ విధంగా ఇజ్రాయెల్ తోక పశ్చిమ కుక్కను ఊపుతుంది, అదే సమయంలో పాలస్తీనా తోక మధ్యప్రాచ్య కుక్కల్ని గుర్రుమని చూసేలా, మొరిగేలా ప్రేరేపించి వాటిని రెచ్చగొడుతుంది.

బహుశా అందుకే పాలస్తీనా–ఇజ్రాయెల్ వివాదం నేడు మనం ఎదుర్కొంటున్న వాటన్నింటిలోనూ కొంచెమైనా కొరుకుడు పడని అత్యంత కఠినమైన పరిస్థితిగా పరిణమించింది. ఆ ఇద్దరు ప్రత్యర్థులు రాజీ పడటానికి సిద్ధపడకపోవడం మాత్రమే కాదు, రాజీకి ప్రయత్నించినప్పుడు కూడా వారి వారి కరడుగట్టిన సమూహాలు ఆ సంశయాత్మక ప్రారంభ ఉద్దేశాన్ని పూర్తిగా వెనక్కు లాగిపడేయటం కూడా జరిగింది. బహుశా అధ్వాన్నమైన విషయం ఏమిటంటే వారి స్నేహితులు, మిత్ర పక్షాలు... వారిని చెలిమి వైపు ప్రోత్సహించేందుకు ఇష్టపడే అవకాశం కనిపించకపోవడం! వాషింగ్టన్ లేదా లండన్ గానీ, అరబ్ కేంద్రంగా ఉన్న దేశాలు గానీ నిజమైన రాజీకి వారిని ముందుకు నెట్టే ప్రయత్నం చేయడం లేదు. శత్రుత్వ విరమణ కోసం, స్వల్పకాలిక అర్భక ఒప్పందాల కోసమైతేనే నెడతాయి. కానీ ఏదైనా – అసలు స్వరూపాలకు భిన్నంగా నిజాయితీతో అడుగు వేసినప్పుడు మాత్రమే సాధ్యం అయ్యే – దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం మాత్రం నెట్టవు.

అందుకే నేను చేసిన గత రెండు వారాల ఇంటర్వ్యూలు ఆసక్తికరంగా ఉన్నాయి తప్పితే, ఆశాజనకంగా ఏమీ లేవు. పైగా నిస్పృహను కలిగించేలా ఉన్నాయి. నిజానికి, చెరగని విధంగా వారు వేసిన ముద్రే ఇక ఎటువంటి ఆశల్నీ పెట్టుకోలేని మనఃస్థితికి కారణం అయింది. ఇజ్రాయెల్–పాలస్తీనా ఊబిని బాగు చేయడం, ఆ సమస్యను పరిష్కరించడం అసాధ్యంలా కనిపిస్తోంది. నా భయం ఏంటంటే అనంతంగా అది నిరంతరం సాగిపోతూనే ఉంటుందని! రేపన్నది మిగతా ప్రపంచానికి మరొక రోజు కావచ్చు కానీ ఇజ్రాయెల్–పాలస్తీనాలకు మార్పును వాగ్దానం చేయని రోజూ ఉండే ఒక రోజే!

కాబట్టి మనం ఎదుర్కొంటున్న పరిస్థితి గురించి ఆలోచించండి. భీకరమైన హమాస్ దాడి ఇజ్రాయెల్ ఆత్మవిశ్వాసాన్ని ఛిద్రం చేసి, ఆ దాడిని తిప్పి కొట్టాలన్న ఆగ్రహ జ్వాలల్ని రగిల్చినందువల్ల – సాధ్యమైతే – ఏకంగా హమాస్‌ను తుడిచిపెట్టాలన్న ఇజ్రాయెల్ ప్రతీకారం వల్ల తీవ్రమైన మనోవేదన, ఎంతకూ తరగని బాధ మాత్రమే మిగిలి అనివార్యంగా అది భవిష్యత్తులో అధ్వాన్న పరిస్థితికి పునాదులు వేస్తుంది. ఇది దేనిని సూచిస్తోంది? అత్యంత విచారకరమైన, శోచనీయమైన ముగింపు ఏమిటంటే ఈ అంతులేని కథలో మరొక విషాద అధ్యాయానికి పునాది పడబోతుండటం! భవిష్యత్తు ప్రతిసారీ కూడా తిరిగి మనల్ని గతంలోకే తీసుకెళుతున్నట్లుగా కనిపిస్తోంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మనందరిది



జెరూసలేం మన అందరికీ చెందినది... పిల్లలు, అనుచరులు, అబ్రహాం కుటుంబం (యూదులు, క్రైస్తవులు, ముస్లింలు) అందరికీ. అది విద్రోహులకు, తీవ్రవాద మూకలకు మాత్రం చెందదు.

– మహమ్మద్ తాహిది, పీస్ యాక్టివిస్ట్

అది కదా గొప్ప!



ఇప్పుడు ఐఫోన్ ఇండియాలో తయారవుతోందని భారతీయులు ఎందుకంత గొప్పగా ఫీలవుతున్నారు? అది అమెరికా సృజన. చాలా ఏళ్లు చైనాలో తయారైంది. ఇప్పుడు ఇండియాలో అవుతోంది. అయితే మాత్రం ఏమిటట? ఇండియా ఒక యాపిల్ లాంటి కంపెనీని రూపొందించినప్పుడు కదా అసలైన సంబరం?

– సలీల్ త్రిపాఠీ, కాలమిస్ట్

భర్తీ పని



చాలా పనిచేసే ప్రతి ఒక్కరూ నిజంగానే తమ పని మీద అంతులేని ప్రేమతో చేస్తారని ఏమీ అనుకోనక్కర లేదు. చాలామంది తమ గుండెల్లో ఉన్న నిరర్థకతను, జీవితంలోని శూన్యాన్ని అలా 'పని'తో భర్తీ చేసుకుంటూ ఉంటారు.

– రేణూ ధడ్‌వాల్, అకడెమిక్

అద్భుత మినరల్



మెగ్నీషియం మీ నిద్రను మెరుగుపరుస్తుంది. మీ కండరాలను విశ్రమింపజేస్తుంది. మీ ఒత్తిడిని పోగొడుతుంది. మీ ఎముకలను దృఢపరుస్తుంది. మీ రక్తంలోని చక్కెరను స్థిరపరుస్తుంది. మీ విసర్జనను సాఫీగా ఉంచుతుంది. మెగ్నీషియం అనేది మీ మాంత్రిక ఖనిజ లవణం.

– జాన్ కాన్‌స్టాస్, మెడికల్ యాక్టివిస్ట్

వెనకుండి నడిపేది...



ప్రతి ఒక్క విజయవంతమైన యూఎస్ రాజకీయ నాయకుడి వెనుక ఒక జియోనిస్ట్ (యూదు సంబంధ) బిలియనీర్ ఉంటాడు. కాబట్టి జియోనిస్ట్ లాబీ ప్రభావాన్ని తొలగించలేనంతవరకూ మీరు యూఎస్ విదేశాంగ విధానాన్ని మార్చలేరు.

– ని మింగ్డా, భౌగోళికాంశాల విశ్లేషకుడు

మెరుగైన దారి



యూదు స్నేహితులు, మిత్రపక్షాలకు నేను చెప్పాలనుకుంటున్నది ఏమంటే – మీ బాధ, నిస్పృహలను నేను అర్థం చేసుకుంటున్నాను. 1,300 ఇజ్రాయిలీలను చంపేశారు. ఇంటికి సురక్షితంగా రావాల్సిన సుమారు 200 మంది ఇంకా బందీలుగా ఉన్నారు. గతవారం చాలామంది బాధ, ఆగ్రహానికి గురయ్యారు. ఇన్షా అల్లా! మన ఉమ్మడి మానవీయత మనకో మెరుగైన దారి చూపాలి.

– వజాహత్ అలీ, రచయిత

'అలయ్ బలయ్'

ఇది విజయ 'దశ'మి తెలంగాణ
సాగును వికాస పథాన
ప్రజలు నిలిచి ప్రజలు గెలుచు
ప్రజాస్వామ్య మాగాణ
దేశానికి ఉదాహరణ
మానవీయ కోణాన
సమకాలపు సవాళ్ళకు సమాధాన సజనధిషణ
సహృదయం సామర్థ్యం సమభావం మోగు వీణ
గంగా యమునల సంగమ
సామరస్య నిషానా
దసరా శోభాయాత్రలు
కలిసి నడవమంటవి
ఆత్మీయాలింగనాలు ఎదచప్పుడు వినమంటవి
జమ్మి ఆకు రెమ్మలే
మన పచ్చని బంగారం
మంచి పంచు గుణము చాలు
ప్రతి ఎద భాండాగారం
హద్దు మీరవద్దు గాని అడ్డంకులు మనకు వద్దు
పాలపిట్ట తీరు బతుకు
హాయిగ సాగుటె ముద్దు
ఒక పువ్వు కాదు గదా బతుకమ్మంటే
ఒక్క మనిషి కాదు గదా బతకడమంటే
పువ్వు పువ్వు కలిపి
బతుకమ్మను పేర్చినట్టు
నువ్వు నేను మనము కలిసి
బతుకు తీరు కూర్చుదాం
బుద్ధిజీవులం మనమని
బహుళార్థం మార్చుదాం
పరము తలచి ఇహమును
మలచమనే గుడిగంటలు
పండుగ పరమార్థమొకటే
నిండగ ప్రేమల పంటలు
వైరుధ్యాలంతరించి వైవిధ్యం స్వాగతించి
మంచిని పంచుదెగదా
మన దసరా పండుగ
అనవరతం ఆనందం అందరి గుండెల నిండుగ.



– మడిపల్లి దక్షిణామూర్తి :: మొబైల్: 98662 77107

ఇప్పటికీ ఆశావాదంతోనే ఉన్నాను!

అభిప్రాయం



దూతీ చంద్

స్వలింగ వివాహాన్ని చట్టబద్ధం చేయడానికి సుప్రీం కోర్టు మార్గం సుగమం చేస్తుందని దేశంలోని చాలా మంది ఇతరుల లాగే, నా భాగస్వామి మోనాలిసా, నేను కూడా ఆశించాము. మన దేశంలో గతంలోనూ పాతబడిన, కాలం చెల్లిన చట్టాలను కొట్టివేశారు. కొన్ని సానుకూల వార్తల కోసం మేమిద్దరం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాము. సుప్రీంకోర్టు తీర్పుతో నేను నిరుత్సాహానికి గురయ్యాను కానీ ఇప్పటికీ ఆశావాదంతోనే ఉన్నాను. స్వలింగ వివాహాలను అనుమతించే చట్టాన్ని త్వరలోనే పార్లమెంటు ఆమోదిస్తుందని నేను నమ్ముతున్నాను. భారతదేశం ప్రజాస్వామ్య దేశం. స్వలింగ వివాహాలను అనుమతించడమనేది ఎక్కువ మందికి ఆనందాన్ని ఇస్తుంది.

కొన్ని సంవత్సరాల క్రితం భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 377 (ప్రకృతికి విరుద్ధంగా ఏ పురుషుడితోనైనా, స్త్రీతో అయినా శారీరక సంబంధం పెట్టుకోవడంపై శిక్ష విధించడం)ను సుప్రీం కోర్టు నేరంగా పరిగణించనప్పుడే స్వలింగ సంపర్కం గురించి మాట్లాడే ధైర్యం వచ్చింది. స్వలింగ వివాహానికి మార్గం సుగమం చేయడమే ఇక తదుపరి చర్య అవుతుంది.

మా కేసే తీసుకోండి. సుప్రీం కోర్టు స్వలింగ వివాహాలను అనుమతిస్తుందన్న నమ్మకంతోనే వచ్చే ఏడాది మేము పెళ్లి చేసుకోబోతున్నాం. ఆ కోణంలో చూస్తే ప్రస్తుత తీర్పు ఎదురుదెబ్బే. మేము వచ్చే ఏడాది వివాహం చేసుకోవచ్చుగాక, ఓ సంబరాన్నీ జరుపుకోవచ్చుగాక. కానీ, దాన్ని సమాజం గుర్తించవలసినంతగా గుర్తించదు. పరిస్థితులు మారనప్పటికీ మేము కచ్చితంగా వివాహ వేడుకను నిర్వహిస్తాం. మేమూ వివాహానికి సంబంధించిన ఆచార సంప్రదాయాలను అనుభూతి చెందాలనుకుంటున్నాము.

ప్రజలు ఏమంటారన్నది నాకు ముఖ్యం కాదు, కానీ ఇతర దేశాలు స్వలింగ వివాహాలను అనుమతించినప్పుడు, భారతదేశంలో కూడా అదే జరుగుతుందని ఎవరైనా ఆశిస్తారు. ఇప్పుడు, మేము బయటకు వెళ్ళినప్పుడు కొన్నిసార్లు ప్రజలు మోనాలిసా ఎవరు అని నన్ను అడుగుతారు. ఈ ప్రశ్న నన్ను కలవరపెడుతుందని కాదు కానీ ఆమె నా భార్య అని చెబితే బాగుంటుంది. ప్రశ్నలు ముగుస్తాయి, ప్రజలు ఇతర జంటల లాగే మమ్మల్నీ చూస్తారు. ఈ అంశంపై పార్లమెంటే నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు కోరడానికి దాని



సహచరితో వ్యాసకర్త

కారణాలు దానికి ఉన్నాయి. నేను ఆ విషయం జోలికి వెళ్లదలచడం లేదు. అయితే స్వలింగ వివాహాలకు అనుమతిస్తే స్వలింగ జంటలపై విమర్శలు ఆగిపోతాయి. ఈ జంటల్లో కొందరికి నిరంతరం ఎవరో ఒకరి నిఘాలో ఉండటం, లేదా అసౌకర్యం కలిగించే ప్రశ్నలు ఎదుర్కోవడం కష్టంగా ఉంటుంది.

ఆరోగ్యం, బ్యాంక్ ఖాతాలు, చివరకు వీసా కోసం డాక్యుమెంటేషన్, రాతపని తదితర విషయాలకు వస్తే... స్వలింగ జంటలు ఎదుర్కొనే ఆచరణాత్మక సమస్యలు కూడా ఉన్నాయి. నేను భవిష్యత్తులో నా ఆస్తిని నా భాగస్వామికి బదిలీ చేయాలనుకుంటే అది సంక్లిష్టంగా మారవచ్చు. వయసు మీదపడిన తర్వాత మరిన్ని చిక్కులు వస్తాయి. మోనాలిసా, నేను 2018 నుండి భువనేశ్వర్‌లో కలిసి ఉంటున్నాము. మేము మొదట ఒక పూజా కార్యక్రమంలో కలుసుకున్నాము. అప్పటి నుండి కలిసి ఉంటున్నాం. మొదట్లో, మేము స్వలింగ జంట అని తెలిసినప్పుడు, వారు ఇది మంచిది కాదన్నారు. కానీ మేమిద్దరమూ ధైర్యవంతులమే కాబట్టి మెల్లగా వాళ్ల ఆలోచనా తీరు మారిపోయింది. కఠినమైన సమయాలు ఉండేవి. కానీ మేము వాటిని మా ప్రేమ మార్గంలోకి రానివ్వలేదు. ప్రజలు అర్థం చేసుకోవలసిన విషయం ఏమిటంటే, మేము ఒకరితో ఒకరం ప్రేమలో ఉన్నాము. పైగా నేను ఆమెను నాతో ఉండమని కానీ, ఆమె నన్ను ఆమెతో ఉండమని కానీ ఎప్పుడూ బలవంతం చేయడం జరగలేదు.

ఒకే ఇంట్లో ఉండే అన్ని జంటల మాదిరిగానే మేము కూడా మా జీవితంలో ఎగుడు దిగుడులను ఎదుర్కొన్నాము. అయితే మేం ఏం ఎదుర్కోవలసి వచ్చినా ప్రేమ ఒక బలమైన బంధాన్ని ఏర్పరుస్తుంది. పైగా మమ్మల్ని సంతోషపరుస్తుంది కూడా! ప్రజలు తాము కోరుకునే ఎవరితోనైనా జీవితాలను పంచుకొని జీవించగలగాలని నేను ఎప్పుడూ నమ్ముతూ వచ్చాను. ప్రేమ కంటే గొప్ప భావోద్వేగం ఏదీ లేదు. అంతే కాదు, సమ్మతితో ఉండే ఇద్దరు వ్యక్తుల ఆనందానికి ఏదీ అడ్డు రాకూడదు.


ఈ మధ్య ప్రజలు మరింత అవగాహనతో వ్యవహరిస్తున్నారు. దాదాపు పరిహాసాస్పదంగా చేసే వ్యాఖ్యలు ఆగిపోయాయి. పైగా 'మీరిద్దరూ పెళ్లెప్పుడు చేసుకోబోతున్నారు' అనే ప్రశ్న మాకు ఇప్పుడు ఎదురవుతోంది. స్వలింగ సంపర్కులకు సుప్రీం కోర్టు రక్షణలు, హక్కులను కల్పించింది. ఇటువంటి వాటిని మరిన్ని కల్పించాలని ఆశిస్తున్నాను.

వ్యాసకర్త 100 మీటర్ల పరుగులో జాతీయ రికార్డు హోల్డర్, ఆసియా క్రీడల రజత పతక విజేత

పండుగ సందేశం

ఆదిశక్తి అయిన దేవి... దుష్ట శిక్షణ చేసి శిష్టులను రక్షించేందుకు తొమ్మిది సార్లు అవతరించింది అని మార్కండేయ పురాణం.

వర్షాలు వెనకపట్టి శరదృతువు ఆరంభమవుతూనే, ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి నవమి దాకా, ఆస్తికులు అమ్మవారిని వివిధ నామ రూపాలలో, వివిధ అవతారాలలో, వివిధ పూజా విధులతో ఆరాధిస్తూ వైభవంగా దేవీ నవరాత్ర ఉత్సవాలు జరుపుతారు. శ్రీరాముడూ, శ్రీకృష్ణుడూ, ధర్మరాజు లాంటి మహనీయులు కూడా దేవీ నవరాత్రి వ్రతాలు జరపడం ద్వారానే వాళ్ళు తలపెట్టిన మహత్కార్యాలలో విజయం సాధించారని దేవీ భాగవతంలో కనిపిస్తుంది. నవరాత్రి పూజలతో దేవి అనుగ్రహం పొంది, దశమి నాడు ఆరంభించే కార్యాలలో, యత్నాలలో, యుద్ధాలలో అఖండ విజయం తథ్యమని పురాణాలు బోధిస్తాయి. శ్రవణా నక్షత్రంతో కలిసి వచ్చే ఆశ్వయుజ శుద్ధ దశమి శుభప్రదం కనుక అది 'విజయ'దశమి. ఏ కార్యాన్ని ఆరంభించేందుకయినా అది మంచి రోజే!



జ్యోతిర్మయం

దుర్గాదేవి మహిషాసురుడిని సంహరించిన తరువాత, దేవతలు ఆమెను అపరాజితగా ఆరాధిస్తూ విజయోత్సవాలు జరుపుకొన్నది విజయదశమి నాడు. నారదుడి ఆధ్వర్యంలో నవరాత్ర వ్రతం పూర్తిచేసిన తరవాత రాముడు రావణుడిని వధించాడు. రావణ వధ నవమి నాడు జరిగిందన్న ప్రతీతి వల్ల, ఆ మరుసటి దినమైన దశమి నాడు, నాటినుంచి నేటిదాకా, శ్రీరామ జయాన్ని కీర్తిస్తూ రామలీల ఉత్సవాలు చేసే ఆనవాయితీ వస్తున్నది. విరటుడి గోవులను కౌరవులు పట్టి తీసుకుపోతుండగా విజయుడు అడ్డుపడి, ఒంటిచేత్తో కురువీరులందరినీ ఓడించి తరిమింది కూడా విజయదశమి నాడే!

మామూలు పండుగ సరదాలన్నిటితో పాటు, విజయదశమి నాడు ఈ నాటికీ పాటించే విశేష విధులు కొన్ని ఉన్నాయి. దేవిని 'అపరాజిత'గా పూజించడం ఒకటి. పవిత్రమైన శమీ వృక్షాలకు నమస్కరించి, ప్రదక్షిణం చేయడం మరొకటి. ఆ జమ్మి ఆకులు బంగారంగా భావించి తెచ్చి పంచుకోవడమూ, వాటిని పెద్దలకిచ్చి ఆశీస్సులు పొందడమూ ఇంకొకటి. పొలాలలోకి వెళ్ళి పాలపిట్టల మంగళప్రదమైన దర్శనం చేయడం మరొకటి.

అనువైన కాలం రాగానే, ముందు దేవీ అనుగ్రహం సమకూర్చుకొని, ఆ వెంటనే పురుషకారానికి శ్రీకారం చుట్టే వాళ్ళను విజయం వరించక మానదని విజయదశమి సందేశం. సకల జనుల సమస్త సత్సంకల్పాలను కరుణామయురాలైన కనకదుర్గమ్మ తల్లి సంపూర్ణంగా సిద్ధింప జేయాలని విజయదశమి సందర్భంగా శుభాకాంక్షలు.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.నవమి ప.3.07 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** శ్రవణం ప.3.43 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** రా.7.26 నుండి 8.56 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.07 నుండి 12.54 వరకు, తదుపరి ప.2.25 నుండి 3.12 వరకు, **అమృతఘడియలు:** తె.4.23 నుండి 5.55 వరకు, మహానవమి, విజయ దశమి. ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.55, **సూర్యాస్తమయం:** 5.41.


వీరలక్ష్మిగా లక్ష్మీతాయారు

భద్రాచలం: భద్రాచలం శ్రీరామాలయంలో లక్ష్మీతాయారు అమ్మ వారు ఆదివారం వీర లక్ష్మిగా దర్శనమిచ్చారు.


మహాగౌరిగా సరస్వతి

భైంసా: నిర్మల్ జిల్లా బాసర సరస్వతి అమ్మవారు ఆదివారం మహాగౌరి అవతారం లో దర్శనమిచ్చారు.


మహిషాసురమర్దినిగా భద్రకాళి

హన్మకొండ కల్చరల్: వరంగల్ శ్రీభద్రకాళి ఆలయంలో ఆదివారం అమ్మవారిని మహిషాసురమర్దిని దుర్గాలంకారంలో అలంకరించారు.


మహాగౌరిదేవిగా జోగుళాంబ

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ ఆలయంలో ఆదివారం అమ్మవారు మహాగౌరిదేవిగా దర్శనమిచ్చారు.

గవర్నర్ దసరా శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: విజయ దశమి సందర్భంగా ప్రజలకు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుభాకాంక్షలు తెలిపా రు. దసరా పండుగ భక్తుల్లో ఆనం దోత్సాహాలను నింపుతుందన్నారు. అంతిమంగా చెడుపై మంచి విజయం సాధిస్తుందని ఈ పండుగ సందేశం ఇస్తుందని చెప్పారు. దుర్గాదేవి ఆశీస్సులతో వైరస్‌లు, పర్యావరణ విపత్తుల నుంచి ప్రజలకు రక్షణ కలగాలని ఆమె ఆకాంక్షించారు.

తెలంగాణ సంస్కృతిలో దసరాకు ప్రత్యేక స్థానం



దసరా పండుగను పురస్కరించుకొని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక జీవన విధానంలో దసరాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. దసరానాడు కుటుంబంలోని సభ్యులందరూ ఒకే చోట కూడి సామూహికంగా సంబురాలు జరుపు కోవడం తెలంగాణ సబ్బండ వర్గాల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. తెలంగాణకు నిత్య విజయాలు కలిగేలా దుర్గామాత కృపాక టాక్షాలు ప్రజలందరిపై వుం డాలని ఆయన ప్రార్థించారు.


ప్రియాంక బతుకమ్మ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర మహిళలకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో బతుకమ్మ ఫొటోతో శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకొనే దసరా పండుగ అందరికీ ఆనందాన్ని పంచాలని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.



హైదరాబాద్‌లోని తెలంగాణ అమరుల స్మారక కేంద్రం వద్ద నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో సీఎస్ శాంతి కుమారి, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, ఆర్థిక శాఖ కార్యదర్శి టీకే శ్రీదేవిలు పాల్గొన్నారు. అనంతరం వారు బతుకమ్మ ఆడారు.



ఘనంగా మహాపోచమ్మతల్లి గంగనీళ్ల జాతర

- పోటెత్తిన భక్తజనం


శోభాయాత్రలో వేలాది భక్తజనం

సారంగాపూర్/దిలావర్‌పూర్: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం అడెల్లి మహాపోచమ్మతల్లి గంగనీళ్ల జాతర చివరి రోజైన ఆదివారం వైభవంగా జరిగింది. ముందుగా దిలావర్‌పూర్ మండలం సాంగ్వి సమీపంలోని పవిత్ర గంగాజలంతో అమ్మవారి ఆభరణాలను శుద్ధి చేశారు. అనంతరం ఆభరణాలతోపాటు పవిత్ర గం గాజలంతో శోభాయాత్రగా తిరిగి అడెల్లి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని అలంకరించి గంగనీళ్లతో అభిషేకించారు. ఆభరణాలు తీసుకొచ్చే దారి పొడవునా శోభాయాత్రలో వేలాది భక్తజనం పాల్గొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలలనుంచే కాకుండా నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, మహారాష్ట్రలోని యావత్‌మాల్, నాందేడ్, చంద్రాపూర్ జిల్లాల నుంచి, మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు దర్శించుకుని పూజలు చేశారు.


హైదరాబాద్ జలవిహార్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నేతలు

సోషల్ మీడియాలో హోరెత్తించండి

▶ మొదటి పేజీ తరువాయి

లేవనెత్తే అంశాలు, చేసే విమర్శలపై స్థానికంగా ఎప్పటికప్పుడు స్పందించాలని ఆదేశించారు. మేనిఫెస్టోపై విమర్శలను తిప్పికొట్టడంతో పాటు అందులోని అం శాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గ్రామాల వారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేయాలని సూచించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నేతలు కొత్తరకం ఎన్నికల ప్రచార విధానాలకు అలవాటు పడాల్సిన అవసరం ఉందని అన్నారు. పార్టీ గుర్తును డీపీగా పెట్టుకోవడంతో పాటు చొక్కాలపై గుర్తును ధరించాలని సూచిం చారు. ప్రతి 100 మంది ఓటర్లకు ఒకరు చొప్పున ఇన్‌చార్జిలతో బూత్ కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

కాంగ్రెస్ గోబెల్స్ ప్రచారాన్ని తిప్పికొట్టండి: హరీశ్‌రావు

కాంగ్రెస్ పార్టీ చేస్తున్న గోబెల్స్ ప్రచారాన్ని తిప్పికొట్టడంతో పాటు పోలింగ్ ముగిసేం త వరకు పార్టీ నేతలు, కేడర్ కష్ట పడాలని మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. కాం గ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. అవసరమైన సందర్భాల్లో పార్టీ నేతలు బాధ్యతలు అప్పగించిన చోట నిద్రించాలన్నారు. ప్రతి గడపను చేరుకునేలా ప్రచారం జరగాలని చెప్పారు.

కృష్ణా తరంగాలపై ఆధ్యాత్మిక యాత్ర

- కనకదుర్గమ్మ చెంత నుంచి అమరేశ్వరుని వద్దకు బోటు ప్రయాణం
- మూడు దేవాలయాలు, రెండు పర్యాటక ప్రదేశాలను కలుపుతూ ప్రాజెక్టు.. ప్రత్యేక బోటు సిద్ధం చేస్తున్న ఏపీటీడీసీ

సాక్షి, అమరావతి: జీవన వాహిని కృష్ణవేణి ప్రవాహ మార్గంలో ఆధ్యాత్మిక, చారిత్రక, పర్యాటక ప్రదేశాలు ఎన్నో.. అటువంటి కృష్ణమ్మ ఒడిలో పడవపై ఆధ్యాత్మిక యాత్రకు రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)శ్రీకారం చుడుతోంది. ప్రకృతి రమణీయత, ఆధ్యాత్మిక శోభ కలయికగా ప్రాజెక్టును రూపొందిస్తోంది. పర్యాటకులకు నదీవిహారం మధురానుభూతి కలిగించేలా ఏర్పాట్లు చేస్తోంది. విజయవాడ నుంచి అమరావతి వరకు కృష్ణానదిపై ప్రత్యేక బోటు తిప్పేందుకు చర్యలు చేపడుతోంది. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని మూడు దేవాలయాలు, రెండు పర్యాటక ప్రాంతాలను ఒక్క రోజులో చుట్టివచ్చేలా ప్రయాణ మార్గాన్ని రూపొం దిస్తోంది. ఎకో–ఆధ్యాత్మిక పర్యాటకంలో భాగంగా ఏపీటీడీసీ కృష్ణానదిలో రానుపోనూ సుమారు 80 కిలోమీటర్ల బోటు ప్రయాణాన్ని అందుబాటులోకి తేనుం ది. విజయవాడలోని బెరంపార్కులో బయలుదేరే బోటు తొలుత కనకదుర్గమ్మ ఘాట్‌కు చేరుకుంటుంది. అమ్మవారి దర్శనం తరువాత అనంతవరంలోని శ్రీవేం కటేశ్వర స్వామి దర్శనం, అక్కడి నుంచి పంచారామాల్లో ఒకటైన అమరావతిలోని అమరలింగేశ్వర స్వామి దర్శనం చేయిస్తారు. మధ్యాహ్నం భోజనం తరువాత తిరుగు ప్రయాణంలో పవిత్ర సంగమం, భవానీద్వీపంలో పర్యాటకులు ఆనందంగా గడిపేలా ప్యాకేజీలు సిద్ధం చేస్తోంది. ఈ యాత్రలో ఆలయాల దర్శనంతో పాటు భోజన సదుపాయాలను ఏపీటీడీసీ స్వయంగా ఏర్పాటు చేస్తుంది. బోటులో గైడ్‌ను అందుబాటులో ఉంచనుంది. నాగార్జున సాగర్ నుంచి తీసుకొచ్చిన డబుల్ ఇంజిన్ బోటును ఏపీటీడీసీ ఈ ప్రాజెక్టు కోసం సిద్ధం చేస్తోంది. 40–45 మంది పర్యాటకులు కూర్చునేందుకు వీలుగా ఈ బోటులో సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. నాలుగు వారాల్లోగా బోటును సిద్ధం చేసి కార్తీకమాసంలో యాత్రకు పచ్చజెండా ఊపేలా కసరత్తు చేస్తోంది.



క్లుప్తంగా...

గగన్‌యాన్‌లో మహిళా పైలట్లకు ప్రాధాన్యం

ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ వెల్లడి

తిరువనంతపురం: గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా చేపట్టే మానవసహిత అంతరిక్ష కార్యక్రమంలో మహిళా పైలట్లు, మహిళా శాస్త్రవేత్తలకే ఇస్రో ప్రాధాన్యం ఇస్తుందని, భవిష్యత్తులో మహిళా వ్యోమగాములనే అంతరిక్షంలోకి పంపుతామని సంస్థ చైర్మన్ ఎస్.సోమనాథ్ వెల్లడించారు. వచ్చే ఏడాది ప్రయోగించే మానవ రహిత గగన్‌యాన్ అంతరిక్ష నౌకలో మనిషిని పోలిన మహిళా హ్యూమనాయిడ్‌ను ఇస్రో పంపుతుందని తెలిపారు. 2025 నాటికి మానవ సహిత మిషన్‌ను భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులోని దిగువ కక్ష్యలోకి పంపుతామని, అది మూడు రోజుల తర్వాత సురక్షితంగా భూమికి తిరిగి చేరుకుంటుందని వివరించారు. ప్రస్తుతానికి మహిళా ఫైటర్ టెస్ట్ పైలట్లు దొరకనందున ఎయిర్ ఫోర్స్ ఫైటర్ టెస్ట్ పైలట్లనే అంతరిక్ష యాత్రకు ఎంపిక చేస్తున్నాం. మహిళా పైలట్లు అందుబాటులోకి వస్తే వారినే ఎంపిక చేసుకుంటాం. ఆ తర్వాత మహిళా సైంటిస్టుల వంతు. అప్పుడిక మహిళలకు ఎక్కువ అవకాశాలు అందుబాటులోకి వస్తాయి' అని సోమనాథ్ చెప్పారు. 2035 నాటికి పూర్తి స్థాయిలో అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఇస్రో లక్ష్యంగా పెట్టుకుందని వెల్లడించారు. శనివారం గగన్‌యాన్ యాత్రలో సన్నాహక పరీక్షల్లో భాగమైన క్రూ ఎస్కేప్ మాడ్యూల్‌ను ఇస్రో విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే.

ఫిలిప్పీన్స్ నౌకలను ఢీకొట్టిన చైనా కోస్ట్‌గార్డ్ షిప్

మనీలా: దక్షిణ చైనా సముద్రంలోని వివాదాస్పద ప్రాంతంలో ఆదివారం ఫిలిప్పీన్స్, చైనా మధ్య మరోసారి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. తమ కోస్ట్ గార్డ్ నౌక, మిలటరీ రవాణా బోటులను చైనా కోస్ట్‌గార్డ్ షిప్, దానితోపాటే వచ్చిన చైనా నౌక ఢీకొట్టాయని ఫిలిప్పీన్స్ అధికారులు తెలిపారు. ఘటనలో తమ సిబ్బందికి ఎటువంటి గాయాలు కాలేదని, నౌకలకు వాటిల్లిన నష్టంపై అంచనా వేస్తున్నామన్నారు. తమ నౌకలు వేగంగా ప్రయాణించకపోయుంటే చైనా నౌకల కారణంగా తీవ్ర నష్టం వాటిల్లేదని చెప్పారు. థామస్ షోల్ వద్ద ఉన్న ఫిలిప్పీన్స్ మెరైన్ పోస్టుకు సమీపంలో ఈ నెలలో చోటుచేసుకున్న రెండో ఘటన ఇది అని చెప్పారు. ఫిలిప్పీన్స్ అంతర్జాతీయ నిబంధలను ఉల్లంఘిస్తూ తమ నౌకల ప్రమాదాలకు కారణమవుతోందని చైనా ఆరోపించింది.

ఇరాన్‌లో మహిళా జర్నలిస్టులకు ఏడేళ్ల జైలు

దుబాయ్: ఇద్దరు మహిళా జర్నలిస్టులకు ఇరాన్ ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. గతేడాది ఇరానీ మహిళ మహసా అమినీ కస్టడీ మరణం పెను సంచలనం సృష్టించడం, దాన్ని నిరసిస్తూ దేశ వ్యాప్తంగా ఆందోళనలు చెలరేగడం తెలిసిందే. ఆ కస్టడీ మరణంపై రిపోర్టింగ్ చేసినందుకు సదరు మహిళా జర్నలిస్టులు ఆలాహే మొహమ్మది (36), నిలోఫర్ హమెదీ (31)లను దోషులుగా న్యాయ శాఖ నిర్ధారించింది. అలాహేకు ఆరు సంవత్సరాలు, హమెదీకి ఏడు సంవత్సరాల జైలు శిక్ష పడింది. వారిద్దరూ 2022 సెప్టెంబర్ నుంచీ టెహ్రాన్‌లోని ఎవిన్ జైలులో మగ్గిపోతున్నారు. గత మే నెలలో వారిపై విచారణ మొదలైంది. తాజా తీర్పుపై వారు అప్పీల్‌కు వెళ్లేందుకు అవకాశం కల్పించామని న్యాయ శాఖ పేర్కొంది.

దుర్గా మండపంలో అమెరికా రాయబారి గార్సెట్టి డ్యాన్స్



న్యూఢిల్లీ: భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి ఆదివారం హల్‌చల్ చేశారు. ఢిల్లీలోని సీఆర్ పార్కులో ఏర్పాటు చేసిన దుర్గా మండపానికి వెళ్లిన ఆయన..సంప్రదాయ ధునుచి డ్యాన్స్ చేసి, అందరినీ వినోద పరిచారు. ఇందుకు సంబంధించిన వీడియోను గార్సెట్టి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. బెంగాలీ స్ట్రీట్ ఫుడ్ ఝుల్మురితోపాటు కొన్ని రకాల బెంగాలీ స్వీట్లను రుచి చూసిన ఆయన 'ధునుచి నాచ్'లో పాల్గొన్నారు. ఉత్సవంలో పాలుపంచుకున్నందుకు ఎంతో ఆనందంగా ఉందంటూ అందులో పేర్కొన్నారు. దుర్గా మాత మండపాల్లో సాధారణంగా చేసే నాట్యాన్ని ధునుచి నాచ్ అని పిలుస్తుంటారు. దేవతకు హారతి ఇచ్చేందుకు వాడే మట్టి పాత్రనే ధునుచి అంటారు.

ఢిల్లీకి 'గాలాడటం' లేదు

'వెరీ పూర్' స్థాయికి వాయు నాణ్యత

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో వాయు నాణ్యత ఈ సీజన్‌లో మొదటిసారిగా ఆదివారం 'వెరీ పూర్' స్థాయికి పడిపోయింది. శనివారం 248గా ఉన్న సగటు వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 24 గంటల వ్యవధిలో 313కు పడిపోయింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులే ఇందుకు కారణమని అధికారులు చెబుతున్నారు. దాంతో ఢిల్లీ పర్యావరణ మంత్రి గోపాల్‌రాయ్ సోమవారం సంబంధిత శాఖలతో సమీక్ష జరపనున్నారు. ప్రైవేటు వాహనాల రాకపోకలను వీలైనంతగా తగ్గించేందుకు ప్రభుత్వ యంత్రాంగం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా పార్కింగ్ ఫీజులు పెంచడం వంటి చర్యలు చేపట్టింది. హోటళ్లలో తందూరీ పొయ్యిలపై నిషేధం విధించింది. సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని, మెట్రో రైలు సర్వీసుల సంఖ్యను పెంచాలని కోరింది. ఢిల్లీకి 300 కిలోమీటర్ల పరిధిలోపలున్న కాలుష్య కారక పారిశ్రామిక యూనిట్లు, థర్మల్ విద్యుత్ ప్లాంట్లను మూసివేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నిర్మాణాలు జరుగుతున్న, కూల్చివేత ప్రాజెక్టులు చేపట్టిన చోట్ల దుమ్ము రేగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

హమాస్‌పై ముప్పేట దాడి

గాజా, సిరియా, వెస్ట్‌బ్యాంక్‌లో మిలిటెంట్ల స్థావరాలపై క్షిపణుల వర్షం

- ఇజ్రాయెల్–హమాస్ మధ్య ఘర్షణలు మరింత ఉధృతం
- గాజాపై భూతల దాడులకు ఇజ్రాయెల్ ఏర్పాట్లు
- సానుకూల పరిస్థితులు ఏర్పడగానే గాజాలోకి ప్రవేశిస్తామన్న సైన్యం

రఫా(గాజా స్ట్రిప్)/జెరూసలేం/న్యూఢిల్లీ/టెల్ అవీవ్: పాలస్తీనా మిలిటెంట్ సంస్థ హమాస్, ఇజ్రాయెల్ సైన్యం మధ్య ఘర్షణలు మరింత ఉధృతం అవుతున్నాయి. ఇజ్రాయెల్ భీకర యుద్ధం ప్రారంభించింది. ఇప్పటిదాకా గాజాలో వైమానిక దాడులు నిర్వహించగా, ఇక సిరియా, వెస్ట్‌బ్యాంక్‌లోని హమాస్ స్థావరాలపైనా దృష్టి పెట్టింది. గాజాతోపాటు సిరియాలో రెండు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులు, వెస్ట్‌బ్యాంక్‌లో ఒక మసీదుపై క్షిపణులు ప్రయోగించింది. శనివారం రాత్రి మొదలైన ఈ దాడుల ఆదివారం కూడా కొనసాగాయి. మూడు ప్రాంతాల్లోని టార్గెట్లపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు నిప్పుల వర్షం కురిపించాయి. సిరియాలోని ఎయిర్‌పోర్టులు, వెస్ట్‌బ్యాంక్ మసీదును హమాస్ మిలిటెంట్లు అడ్డాగా మార్చుకున్నారని, అక్కడి నుంచే తమపై దాడులకు సన్నాహాలు చేస్తున్నారని, అందుకే ముందుగానే ఎదురుదాడి చేశామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. సిరియా ఎయిర్‌పోర్టులపై జరిగిన దాడిలో ఒకరు మరణించారు. రన్‌వేలు దెబ్బతిన్నాయి. వెస్ట్‌బ్యాంక్‌లో కనీసం ఐదుగురు మరణించారు. మరోవైపు లెబనాన్‌లోని హెజ్బొల్లా మిలిటెంట్ గ్రూప్ ఇజ్రాయెల్ భూభాగంపై రాకెట్లు ప్రయోగిస్తూనే ఉంది. ఇజ్రాయెల్ దళాలు సైతం ప్రతిదాడి చేస్తున్నాయి. దీంతో ఇజ్రాయెల్–లెబనాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

సైన్యం సన్నద్ధతపై నెతన్యాహూ సమీక్ష

ఇజ్రాయెల్–హమాస్ మధ్య యుద్ధం మొదలై రెండు వారాలు దాటింది. ఇప్పటివరకు గాజాలో 4,385 మంది జనం మృత్యువాతపడ్డారు. ఇజ్రాయెల్‌లో 1,400 మందికిపైగా మరణించారు. గాజాపై భూతల దాడులకు ఇజ్రాయెల్ సైన్యం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ శనివారం రాత్రి మంత్రివర్గ సహచరులతో సమావేశమయ్యారు. ఉత్తర గాజాపై భూతల దాడుల విషయంలో సైన్యం సన్నద్ధతపై ఈ భేటీలో సమీక్ష సమాచారం. ఇజ్రాయెల్–గాజా సరిహద్దుల్లో వేలాదిగా ఇజ్రాయెల్ సైనికులు మోహరించారు. ఇజ్రాయెల్ హెచ్చరికల నేపథ్యంలో ఉత్తర గాజా నుంచి ఇప్పటికే 7 లక్షల మంది జనం దక్షిణ గాజాకు వెళ్లిపోయినట్లు అంచనా.

అనూహ్య స్థాయిలో 'తదుపరి దాడి'

గాజాపై జరుగుతున్న వైమానిక దాడులు 'యుద్ధంలో తదుపరి దశకు రంగం సిద్ధం చేయడానికేనని ఇజ్రాయెల్ సైనిక ప్రతినిధి రియర్ అడ్మిరల్ డేనియల్ హగారీ చెప్పారు. తదుపరి దాడి అనూహ్య స్థాయిలో ఉంటుందని అన్నారు. తమ పదాతి దళాలు గాజా భూభాగంలోకి అడుగుపెట్టడానికి వీలుగా సానుకూల పరిస్థితులు సృష్టించడానికి వైమానిక దాడులు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సానుకూల పరిస్థితులు ఉన్నప్పుడే తదుపరి దశ యుద్ధంలోకి ప్రవేశించాల్సి ఉంటుందని అన్నారు. హమాస్‌ను అంతం చేయడానికి గాజాలో అడుగుపెడతామని ఇజ్రాయెల్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ హెర్జీ హాలేవీ చెప్పారు. మిలిటెంట్ల సన్నద్ధతను తక్కువ అంచనా వేయొద్దని తమ సైన్యానికి సూచించారు. ఆయన తాజాగా ఇజ్రాయెల్ సైనికాధికారులతో సమావేశయ్యారు. గాజాలో ప్రవేశించిన తర్వాత ఊహించని పరిణామాలకు సైతం సిద్ధంగా ఉండాలని అన్నారు. కిక్కిరిసిన జనాభాతో గాజా స్ట్రిప్ చాలా సంక్లిష్టంగా ఉంటుందని తెలిపారు. శత్రువులు మన కోసం అక్కడ ఎన్నో యుద్ధ రీతులను సిద్ధం చేసి పెట్టారని, మన ప్రతిస్పందన అత్యంత చురుగ్గా, వేగంగా ఉండాలని సూచించారు.

ఇజ్రాయెల్ తాజా హెచ్చరిక

గాజా ప్రజలకు ఇజ్రాయెల్ సైన్యం మరోసారి అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది. ఉత్తర గాజా నుంచి దక్షిణం గాజాకు వెంటనే వెళ్లిపోవాలని ఆదేశించింది. అలా వెళ్లనివారిని హమాస్ మిలిటెంట్ల సానుభూతిపరులుగా పరిగణిస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇజ్రాయెల్ రక్షణ దళం(ఐడీఎఫ్) పేరు, లోగోతో ఉన్న కరపత్రాలను గాజా సరిహద్దు ప్రాంతాల్లో ప్రజలకు పంపిణీ చేశారు. అలాగే మొబైల్ ఫోన్ ఆడియో సందేశాలను కూడా గాజా స్ట్రిప్‌లోని ప్రజలకు చేరవేశారు. ''ఉత్తర గాజాలో మీకు ముప్పు పొంచి ఉంది. దక్షిణ గాజాకు వెళ్లకుండా ఉత్తర గాజాలోనే ఉండిపోవాలని నిర్ణయించుకున్నవారిని హమాస్ సానుభూతిపరులుగా పరిగణిస్తాం'' అని అందులో పేర్కొన్నారు.

పాలస్తీనియన్లకు భారత్ ఆపన్న హస్తం

గాజాలోని పాలస్తీనియన్లకు భారత్ ఆపన్న హస్తం అందిస్తోంది. 6.5 టన్నుల ఔషధాలు, 32 టన్నుల విపత్తు సహాయక సామగ్రిని పంపించింది. ఔషధాలు, సామగ్రితో భారత వైమానిక దళానికి చెందిన సి–17 రవాణా విమానం ఆదివారం భారత్ నుంచి నుంచి బయలుదేరింది. ఇది ఈజిప్టులోని ఎల్–అరిష్ ఎయిర్‌పోర్టుకు చేరుకోనుంది. మానవతా సాయాన్ని అక్కడి నుంచి ప్రత్యేక వాహనాల్లో గాజాకు చేరవేయనున్నట్లు భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. అత్యవసర ప్రాణ రక్షక ఔషధాలు, సర్జికల్ సామగ్రి, టెంట్లు, స్లీపింగ్ బ్యాగులు, టార్పాలిన్లు, శానిటరీ వస్తువులు, నీటి శుద్ధి మాత్రలు తదితర సామగ్రిని గాజాకు పంపించినట్లు తెలియజేశారు. పాలస్తీనియన్లకు మరింత సాయం పంపిస్తామని వెల్లడించారు. గాజాలో సామన్య ప్రజల మరణం పట్ల భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇప్పటికే పాలస్తీనా అథారిటీ అధ్యక్షుడు మొహమ్మద్‌కు అబ్బాస్‌కు ఫోన్ చేసి, సంతాపం ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఈజిప్టు నుంచి గాజాకు రెండో షిప్‌మెంట్

ఇజ్రాయెల్ సైన్యం దాడులతో అల్లాడిపోతున్న గాజాలోని పాలస్తీనియన్లకు మానవతా సాయం ఇప్పుడిప్పుడే చేరుతోంది. నిత్యావసరాలు, ఇతర సహాయక సామగ్రితో కూడిన 17 వాహనాలు ఆదివారం ఈజిప్టు నుంచి గాజాలో అడుగుపెట్టాయి. గత రెండు రోజుల వ్యవధిలో ఇది రెండో షిప్‌మెంట్. శనివారం 20 వాహనాలు ఈజిప్టు నుంచి గాజాకు చేరుకున్నాయి.









గాజాలో గాయపడిన చిన్నారులను ఆస్పత్రులకు తరలిస్తున్న దృశ్యాలు



ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడిన శిశువుకు యూనిస్ ఖాన్‌లోని ఆస్పత్రిలో వైద్యుల చికిత్స

చిన్నారులే సమిధలు

గాజాలో ప్రతి 15 నిమిషాలకు ఒకరి మృతి | ఇప్పటికే 1,000కిపైగా బాలల మరణాలు

ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో గాజాలో పెద్దసంఖ్యలో చిన్నారులు మృత్యువాత పడుతున్నారు. గాజాలోని 23 లక్షల జనాభాలో దాదాపు సగం మంది 18 ఏళ్లలోపువారే ఉన్నారు. ఇజ్రాయెల్ సైన్యం కొనసాగిస్తున్న వైమానిక దాడుల్లో గాజాలో ప్రతి 15 నిమిషాలకు ఒక చిన్నారి బలైపోతున్నట్లు పాలస్తీనియన్ స్వచ్ఛంద సంస్థ ఒకటి వెల్లడించింది. నిత్యం 100 మందికిపైగా చనిపోతున్నారని తెలియజేసింది. ఈ నెల 7న ఇజ్రాయెల్–హమాస్ మిలిటెంట్ల మధ్య యుద్ధం మొదలైంది. ఇప్పటిదాకా గాజాలో 3,400 మందికిపైగా జనం మరణించారు. వీరిలో 1,000 మందికిపైగా బాలలు ఉన్నట్లు అంచనా. అంటే ప్రతి ముగ్గురు మృతుల్లో ఒకరు చిన్నపిల్లలే కావడం గమనార్హం. గాజాలో అచ్చంగా నరమేధమే సాగుతోందని డిఫెన్స్ ఫర్ చిల్డ్రన్ ఇంటర్నేషనల్–పాలస్తీనా(డీసీఐపీ) అధికార ప్రతినిధి ఒకరు వ్యాఖ్యానించారు. గాజాతో పోలిస్తే ఇజ్రాయెల్‌లో ప్రాణనష్టం తక్కువ. హమాస్ దాడుల్లో ఇజ్రాయెల్‌లో ఇప్పటివరకు 1,400 మంది మృతిచెందగా, వీరిలో 14 మంది బాలలు ఉన్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

- గాజాను ఇజ్రాయెల్ సైన్యం దిగ్బంధించింది. ఆహారం, నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు చెబుతున్నా అవి చాలామందికి అందడం లేదు.
- తగినంత ఆహారం, నీరు లేక గాజాలో పిల్లలు డీహైడ్రేషన్‌కు గురవుతున్నారు. అనారోగ్యం పాలవుతున్నారు. పారిశుధ్య వసతులు లేకపోవడంతో డయేరియా వంటి వ్యాధులు ప్రబులుతున్నాయని పేర్కొంటున్నారు.
- యుద్ధం కారణంగా పిల్లల్లో మానసిక సమస్యలు తలెత్తుతున్నాయని స్థానిక అధికారులు చెప్పారు. అకారణంగా భయపడడం, రోదించడం వంటివి చేస్తున్నారని తెలియజేశారు.
- రణక్షేత్రంలో దాడులు, ప్రతిదాడులు చూస్తూ పెరిగిన పిల్లల్లో హింసాత్మక ధోరణి పెరుగుతుందని, భవిష్యత్తులో వారు అసాంఘిక శక్తులుగా మారే ప్రమాదం ఉందని మానసిక శాస్త్ర నిపుణులు అంటున్నారు.
- యుద్ధాల సమయంలో బాలలకు హక్కులుంటాయి. వారి ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ఇరుపక్షాలకూ ఉంటుంది.
- చిన్నారుల ప్రాణాలను రక్షించాలంటూ 1949లో జెనీవాలో తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని 1951లో ఇజ్రాయెల్ ఆమోదించింది.

గాజాలో జరిగిన యుద్ధాల్లో మృత్యుఘోష

యుద్ధం	మృతి చెందిన మైనర్లు
2008-09	341
2012	35
2014	532
2021	66
2023	ఇప్పటికే 1,000కిపైగా

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇజ్రాయెల్–హమాస్ ముఖాముఖి పోరు

ఇజ్రాయెల్ బుల్డోజర్లు, యుద్ధట్యాంకును ధ్వంసం చేశామన్న హమాస్

గాజా: ఇన్నాళ్లూ పరస్పరం వైమానిక దాడులకు, రాకెట్ దాడులకే పరిమితమైన ఇజ్రాయెల్ సైనికులు, హమాస్ మిలిటెంట్లు తొలిసారిగా ప్రత్యక్షంగా తలపడ్డారు. గాజా భూభాగంలో ఇరుపక్షాల మధ్య ముఖాముఖి పోరు సాగిందని హమాస్ సైనిక విభాగం అల్–ఖసమ్ బ్రిగేడ్స్ ఆదివారం వెల్లడించింది. ఈ నెల 7న యుద్ధం మొదలైన తర్వాత భూభాగంపైన ఇజ్రాయెల్, హమాస్ మధ్య ప్రత్యక్షంగా ఘర్షణ జరగడం ఇదే మొదటిసారి. తమ భూభాగంలోకి దూసుకొచ్చిన ఇజ్రాయెల్ మిలటరీకి చెందిన రెండు బుల్డోజర్లను, ఒక యుద్ధ ట్యాంక్‌ను ధ్వంసం చేశామని హమాస్ మిలిటెంట్లు ప్రకటించారు. తమ ఎదురుదాడిని తట్టుకోలేక ఇజ్రాయెల్ సైన్యం వాహనాలు వదిలేసి కాలినడకన వారి సరిహద్దు వైపు పలాయనం చిత్తగించిందని స్పష్టం చేసింది. ఈ మేరకు అల్–ఖసమ్ బ్రిగేడ్స్ సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఖాన్ యూనిస్ సిటీలో ఇజ్రాయెల్ సైన్యాన్ని ధీటుగా ఎదుర్కొన్నామని తెలియజేసింది. అల్–ఖసమ్ బ్రిగేడ్స్ ప్రకటనపై ఇజ్రాయెల్ సైన్యం ప్రతిస్పందించింది. దక్షిణ గాజాలో సెక్యూరిటీ ఫెన్స్ వద్ద విధి నిర్వహణలో ఉన్న తమ బలగాలపై స్వల్పంగా కాల్పులు జరిగాయని స్పష్టంచేసింది. కాల్పులు జరిపిన మిలిటెంట్లపై తమ యుద్ధ ట్యాంకు నుంచి ప్రతిదాడి చేశామని పేర్కొంది. దాంతో వారంతా చెల్లాచెదురు అయ్యారని వెల్లడించింది. గాజా భూభాగంలో తమ సేనలు మకాం వేసిన మాట వాస్తవమేనని ఇజ్రాయెల్ మరోసారి అంగీకరించింది. ఈ నెల 13న కూడా ఇదే మాట చెప్పింది. కానీ, హమాస్‌తో ముఖాముఖి ఘర్షణ జరిగినట్లు వెల్లడించడం మాత్రం ఇదే ప్రథమం. ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ వైమానిక దాడిలో హమాస్ ప్రముఖ నేత ముహమ్మద్ కటామాష్ హతమయ్యాడు.

ఎల్‌ఏసీ వెంట చైనా మోహరింపులు

- 2022లో భారీగా నిర్మాణాలు
- విమానాశ్రయం, హెలిపాడ్లు
- అమెరికా రక్షణ శాఖ నివేదికలో వెల్లడి

వాషింగ్టన్: అది 2022 సంవత్సరం. చైనాతో సరిహద్దు ఉద్రిక్తతలు తారస్థాయికి చేరిన వేళ. ఆ సమయంలో చైనా చడీచప్పుడూ లేకుండా వాస్తవాధీన రేఖ వెంబడి అన్నిరకాలుగా బలపడే ప్రయత్నాలు చేస్తూ వచ్చింది. ముఖ్యంగా అరుణాచల్‌ప్రదేశ్ వెంబడి సైనిక మోహరింపులను విపరీతంగా పెంచేసింది. డోక్లాం వెంబడి భూగర్భ నిల్వ వసతులను పటిష్టపరుచుకుంది. మరెన్నో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకుంది. పాంగాంగ్ లేక్ మీదుగా రెండో వంతెనతో పాటు డ్యుయల్ పర్పస్ ఎయిర్‌పోర్టు, మల్టిపుల్ హెలిపాడ్లను నిర్మించుకుంది. తూర్పు లద్దాఖ్ వెంబడి పలుచోట్ల కొన్నేళ్లుగా చైనా సైన్యం కయ్యానికి కాలుదువ్వడం, మన సైన్యం దీటుగా బదులివ్వడం తెలిసిందే. ముఖ్యంగా మూడేళ్లుగా అక్కడ ఇరు సైన్యాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో 'చైనాలో సైనిక, భద్రతాపరమైన పరిణామాలు–2023' పేరిట అమెరికా రక్షణ శాఖ తాజాగా ఒక సమగ్ర నివేదికను విడుదల చేసింది. '2020 మే నుంచే భారత్, చైనా మధ్య సరిహద్దు వివాదాలు తీవ్ర ఉద్రిక్త స్థాయికి చేరడం మొదలైంది. ఈ నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి రెండు డివిజన్ల జిన్‌జియాంగ్, టిబెట్ మిలిటరీ డిస్ట్రిక్ట్స్ దన్నుతో ఒక బోర్డర్ రెజిమెంట్‌నే ఏర్పాటు చేసింది. నాలుగు కంబైన్డ్ ఆర్మీ బ్రిగేడ్ (సీఏబీ) తదితరాలను 2022లో వాస్తవాధీన రేఖ వెంబడి రిజర్వులో ఉంచింది. మరో మూడు సీఏబీలను ఇతర కమాండ్ల నుంచి తూర్పు సెక్టార్‌కు తరలించి సిద్ధంగా ఉంచింది. తర్వాత వీటిలో కొన్నింటిని వెనక్కు పిలిపించినా మెజారిటీ సేనలు ఇప్పటికీ వాస్తవాధీన రేఖ వెంబడే మోహరించే ఉన్నాయి' అని ఆ నివేదిక స్పష్టంచేసింది. 2020 జూన్‌లో గల్వాన్ లోయలో ఇరు సైన్యాలు తీవ్ర ఘర్షణకు దిగడం తెలిసిందే. ఆ నేపథ్యంలో చైనా ఈ చర్యలకు దిగిందని నివేదిక వెల్లడించింది. ఈ మోహరింపులు ఇలాగే కొనసాగవచ్చని అభిప్రాయపడింది. ఇక భూటాన్ వెంబడి వివాదాస్పద ప్రాంత సమీపంలో చైనా ఏకంగా ఊళ్లనే ఏర్పాటు చేసిందని తెలిపింది.

చైనా వద్ద 500 అణు వార్‌హెడ్లు!

ప్రయోగానికి అన్నివిధాలా సిద్ధంగా ఉన్న అణు వార్ హెడ్లు చైనా వద్ద ఏకంగా 500 దాకా ఉన్నట్టు పెంటగాన్ నివేదిక పేర్కొంది. 'గత రెండేళ్లలోనే ఏకంగా 100 వార్‌హెడ్లను తయారు చేసుకుంది. 2030 కల్లా వీటిని కనీసం 1,000కి పెంచడమే డ్రాగన్ దేశం లక్ష్యంగా పెట్టుకుంది' అని నివేదిక వివరించింది. 300కు పైగా ఖండాంతర బాలిస్టిక్ మిసైళ్లు తదితరాలు ఇప్పటికే చైనా అమ్ములపొదిలో చేరినట్టు వివరించింది. వాటిని దేశవ్యాప్తంగా మూడు చోట్ల అండర్‌గ్రౌండ్ వసతుల్లో అతి సురక్షితంగా ఉంచింది. 'వీటితో పాటు సంప్రదాయ ఖండాంతర బాలిస్టిక్ మిసైళ్ల తయారీని మరోసారి వేగవంతం చేసింది. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద నావికా దళం ఇప్పటికే చైనా సొంతం. ఏడాదిలోనే 30 యుద్ధ నౌకలను నిర్మించుకుంది. దాంతో చైనా వద్ద మొత్తం యుద్ధ నౌకలు ఏకంగా 370కి చేరాయి. వీటిని 2025 కల్లా 400కు, 2030 కల్లా 450కి పెంచే యోచనలో ఉంది' అని పేర్కొంది. 'విదేశాల్లో సైనిక స్థావరాలను పెంచుకునేందుకు చైనా ముమ్మర ప్రయత్నాలు చేసింది. నైజీరియా, నమీబియా, మొజాంబిక్, బంగ్లాదేశ్, బర్మా, సాల్మన్ దీవులు, థాయ్‌లాండ్, తజకిస్థాన్, ఇండొనేసియా, పపువా న్యూ గినియా వంటి దేశాల్లో వ్యూహాత్మక సైనిక స్థావరాలను పెంచుకునేలా కనిపిస్తోంది' అని నివేదిక తెలిపింది.



చీఫ్ జస్టిస్ చంద్రచూడ్‌కు అవార్డు అందజేస్తున్న దృశ్యం

హార్వర్డ్ గ్లోబల్ లీడర్‌షిప్ అవార్డు అందుకున్న సీజేఐ

మసాచుసెట్స్: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ శనివారం అమెరికాలో హార్వర్డ్ లా స్కూల్ గ్లోబల్ లీడర్‌షిప్ అవార్డు అందుకున్నారు. ఆయన హార్వర్డ్ లా స్కూల్‌లోనే 1982–83లో ఎల్‌ఎల్‌ఎం డిగ్రీ చేశారు. 1983–86 మధ్య జ్యుడీషియల్ సైన్సెస్‌లో డాక్టరేట్ పూర్తి చేశారు. గత జనవరిలో ఆయనకు ఈ అవార్డును ప్రకటించడం తెలిసిందే. సుప్రీంకోర్టులో టెక్నాలజీ వినియోగం మరింత పెంచడంసహా సీజేఐగా తొలి ఏడాది తాను చేపట్టిన పలు చర్యలను అవార్డ్ అందుకున్న సందర్భంగా ఆయన వివరించారు. లాయర్ల మానసిక ఆరోగ్యం తదితర అంశాలను స్పృశిస్తూ ప్రసంగించారు.

నేపాల్‌లో భూకంపం

కాఠ్మండు: నేపాల్ రాజధాని కాఠ్మండును ఆదివారం శక్తివంతమైన భూకంపం కుదిపేసింది. ధడింగ్ జిల్లా కేంద్రంగా ఉదయం 7.39 గంటలకు రిక్టర్ స్కేలుపై 6.1 తీవ్రతతో భూమి కంపించిందని యంత్రాంగం తెలిపింది. మరో 29 నిమిషాల అనంతరం ధడింగ్ జిల్లాలోనే భూ ప్రకంపనలు మరో నాలుగుసార్లు సంభవించినట్లు పేర్కొంది. దీంతో, రాజధాని ప్రాంతంలోని 20 ఇళ్ల వరకు దెబ్బతిన్నాయని, మరో 70 వరకు ఇళ్ల గోడలు బీటలువారాయని పేర్కొంది. ఎటువంటి ప్రాణనష్టం సంభవించినట్లు సమాచారం లేదని వెల్లడించింది. భూకంపం ప్రభావం బాగ్మతి, గండకి ప్రావిన్స్‌ల వరకు కనిపించింది.

భారత్ వ్యవహారాల్లో కెనడా జోక్యం

విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ వెల్లడి

న్యూఢిల్లీ: కెనడా దేశస్తులకు వీసా సేవల పునరుద్ధరణ అంశం, ఆ దేశంలోని భారత దౌత్యవేత్తలకు కల్పించే భద్రతపై ఆధారపడి ఉంటుందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కుండబద్దలు కొట్టారు. కెనడాతో దౌత్యపరమైన సమానత్వం వియన్నా సూత్రాల ప్రకారమే భారత్ కోరుతోందని కూడా ఆయన స్పష్టం చేశారు. భారత్ నుంచి 41 మంది దౌత్యాధికారులను కెనడా ప్రభుత్వం ఉపసంహరించుకున్న నేపథ్యంలో భారత్–కెనడా సంబంధాలపై జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయనీ వ్యాఖ్యలు చేశారు. కెనడా భారత్ అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం కొనసాగిస్తోందనే ఆందోళనతోనే దౌత్యపరమైన సమానత్వంపై పట్టుబట్టాల్సి వస్తోందని మంత్రి వివరించారు. 'ఈ విషయం గురించి ఎక్కువగా మాట్లాడకూడదు. కాలక్రమంలో మరికొన్ని అంశాలు బయటకు వస్తాయి. భారత్ చర్యలపై చాలా మందికి ఎందుకు అసౌకర్యం కలిగిందనే విషయం ప్రజలు అర్థం చేసుకుంటారు'అంటూ వ్యాఖ్యానించారు. 'కెనడాతో సంబంధాలు ప్రస్తుతం ఇబ్బందికరంగా మారాయి. ఆ దేశ రాజకీయాల్లోని ఒక వర్గం, దానికి సంబంధించిన విధానాలతో మాకు కొన్ని సమస్యలున్నాయి. కెనడాలోని మన దౌత్యాధికారుల భద్రత ప్రమాదంలో పడింది. అందుకే వీసాల జారీని నిలిపివేశాం. పరిస్థితుల్లో మార్పు కనిపిస్తేనే వీసాల జారీ పునరుద్ధరణ సాధ్యమవుతుంది' అని జైశంకర్ అన్నారు. దౌత్యాధికారుల భద్రత, రక్షణ అంశం వియన్నా సూత్రాల్లో కీలకమైందని వివరించారు. జూన్‌లో కెనడాలో ఖలిస్తానీ వేర్పాటువాది నిజ్జర్ హత్యకు గురయ్యాడు. ఘటన వెనుక భారత ప్రభుత్వ ఏజెంట్ల హస్తముందంటూ కెనడా ప్రధాని ట్రూడో చేసిన ఆరోపణలతో ఉద్రిక్తతలు మొదలైన విషయం తెలిసిందే.

ప్రొద్దుటూరులో 300 కిలోల బంగారం సీజ్

- పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్న ఐటీ అధికారులు
- రెండు వాహనాల్లో బంగారం, డాక్యుమెంట్ల తరలింపు



వాహనాల్లో నింపిన స్కానర్లు, డాక్యుమెంట్లు, ఇతర వస్తువులు

ప్రొద్దుటూరు క్రైం: బంగారం వ్యాపారానికి ప్రసిద్ధి గాంచిన వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో ఐటీ అధికారులు సోదాలు జరిపి సుమారు 300 కిలోల బంగారాన్ని సీజ్ చేశారు. బంగారు నగలతో పాటు పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుని రెండు వాహనాల్లో తిరుపతికి తరలించారు. ప్రొద్దుటూరులోని నాలుగు బంగారం దుకాణాల్లో ఈ నెల 19 నుంచి ఆదాయపన్నుశాఖ అధికారులు జరిపిన తనిఖీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. అధికారులు బంగారం దుకాణాలతో పాటు యజమానులు, వారి బంధువుల ఇళ్లలోనూ సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలోనే ఒక దుకాణంలో సుమారు 200 కిలోలు, మరో రెండు దుకాణాల్లో 100 కిలోల వరకు లెక్కలు చూపని బంగారం లభించడంతో దాన్ని సీజ్ చేశారు. కాగా ఐటీ అధికారులు ఈ వివరాలను అధికారికంగా ధ్రువీకరించలేదు.

స్తంభించిన వ్యాపారం

కొనుగోలుదారులకు బిల్లులు ఇవ్వకుండా బంగారు నగలు విక్రయించడంతో పాటు అక్రమంగా బంగారం దిగుమతి చేసుకుంటున్నారని ఫిర్యాదులు వెల్లడంతో ప్రొద్దుటూరులోని నాలుగు బంగారం దుకాణాల్లో ఈ నెల 19న సుమారు 40 మంది ఇన్‌కం ట్యాక్స్ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో పెద్దమొత్తంలో లెక్కలు లేని బంగారం లభించడంతో పట్టణంలోని బంగారం దుకాణాల్లో జీరో వ్యాపారం జరుగుతోందన్న విషయం బయటపడిందని అధికారులు చెబుతున్నారు. గతంలో ఎన్నడూ ఇలా సుదీర్ఘంగా సోదాలు జరగలేదని వ్యాపారులు పేర్కొన్నారు. వేలాది బంగారం దుకాణాలున్న ప్రొద్దుటూరులో ఐటీ అధికారుల దాడుల నేపథ్యంలో ఒక్కసారిగా వ్యాపారాలు స్తంభించిపోయాయి. తనిఖీలు తమవరకు ఎక్కడ వస్తాయో అనే భయంతో వ్యాపారులు దుకాణాలు మూసివేశారు. పండుగ నేపథ్యంలో బంగారం కొనుగోలు చేయడానికి వచ్చిన ప్రజలు దుకాణాలు మూసివేయడంతో నిరాశ చెందారు.



శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం తిరు మాడవీధులలో కడురమణీయంగా స్వర్ణరథోత్సవం సాగింది.



విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై జరుగుతోన్న శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు.



దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీశైలంలో భ్రమరాంబాదేవి మహాగౌరి అలంకారంలో దర్శనమిచ్చారు.




దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం విశాఖలోని పాతనగరం కురుపాం మార్కెట్ సమీపంలో వెలసిన కన్యకాపరమేశ్వరి అమ్మవారు మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని 6 కిలోల బంగారం, 6 కిలోల వెండితో పాటు రూ.2 కోట్ల కరెన్సీ నోట్లతో అలంకరించారు.

ఉత్తరం.. ఉత్తదే చంద్రలేఖలో ఇంద్రజాలం!

పండుగ పూట పచ్చి అసత్యాలతో చంద్రబాబు 'నకిలీ'విన్యాసాలు

- జైలు నుంచి ప్రజలకు తమ అధినేత లేఖ రాశారంటూ టీడీపీ ప్రచారం
- ఖండించిన రాజమహేంద్రవరం జైలు అధికారులు
- అలాంటి లేఖ ఏదీ జైలు నుంచి విడుదల కాలేదని ప్రకటన
- ప్రజా స్పందన లేకపోవడం, కార్యకర్తలు మొహం చాటేయడంతో కప్పిపుచ్చుకునేందుకు లేఖ పేరుతో చినబాబు డ్రామాలు
- స్కిల్ స్కామ్ కేసులో న్యాయ పరీక్షకు సిద్ధపడకుండా.. లేఖలో మాత్రం అంతిమంగా న్యాయమే గెలుస్తుందంటూ దబాయింపు
- సాంకేతిక సాకుతో కేసును కొట్టి వేయాలని వాదిస్తున్న బాబు లాయర్లు



సాక్షి, అమరావతి: 'స్కిల్'స్కామ్‌లో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును సీఐడీ పోలీసులు అరెస్టు చేసి, ఏసీబీ కోర్టు రిమాండ్‌పై జైలుకు పంపి నెలన్నర అవుతోంది. ఆయన నుంచి రూ.వందల కోట్ల ఫీజులు తీసుకుంటున్న లాయర్లు మాత్రం చంద్రబాబు తప్పు చేయలేదని అప్పటి నుంచి ఇప్పటి దాకా న్యాయస్థానాల్లో వాదించలేదు. కేవలం సీఆర్‌పీసీ సెక్షన్–17(ఏ) ప్రకారం గవర్నర్ అనుమతి తీసుకోకుండా చంద్రబాబును అరెస్టు చేశారంటూ సాంకేతిక అంశాల సాకుతో కేసును కొట్టి వేయాలని మాత్రమే వాదిస్తున్నారు. ఈ కేసులోనూ తనకు అలవాటైన రీతిలోనే న్యాయ పరీక్షను ఎదుర్కోకుండా సాంకేతిక అంశాలను అడ్డుపెట్టుకుని తప్పించుకోవడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఒకవైపు తప్పించుకునే మార్గాలను అన్వేషిస్తూ మరోవైపు న్యాయం ఆలస్యం కావచ్చుగానీ అంతిమంగా గెలుస్తుందంటూ ఆదివారం ఓ బహిరంగ లేఖలో చంద్రబాబు అడ్డగోలుగా దబాయించారు. అయితే జైలు నుంచి అలాంటి లేఖ ఏదీ తాము జారీ చేయలేదని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం పర్యవేక్షణ అధికారి ఎస్.రాహుల్ స్పష్టం చేశారు. అంటే.. ఆ లేఖే నకిలీదని తేటతెల్లమవుతోంది. జైలు నుంచి ప్రజలకు తన తండ్రి రాశారని పేరుతో లోకేష్ బహిరంగ లేఖను విడుదల చేసి నాటకమాడినట్లు స్పష్టమవుతోంది. ఇక ఆ లేఖలో రాసినవన్నీ పచ్చి అబద్ధాలే. అంతా కల్పితాలతో దాని విడుల చేశారు.

శ్రేణుల నుంచి కనీస స్పందన లేకపోవడంతో..

స్కిల్ డెవలప్‌మెంట్ ముసుగులో ప్రభుత్వ ఖజానా నుంచి అడ్డంగా దోచేసి దొరికిపోయిన కేసులో చంద్రబాబును ఏసీబీ కోర్టు రిమాండ్‌పై జైలుకు పంపింది. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా తమ అధినేతను అరెస్టు చేశారంటూ టీడీపీ నేతలు ఎంతగా దుష్ప్రచారం చేస్తున్నా ప్రజల నుంచి సానుభూతి కాదు కదా కనీస స్పందన కూడా లభించడం లేదు. చివరకు టీడీపీ కార్యకర్తలు కూడా మొహం చాటేయడంతో దాన్ని కప్పిపుచ్చుకునేందుకు శనివారం ములాఖత్‌లో చంద్రబాబు సూచనల మేరకు పండుగ పూట పచ్చి అసత్యాలు వల్లె వేస్తూ బహిరంగ లేఖను లోకేష్ విడుదల చేసి డ్రామా ఆడినట్లు స్పష్టమవుతోంది. తన సామాజిక వర్గంలో కొందరు మినహా ఎవరూ స్పందించకపోయినా ఉవ్వెత్తున్న ప్రజా చైతన్యం ఎగిసిపడుతున్నట్లు ఆ లేఖలో చిత్రీకరించడం గమనార్హం.

అభివృద్ధి ఎక్కడ.. అంతా విధ్వంసమే..:

తాను జైల్లో ఉన్నా అభివృద్ధి రూపంలో ప్రతి చోటా ఉంటానని, సంక్షేమం పేరు వినిపించిన ప్రతి సారీ తానే గుర్తొస్తానని చంద్రబాబు లేఖలో అతిశయోక్తులు వల్లె వేశారు. విభజిత రాష్ట్రంలో చంద్రబాబు దోపిడీ మినహా సంక్షేమం ఎక్కడా కానరాదు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దిక్సూచిలా నిలిచే పోలవరం ప్రాజెక్టును కమీషన్ల కోసం చంద్రబాబు ఏటీఎంలా మార్చుకుని విధ్వంసం సృష్టించారని సాక్షాత్తూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలే అందుకు నిదర్శనం. అమరావతి భూకుంభకోణం నుంచి స్కిల్ స్కామ్ వరకూ అనేక అక్రమాలకు పాల్పడిన చంద్రబాబు ఖజానాను కొల్లగొట్టి పేదల నోట్లో మట్టి కొట్టారన్నది యధార్థం. అందుకే రిమాండ్‌పై చంద్రబాబు జైల్లో ఉన్నా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

దొరికిపోయిన దొంగ..
దేశ భక్తుడిలా సూక్తులా?

తన రాజకీయ అరంగేట్రం నుంచే చంద్రబాబు అక్రమాలకు తెరతీశారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి 1995లో అధికారాన్ని చేజిక్కించుకున్నాక అవి పరాకాష్టకు చేరాయి. 1995 నుంచి 2004 వరకూ చంద్రబాబు పాల్పడ్డ అక్రమాలు, ఆయన అక్రమాస్తులపై విచారణ జరిపించాలంటూ ఎన్టీఆర్ భార్య లక్ష్మీపార్వతితోపాటు ప్రస్తుతం టీడీపీ పంచన చేరిన మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ వరకూ కోర్టుల్లో 17 కేసులు వేశారు. ఆ కేసుల్లో విచారణ ఎదుర్కొంటే దొరికిపోతాననే భయంతో స్టేలు తెచ్చుకుని చంద్రబాబు బతుకుతున్నారు. చివరకు స్కిల్ స్కామ్‌లో అడ్డంగా దొరికిపోయారు. అలాంటి వ్యక్తి దేశభక్తుడిలా అంతిమంగా గెలిచేది న్యాయమేనంటూ నమ్మబలకటాన్ని రాజకీయ పరిశీలకులు ఎద్దేవా చేస్తున్నారు.

అనారోగ్య కారణాలతో మరణిస్తే పరామర్శా?

రాష్ట్రంలో అనారోగ్య కారణాలతో మరణించిన వారిని సైతం వదిలిపెట్టకుండా తన అక్రమ అరెస్టుతో తల్లడిల్లి మృతి చెందినట్లుగా చంద్రబాబు చిత్రీకరించుకోవటాన్ని సామాజికవేత్తలు తప్పుబడుతున్నారు. ఆ కుటుంబాలను పరామర్శించేందుకు, అరాచక పాలనను ఎండగట్టడానికి 'నిజం గెలవాలి'అంటూ తన భార్య భువనేశ్వరి ప్రజల ముందుకు వస్తోందని చంద్రబాబు పేరుతో విడుదలైన లేఖలో పేర్కొన్నారు. తాను జైల్లో ఉంటున్నా ప్రజలు, పార్టీ శ్రేణుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో దాన్ని కప్పిపుచ్చుకోవడానికే చంద్రబాబు ఈ డ్రామాకు తెరతీశారన్నది విశదమవుతోంది.

పండుగపై పడగ!

- ఏపీలో విధ్వంసానికి టీడీపీ కుట్రలు
- నకిలీ లేఖ, ఆందోళనలతో అల్లర్లకు పథకం

సాక్షి, అమరావతి: అంతటా పండుగ సంతోషాలు, సంబరాలు వెల్లివిరుస్తున్న శుభవేళ ప్రతిపక్ష టీడీపీ వికృత రాజకీయాలకు తెగబడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా అల్లర్లు, అలజడులు, విధ్వంసాలు సృష్టించేందుకు కుట్రలు పన్నుతోంది. స్కిల్ కుంభకోణంలో ఆధారాలతో సహా అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి రాశారంటూ ఓ నకిలీ లేఖను ప్రచారంలోకి తేవడంతోపాటు సోమవారం సాయంత్రం 'జగనాసుర దహనం'అనే కార్యక్రమానికి నారా లోకేశ్ పిలుపు నివ్వడం ద్వారా పార్టీ శ్రేణులు, రౌడీమూకలను అల్లర్లకు పురిగొల్పుతున్నట్లు స్పష్టమవుతోంది. సీఎం దిష్టి బొమ్మలను దహనం చేయడంతోపాటు రాజకీయ ప్రత్యర్థులపై దాడులు, దుకాణాలపై దాడులు, లూటీలు చేయాలన్నది టీడీపీ లోపాయికారీ కుట్రగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కసారిగా వీధుల్లోకి వచ్చి సామాన్యులను భయభ్రాంతులకు గురిచేసి అల్లకల్లోలం సృష్టించాలని పథకం వేశారు. మత కలహాలు, వర్గ వైషమ్యాలు సృష్టించేందుకు కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. విపక్షం కుట్ర రాజకీయాల పట్ల అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిన 'నారా'సురుడు చంద్రబాబే అసలైన నరకాసురుడని వ్యాఖ్యానిస్తున్నారు. అటువంటి వ్యక్తి జైల్లో ఉండటమే ప్రజలకు అసలైన దసరా అని సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అవుతున్నాయి. తాజా పరిణామాలతో పోలీసు యంత్రాంగం రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తమైంది. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించింది. ప్రజలు సామరస్య పూర్వకంగా ఆనందోత్సాహాలతో దసరా పండుగ నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. అసాంఘిక శక్తులను ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

క్లుప్తంగా...

'కాళేశ్వరం'పై కేంద్రం సాంకేతిక సమీక్ష చేయాలి: కొండా



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సాంకేతిక సమీక్షతోపాటు పునర్ మూల్యాంకనం చేయాలని ఆదివారం ఎక్స్(ట్విట్టర్) వేదిక ద్వారా బీజేపీ నేత, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్ట్‌లో కీలకమైన మేడిగడ్డ బ్యారేజి పిల్లర్లలో సమస్య తలెత్తడంతో వర్షాకాలం తర్వాత నిల్వ చేసిన నీటిని బంగాళాఖాతంలోకి వదలాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. 'తెలంగాణకు చెందిన అత్యంత నిపుణుడైన ఇంజనీర్ సీఎం కేసీఆర్ రూ.ఒకటిన్నర లక్షల కోట్లతో డిజైన్ చేసిన కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం వరల్డ్స్ బిగ్గెస్ట్ ఇంజనీరింగ్ బ్లండర్‌గా మిగిలిపోతుంది'అని ఎద్దేవా చేశారు.

గద్దర్ స్మారకస్ఫూర్తి సంచిక ఆవిష్కరణ

సాక్షి, న్యూఢిల్లీ: ప్రజాయుద్ధనౌక గద్దర్ స్మారకస్ఫూర్తి సంచిక ఆవిష్కరణను ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. 'మెలకువ'దళిత బహుజన సాహిత్య, సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో ఢిల్లీ యూనివర్సిటీప్రొఫెసర్ కేశవకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఎంపీ డి.రాజా, పాత్రికేయులు ఎ.కృష్ణారావు, రామ్మోహన్ రావు, ప్రొఫెసర్ చిట్టిబాబు, ప్రొఫెసర్ తిరుపతిరావు, పి.వెంకటేశ్వరరావు, సునీత తదితరులు ప్రసంగించారు. గద్దర్ పోరాటాన్ని వక్తలు గుర్తుచేసుకున్నారు. గద్దర్‌లోని భిన్న కోణాల్ని పేర్కొంటూ పోరాటయోధుడితో తమకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు.

నాలుగేళ్లకే బ్యారేజీ కుంగడమా?

వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల



సాక్షి, హైదరాబాద్: కల్వకుంట్ల దొర కమీషన్ల కక్కుర్తికి పంప్ హౌజ్‌లే కాదు. ఏకంగా బ్యారేజీలు కుంగుతున్నాయని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రాజెక్ట్ నిర్మించిన నాలుగేళ్లకే మేడిగడ్డ బ్యారేజీ కదిలిందంటే మెగా లోపమేమిటో, మెగా దోపిడేమిటో మరోసారి తేటతెల్లమైందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నాసిరకమని చెప్పడానికి ఇంతకంటే పెద్ద సాక్ష్యం మరొకటి లేదని తెలిపారు. రూ.లక్ష కోట్ల ప్రజా ధనాన్ని కాజేశారనడానికి మేడిగడ్డ కుంగడమే నిదర్శనమని షర్మిల ఆరోపించారు. కాళేశ్వరం నిర్మాణంలో తప్పులు కప్పి పుచ్చడానికి కుట్ర కోణమని డ్రామాలు మొదలు పెట్టినా,ప్రాజెక్ట్ చుట్టూ పోలీసులను పెట్టి నిజాలు దాచిపెట్టినా, జరిగిన నష్టాన్ని బయటకు పొక్కకుండా నోళ్లు మూయించినా, సీఎం మానస పుత్రిక కాళేశ్వరం అంతాబోగస్ అని ఆధారాలతో తెలంగాణ సమాజానికి అర్థమైందని స్పష్టం చేశారు. రూ.లక్ష కోట్ల కాళేశ్వరం నీళ్లు గోదారిపాలు, నిధులు కల్వకుంట్ల వారి పాలయ్యాయని షర్మిల ఆరోపించారు.

ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా లవ్ అగర్వాల్

సాక్షి, అమరావతి: న్యూఢిల్లీలోని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా లవ్ అగర్వాల్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ కేడర్‌కు చెందిన లవ్ అగర్వాల్ ఇప్పటివరకు డిప్యుటేషన్‌పై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా పనిచేశారు. డిప్యుటేషన్ పూర్తయి కేంద్ర సర్వీసు నుంచి రాష్ట్ర కేడర్‌కు ఆయన తిరిగి రావడంతో ఏపీ రెసిడెంట్ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. దీంతో ప్రభుత్వ ప్రధాన సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌ను రెసిడెంట్ కమిషనర్ అదనపు బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు.

నేటి భవితలో..

- యూపీఎస్సీ ఎగ్జామ్స్: ఐఎఫ్ఎస్.. మెయిన్స్‌లో మెరిసేలా! ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్).. సివిల్ సర్వీసెస్ తర్వాత అంతటి ప్రాధాన్యం ఉన్న సర్వీస్‌గా గుర్తింపు! ఇది సైన్స్, ఇంజనీరింగ్, మ్యాథ్స్ బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు పోటీ పడే పరీక్ష! ఇందులో విజయం సాధిస్తే.. అటవీ శాఖలో ఐఎఫ్ఎస్ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభించే అద్భుత అవకాశం లభిస్తుంది! ఇంతటి కీలకమైన సర్వీసులోకి అభ్యర్థుల ఎంపికకు సంబంధించి యూపీఎస్సీ ప్రతి ఏటా నోటిఫికేషన్ విడుదల చేస్తుంది! ఐఎఫ్ఎస్–2023కు సంబంధించి ఎంపిక ప్రక్రియలో రెండో దశ.. మెయిన్ పరీక్షలు నవంబర్ 26 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో.. ఐఎఫ్ఎస్ మెయిన్ పరీక్ష విధానం, విజయానికి మార్గాలపై ప్రత్యేక కథనం.
- గ్రూప్స్ ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్: సివిల్స్, గ్రూప్స్,బ్యాంక్స్ తదితర పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా.. అంతర్జాతీయం, జాతీయం, రాష్ట్రీయం, వార్తల్లో వ్యక్తులు, అవార్డులు, సైన్స్ అండ్ టెక్నాలజీ, క్రీడలు తదితర ముఖ్యాంశాలతో వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండప్.
- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

100 ఎంబీబీఎస్ సీట్ల మిగులు!

రాష్ట్రంలోని ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ సీట్లపై విద్యార్థుల అనాసక్తి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో పెద్ద ఎత్తున ఎంబీబీఎస్ సీట్లు మిగిలిపోయినట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు చెబుతున్నాయి. దాదాపు 100 వరకు ఎంబీబీఎస్ సీట్లు మిగిలినట్లు అంటున్నాయి. రాష్ట్రంలోని ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 4,825 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా వాటిల్లో 15 శాతం అంటే 723 ఎన్ఆర్ఐ కోటా సీట్లున్నాయి. వాటికి మాప్ అప్ రౌండ్ నిర్వహించాక మిగిలిన 128 సీట్లను స్ట్రే వేకెన్సీ పద్ధతిలో నింపేందుకు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఏర్పాట్లు చేసినా పెద్దగా స్పందన రాలేదని వర్సిటీ వర్గాలు అంటున్నాయి. మరోవైపు బీ-కేటగిరీ సీట్లలోనూ కొన్ని సీట్లు మిగిలిపోయినట్లు చెబుతున్నాయి. మొత్తంగా చూస్తే ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్లు 100 వరకు మిగిలినట్లు తెలుస్తోంది. త్వరలో అన్ని కాలేజీలు జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)కు సమాచారం ఇచ్చిన తర్వాత మిగిలిపోయిన సీట్ల సంఖ్యపై స్పష్టత వస్తుందని చెబుతున్నారు.

ఫిజికల్ కౌన్సెలింగ్ రద్దుతో మారిన పరిస్థితి

ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో సీట్ల బ్లాకింగ్‌కు చెక్ పెట్టేందుకు వీలుగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారానే అన్ని సీట్లనూ భర్తీ చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఫిజికల్ కౌన్సెలింగ్ చేపట్టవద్దని ఎన్ఎంసీ స్పష్టం చేసింది.పలుమార్లు ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లు నిర్వహించాలని, అయినా సీట్లు మిగిలిపోతే వాటిని వదిలేయాలని పేర్కొంది. దీనివల్ల కూడా సీట్లు మిగిలిపోయినట్లు చెబుతున్నారు. సహజంగా ఏటా కొన్ని ఎంబీబీఎస్ సీట్లు మిగిలిపోతుంటాయి.

ఎన్ఆర్ఐ సీట్లపై అభ్యర్థుల అనాసక్తి...

రాష్ట్రంలో వైద్యవిద్య అవకాశాలు భారీగా పెరిగాయి. 2023–24 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 3,790 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 4,825 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. వాటిల్లో 15 శాతం అంటే 723 ఎన్ఆర్ఐ కోటా సీట్లున్నాయి. ప్రభుత్వంలోని అన్ని సీట్లను, ప్రైవేటు కాలేజీల్లోని 50 శాతం సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని సీట్లల్లో 15 శాతం అఖిల భారత కోటా కింద భర్తీ చేస్తారు. బీ-కేటగిరీ సీట్లలో 85 శాతం వరకు లోకల్‌కు కేటాయిస్తుండటంతో రాష్ట్ర విద్యార్థులకు అవకాశాలు మెరుగయ్యాయి. ఇక ఎన్ఆర్ఐలో సీట్లు ఎక్కువగానే ఉన్నా ఫీజులు అధికంగా ఉన్నాయి. బీ-కేటగిరీ ఫీజుకు రెట్టింపు స్థాయిలో ఎన్ఆర్ఐ కోటా ఫీజులున్నాయి. అంటే ఏటా ఎన్ఆర్ఐ కోటా సీటు ఫీజు రూ. 23 లక్షలకు పైగా ఉంది. దీంతో 723 ఎన్ఆర్ఐ ఎంబీబీఎస్ సీట్లున్నా తక్కువమంది విద్యార్థులే ఆప్షన్లు పెట్టుకున్నారు. చివరకు వెసులుబాట్లు కల్పించినా ఇంకా సీట్లు మిగిలిపోయాయి. మరోవైపు ఎక్కువ ఖర్చు చేసి ఇక్కడ ఎన్ఆర్ఐ కోటాలో ఎంబీబీఎస్ చేసే బదులు ఇతర రాష్ట్రాల్లో డీమ్డ్ వర్సిటీల్లో తక్కువ ఫీజుతో చదువుకోవచ్చన్న భావన నెలకొంది. ఈ నేపథ్యంలో ఎన్ఆర్ఐ సీట్లు మిగలడంతో అనేక ప్రైవేటు మెడికల్ కాలేజీల యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నాయి.

దీర్ఘ కావ్యాలకు మైలురాయి 'జూలూరి పథం'


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గోరటి వెంకన్న, కె.శ్రీనివాస్, అల్లం నారాయణ, జూలూరు గౌరీశంకర్, గంటా చక్రపాణి

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): దీర్ఘకావ్యాలకు మైలురాయి జూలూరుపథం అని పలువురు ప్రముఖులు కొనియాడారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ రచించిన 'జూలూరుపథం' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాకవి, శాసనమండలి సభ్యులు గోరటి వెంకన్న మాట్లాడుతూ, ఉక్కు పిడికిలి ఎత్తిన నాటి నుంచి అన్ని ఉద్యమాలలో జూలూరు గౌరీశంకర్ చురుకైన పాత్ర పోషించారని గుర్తుచేశారు. జర్నలిస్టుగా, కవిగా, రచయితగా ప్రచురణకర్తగా బహురూపాలలో జూలూరు కనిపిస్తాడన్నారు. రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ, తెలంగాణ మలి, తుదిదశల కాలం నాటి నుంచి ఉద్యమంలో మమేకమైన జూలూరు నిత్య చైతన్యశీలిగా నిరంతరం రచనలు చేస్తూ కొనసాగుతున్నారని కొనియాడారు. టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ గంటా చక్రపాణి మాట్లాడుతూ, నాలుగు దశాబ్దాలుగా ఆధిపత్య భావజాలంపై అక్షరాలను సంధిస్తూ, తెలంగాణ గడ్డపై సాగిన ఉద్యమాల ఊపిరిని పీలుస్తూ సామాజిక అస్తిత్వ భావాల వెల్లువలా ఈ పుస్తకాన్ని తీసుకురావడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంపాదకుడు కె.శ్రీనివాస్, తెలంగాణ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె నాగేశ్వరరావు, కవులు డాక్టర్ యాకూబ్, సుద్దాల అశోక్‌తేజ, కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి, కుప్పిలి పద్మ, సీతారామ్, పులిగుండ సుబ్బాచారి, కవులు, రచయితలు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

కేంద్రం విచారణకు ఆదేశించాలి: రేవంత్

రాష్ట్రానికి అది గుదిబండ: భట్టి




సాక్షి, న్యూఢిల్లీ: మేడిగడ్డ బ్యారేజీ వంతెన కుంగడంపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణకు ఆదేశించాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. మేడిగడ్డ ప్రమాదానికి సీఎం కేసీఆర్ కుటుంబమే కారణమని.. కేసీఆర్ ధనదాహానికి కాళేశ్వరం ప్రాజెక్టు బలైపోయిందని వ్యాఖ్యానించారు. గతంలో పంపుహౌజ్‌లు మునిగితే వర్షాలను సాకుగా చూపారని.. మరిప్పుడు వంతెన ఎందుకు కుంగిపోయిందో కేసీఆర్ చెప్పాలన్నారు. ఆదివారం ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ సమావేశం అనంతరం రేవంత్ మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం అవినీతిపై సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటామన్న ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, కిషన్‌రెడ్డి.. ఇప్పటికైనా విచారణకు ఆదేశిస్తారా? అని ప్రశ్నించారు. ఈ అంశంలో కేంద్ర విజిలెన్స్‌తో విచారణ చేయించి, సిట్టింగ్ జడ్జి నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుకు ప్రమాదమేంటి? లోపమేమిటన్న దానిపై చర్చించేందుకు తాను, సీఎల్పీ నేత భట్టి వస్తామని.. బీఆర్ఎస్ నుంచి హరీశ్‌రావు, కేటీఆర్ రావాలని సవాల్ చేశారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రమాదంపై గవర్నర్, ఈసీ స్పందించి విచారణకు ఆదేశించాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజనీరింగ్ అద్భుతమని కేసీఆర్, కేటీఆర్ చెప్తుంటారని, ఇప్పుడేం చెప్తారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ప్రశ్నించారు. రాష్ట్రానికి కాళేశ్వరం గుదిబండగా మారబోతోందన్నారు. ప్రాజెక్టుకు స్వయంగా ప్లాన్లు గీశానని కేసీఆర్ చెప్పారని.. భారీగా ప్రజాధనాన్ని గోదారి పాలు చేశారని విమర్శించారు.

మరింత కుంగిన మేడిగడ్డ బ్యారేజీ!

7వ బ్లాక్‌లోని 20వ పియర్‌కు పగుళ్లు..

- రెండు, మూడు ఫీట్ల మేర కుంగిపోయిన రోడ్డు
- వంతెనపై తెలంగాణ-మహారాష్ట్ర మధ్య రాకపోకలు నిలిపివేత
- మొత్తం 85 గేట్లు ఎత్తి నీటిని వదిలేస్తున్న ఇంజనీర్లు
- బ్యారేజీని ఖాళీ చేశాక ఘటనా స్థలంలో క్షుణ్నంగా పరిశీలన: ఈఎన్సీ వెంకటేశ్వర్లు
- ప్రస్తుతానికి బ్యారేజీకి ఎలాంటి ప్రమాదం లేదని వివరణ
- ఎల్ అండ్ టీ సంస్థ నిర్వహణ బాధ్యతలు చూస్తుందని వెల్లడి
- నేడు బ్యారేజీని సందర్శించనున్న కేంద్ర డ్యాం సేఫ్టీ బృందం

వంతెన కుంగిన దృశ్యం



కాళేశ్వరం/సాక్షి, హైదరాబాద్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ లక్ష్మి బ్యారేజీ మరికాస్త కుంగింది. శనివారం సాయంత్రం బ్యారేజీ వద్ద ఒక్కసారిగా భారీ శబ్దం వచ్చి, 7వ బ్లాక్‌లోని 20వ పియర్ వద్ద దిగువన పగుళ్లు ఏర్పడ్డాయి. దీనితో బ్యారేజీపై ఉన్న వంతెన కుంగి ప్రమాదకరంగా మారింది. వంతెనపై సైడ్ బర్మ్ గోడ, ప్లాట్‌ఫారంతోపాటు రోడ్డు సుమారు 2, 3 ఫీట్ల మేర కుంగిపోయాయి. దీనితో బ్యారేజీ గేట్లకు కూడా ప్రమాదం పొంచి ఉందని అంచనా. ఘటన జరిగిన వెంటనే సాగునీటిశాఖ అధికారులు, ఇతర నిపుణులు కుంగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందనేది పరిశీలించేందుకు ప్రయత్నించారు. ఆదివారం నీటిపారుదల శాఖ ఈఎన్సీ నల్ల వెంకటేశ్వర్లు, ఎల్ అండ్ టీ నిర్మాణ సంస్థ మేనేజర్ సురేశ్‌కుమార్ తదితరులు ప్రాజెక్టు వద్దకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. బ్యారేజీలోని మొత్తం 85 గేట్లను ఎత్తివేసి నీటిని దిగువకు వదిలేస్తున్నారు. నీటిమట్టం తగ్గితే ప్రమాదమేంటి? దానికి కారణమేంటి? అన్నది తెలుస్తుందని చెప్తున్నారు. మరోవైపు ఉన్నట్టుండి నీటిని వదలడంతో గోదావరిలో, తీరం వెంట మేపుతున్న గొర్రెలు, మేకలు కొట్టుకుపోయాయని.. వ్యవసాయ మోటార్లు నీట మునిగాయని రైతులు వాపోతున్నారు.

వంతెనపై రాకపోకలు నిలిపివేత

బ్యారేజీ వంతెనపై తెలంగాణ-మహారాష్ట్ర మధ్య రాకపోకలను శనివారం రాత్రి నుంచే నిలిపివేశారు. బ్యారేజీ వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. రోడ్డుకు అడ్డంగా మట్టిపోసి, బారికేడ్లు పెట్టి ఎవరూ రాకుండా చూస్తున్నారు. కుంగిన ప్రాంతం వద్దకు వెళ్లడానికి మీడియాను కూడా అనుమతించడం లేదు. మాజీ మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బీజేపీ హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌లు బ్యారేజీని పరిశీలించడానికి వేర్వేరు సమయాల్లో వచ్చారు. తొలుత వారిని అడ్డుకున్న పోలీసులు తర్వాత బ్యారేజీ పరిశీలనకు అనుమతించారు.

బ్యారేజీకి ప్రమాదం లేదు

మేడిగడ్డ బ్యారేజీ వద్ద పరిస్థితిని సమీక్షించాక ఈఎన్సీ నల్ల వెంకటేశ్వర్లు, ఎల్‌అండ్‌టీ సంస్థ మేనేజర్ సురేశ్‌కుమార్ తదితరులు మీడియాతో మాట్లాడారు. శనివారం రాత్రి బ్యారేజీ వద్ద పెద్ద శబ్దం వచ్చిందని, ఇంజనీర్లు వెళ్లి పరిశీలించగా బ్యారేజీ పియర్ కుంగినట్లు నిర్ధారణ అయిందని తెలిపారు. 7వ బ్లాక్‌లోని 20వ పియర్ దెబ్బతిన్నదని.. అయితే పక్కన ఉన్న పియర్లపై దీని ప్రభావం ఏమైనా ఉందా అన్నది పరిశీలిస్తున్నామని చెప్పారు. బ్యారేజీకి ఎలాంటి ప్రమాదం లేదని.. నెలన్నర రోజుల్లో పూర్వ స్థితికి వస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం బ్యారేజీ నిర్వహణ బాధ్యతను ఎల్‌అండ్‌టీ సంస్థ చూస్తోందని.. ప్రస్తుతం మరమ్మతుల బాధ్యతనూ చేపడుతుందని వివరించారు. ఎగువ నుంచి వస్తున్న వరదను వచ్చినట్టుగా దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. రెండు రోజుల్లో బ్యారేజీలోని నీటిని ఖాళీ చేస్తామని.. కుంగిన చోట ఏం జరిగింది? సరిచేయడానికి ఏమేం చర్యలు తీసుకోవాలి అన్నది తేల్చుతామని వివరించారు. ఈ ఘటనలో దుష్ట శక్తుల హస్తం ఏదైనా ఉందో, లేదో తెలుసుకునేందుకు మహదేవపూర్‌తోపాటు మహారాష్ట్ర వైపు పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేశామని చెప్పారు.

ప్రపంచ రికార్డు వేగంతో నిర్మాణం

కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగంగా గోదావరి నదిపై రూ.1,849 కోట్ల వ్యయంతో 16.17 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో మేడిగడ్డ(లక్ష్మి) బ్యారేజీని నిర్మించారు. ఎల్ అండ్ టీ సంస్థ కేవలం 24 నెలల్లో బ్యారేజీ నిర్మాణాన్ని పూర్తి చేసింది. బ్యారేజీ పొడవు 1.6 కిలోమీటర్లు, దీనికి 87 హైడ్రో మెకానికల్ రేడియల్ గేట్లు ఏర్పాటు చేశారు. ఒక్కోటీ 110 మీటర్ల పొడవు, 4 నుంచి 6 మీటర్ల వెడల్పు, 25 మీటర్ల ఎత్తుతో నిర్మించిన పియర్స్ (గేట్ల మధ్య పిల్లర్లలా ఉండే కాంక్రీట్ నిర్మాణం) మధ్య ఈ గేట్లను అమర్చారు. బ్యారేజీ నిర్మాణంలో భాగంగా ఒకదశలో కేవలం 72 గంటల్లోనే ఏకంగా 25,584 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేసి ప్రపంచ రికార్డు సృష్టించినట్టు నిర్మాణ సంస్థ తమ వెబ్‌సైట్లో పేర్కొనడం గమనార్హం.

నేడు మేడిగడ్డకు డ్యాం సేఫ్టీ బృందం

బ్యారేజీ కుంగిన ఘటనపై కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) పరిధిలోని 'సెంట్రల్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్' నిపుణుల బృందం సోమవారం పరిశీలన జరపనుంది. కుంగిన ప్రాంతాన్ని సందర్శించి జరిగిన నష్టంపై అంచనా వేయనుంది. ఆ బృందం సిఫార్సుల ఆధారంగా మరమ్మతు పనులు చేపడతారు. వాస్తవానికి బ్రిడ్జిలు, బ్యారేజీలను బ్లాకులుగా నిర్మిస్తారు. పునాదుల పరంగా ఒక బ్లాక్‌కు మరో బ్లాక్‌తో సంబంధం ఉండదు. దీనివల్ల ఏదైనా బ్లాక్‌లో విపత్తు/ప్రమాదం ఎదురైతే మొత్తం బ్రిడ్జి/బ్యారేజీ దెబ్బతినకుండా సదరు బ్లాక్ వరకే నష్టం పరిమితం అవుతుంది. మేడిగడ్డ బ్యారేజీని 7 బ్లాకులుగా నిర్మించారు. తెలంగాణ వైపు నుంచి వాటికి నంబరింగ్ ఇచ్చారు. అలా మహారాష్ట్ర వైపు చివరన ఉన్నది ఏడో బ్లాక్. దీనిలోని 20వ నంబర్ పియర్ ప్రస్తుతం కుంగిపోయింది. దీని ప్రకారం ఏడో బ్లాక్ వరకు నష్టం పరిమితమయ్యే అవకాశాలు ఉన్నాయని.. పునాదికి నష్టం జరిగితే ఏడో బ్లాక్‌ను పూర్తిగా తొలగించి కొత్తగా నిర్మించాల్సి రావొచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఐదేళ్ల 'డిఫెక్ట్ లయబిలిటీ (లోపాలుంటే సరిచేయాల్సిన బాధ్యత)' సమయం ఇంకా పూర్తి కానందున.. నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీనే మరమ్మతుల వ్యయం భరించాల్సి ఉంటుందని నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి. మరమ్మతులు పూర్తయ్యే వరకు బ్యారేజీలో నీళ్లను నిల్వచేసే అవకాశం ఉండదని అంటున్నాయి.

సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం

మేడిగడ్డ బ్యారేజీపై ఎల్‌అండ్‌టీ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ లక్ష్మి బ్యారేజీ వద్ద కుంగిన వంతెనకు సంభవించిన నష్టాన్ని సాంకేతికంగా అంచనా వేశాక, ఆ సమస్యను సరిదిద్దడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎల్‌అండ్‌టీ సంస్థ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ''తెలంగాణ రాష్ట్రం కోసం 2019లో 86 పియర్లతో 1.632 కిలోమీటర్ల పొడవైన లక్ష్మి బ్యారేజీని ఎల్‌అండ్‌టీ నిర్మించింది. అప్పటి నుంచి బ్యారేజీకి ఉద్దేశించిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో నెరవేరుస్తోంది. ఇప్పటివరకు ఐదు వరద సీజన్లను సమర్థవంతంగా తట్టుకుంది. బ్యారేజీని 28.25 లక్షల క్యూసెక్కుల వరద డిశ్చార్జికి అనుగుణంగా రాష్ట్ర అధికారులే డిజైన్ చేయడం జరిగింది. అయితే గత సంవత్సరం ఈ సామర్థ్యానికి మించి అత్యధికంగా 28.70 లక్షల క్యూసెక్కుల వరద నమోదైంది. దానిని బ్యారేజీ తట్టుకుని, సురక్షితంగా నిలిచింది. శనివారం సాయంత్రం బ్యారేజీ బ్లాక్-7లో ఒకచోట పెద్ద శబ్దం రావడంతో పాటుగా వంతెన కొంత భాగం కుంగిపోవడం గమనించారు. రాష్ట్ర అధికారులతో కలసి మా సాంకేతిక నిపుణుల బృందం ఇప్పటికే ప్రాజెక్ట్ సైట్‌కు చేరుకుని, నష్టానికి గల ఆకస్మిక కారణాన్ని అంచనా వేస్తోంది. నష్టాన్ని గుర్తించాక, సరిదిద్దడానికి అవసరమైన చర్యలను ఎల్‌అండ్‌టీ తీసుకుంటుంది. వీలైనంత త్వరగా పరిష్కారిస్తాం'' అని సంస్థ తెలిపింది.

రసాయన వ్యర్థాల తరలింపుతో ఉద్రిక్తత

- ట్యాంకర్‌ను అడ్డుకున్న గ్రామస్తులు
- గ్రామస్తులపై పోలీసుల లాఠీచార్జి
- రాళ్లు, కర్రలతో తిరగబడిన ప్రజలు
- నారాయణపేట జిల్లాలో ఘటన


దగ్ధమవుతున్న పోలీసులకు చెందిన బైక్‌లు

మరికల్: నారాయణపేట జిల్లా మరికల్ మండలంలో ఇథనాల్ కంపెనీ నుంచి వ్యర్థాల తరలింపు వ్యవహారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వ్యర్థాలను తరలిస్తున్న ట్యాంకర్‌ను స్థానికులు అడ్డుకోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం 11 గంటలవరకు హైడ్రామా నడిచింది. రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులపై పోలీసులు లాఠీచార్జి చేయడంతో వారు తిరగబడి ఎదురు దాడి చేశారు.

వివరాలిలా ఉన్నాయి.. శనివారం రాత్రి 8 గంటల సమయంలో జూరాల ఆగ్రో ఇథనాల్ కంపెనీ నుంచి ఓ ట్యాంకర్ రసాయన వ్యర్థాలను నింపుకొని బయటకు వచ్చింది. ఆ వ్యర్థాలను మరికల్ మండలం ఎక్లాస్‌పూర్, జిన్నారం గ్రామాల శివారులో పారపోస్తున్నారని స్థానికులు ట్యాంకర్‌ను అడ్డుకొని ఆందోళనకు దిగారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం 11 గంటల వరకు గ్రామస్తులు ఆత్మకూర్ రోడ్డుపై ఆందోళన చేయడంతో మరికల్, మక్తల్, కృష్ణ, నర్వ, ధన్వాడ మాగనూర్ పోలీసులతోపాటు స్పెషల్ పార్టీ పోలీసులు రంగంలో దిగారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంటుంది. నారాయణపేట డీఎస్పీ సత్యనారాయణ ఆందోళనకారులను అదుపు చేయాలని చెప్పడంతో పోలీసులు వారిపై లాఠీచార్జీ చేశారు. దీంతో పలువురికి గాయాలయ్యాయి. అదే సమయంలో ట్యాంకర్‌ను పోలీసుల బందోబస్తు మధ్య తరలించడంతో కోపోద్రిక్తులైన గ్రామస్తులు రాళ్లు, ఇటుకలు, కర్రలతో పోలీసులపైకి దాడికి దిగారు. దీంతో అక్కడి నుంచి ప్రాణాలతో బయటపడేందుకు పోలీసులు పరుగులు పెట్టగా.. మక్తల్ సీఐ రాంలాల్‌ను కొందరు పొలాల్లో వెంబడించి తీవ్రంగా గాయపర్చారు. గాయపడిన మరికొంత మంది పోలీసులు పక్కనే ఉన్న ఆలయంలోకి వెళ్లి దాక్కున్నారు. ఆందోళనకారులు ఒక పోలీసు వాహనంతోపాటు రెండు బైక్‌లకు నిప్పంటించడంతో పూర్తిగా దగ్ధమయ్యాయి. డీఎస్పీ వాహనంతోపాటు మరో మూడు వాహనాల అద్దాలను ధ్వంసం చేశారు. గాయపడిన పోలీసులను ఆస్పత్రికి తరలించారు. కాగా, ఆందోళనకు కారణమైన వారి కోసం గాలిస్తున్నట్లు డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు.

రీడిజైన్ తప్పిదంతోనే ప్రమాదం

మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


మేడిగడ్డ బ్యారేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

కాళేశ్వరం/ మంథని: కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైన్ లోపంతోనే ప్రమాదం ఏర్పడిందని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అంబట్‌పల్లి వద్ద నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రివర్స్ పంపింగ్ అనేది ప్రపంచంలో ఎక్కడా సక్సెస్ కాలేదన్నారు. గతేడాది బాహుబలి మోటార్లు మునిగాయని, గ్రావిటీకాల్వ కూలిందని, ఇప్పుడు బ్యారేజీ పిల్లర్లు కుంగుతున్నాయని అన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ విజయభేరి యాత్రకువస్తే కాళేశ్వరానికి వెళ్లి అభివృద్ధి చూడాలన్నారని.. ఇప్పుడు మునిగిన మోటార్లు, కుంగిన బ్యారేజీని చూడాలా అని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. కాగా, అంతకుముందు ఆయన మంథనిలో విలేకరులతో మాట్లాడుతూ, నాణ్యత లేకుండా నిర్మాణం చేపట్టి ప్రజల సొమ్మును నీటిపాలు చేశారని కేసీఆర్‌పై ధ్వజమెత్తారు.

శ్వేతపత్రం విడుదల చేయాలి: ఈటల

కాళేశ్వరం: ఇంజనీరింగ్ వైఫల్యంతోనే బ్యారేజీలు దెబ్బతింటున్నాయని బీజేపీ రాష్ట్ర నాయకుడు, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం ఆయన మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి వద్ద మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించి అనంతరం మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణంతో వర్షాకాలంలో వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లుతోందన్నారు. ప్రస్తుతం 15వ పిల్లర్ల నుంచి 22వ పిల్లర్ల వరకు కుంగినట్లు తెలుస్తోందన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, బ్యారేజీ పిల్లర్లు కుంగడంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని సీఎం కేసీఆర్‌ను డిమాండ్ చేశారు.

కాళేశ్వరంతో ఆర్థిక వ్యవస్థకు చిల్లు

▶ మొదటి పేజీ తరువాయి

సమగ్ర దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు.

దసరా తర్వాత బీజేపీ రెండో జాబితా

ఎన్నికల కోసం 52 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల చేశామని కిషన్‌రెడ్డి చెప్పారు. దసరా తర్వాత రెండో జాబితా విడుదలవుతుందన్నారు. ప్రచారంలో భాగంగా రాష్ట్రంలో ఇప్పటికే ప్రధాని 5 సభల్లో, అమిత్ షా 3 సభల్లో పాల్గొన్నారని.. పార్టీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రులూ పర్యటించారని తెలిపారు. 27న మరోసారి రాష్ట్రానికి అమిత్‌షా రానున్నారని, తర్వాత యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ పర్యటిస్తారని వెల్లడించారు. దసరా తర్వాత ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేస్తామన్నారు. బీఆర్ఎస్ పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని, దీన్ని బీజేపీకి అనుకూలంగా మల్చుకుంటామని చెప్పారు. నేతలు ఇంటింటికీ తిరిగి ప్రతి ఓటర్‌ను కలిసేలా ప్రచార కార్యక్రమాలను రూపొందిస్తామన్నారు. కొన్నిరోజులుగా అధికార పార్టీ నేతలు ప్రత్యర్థులను వేధింపులకు గురి చేస్తున్నారని, అధికార యంత్రాంగాన్ని కూడా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. పాలక పార్టీ ఒత్తిడికి అధికారులు తలొగ్గవద్దని కోరారు.

రాజాసింగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

ఉత్తర్వులు జారీ చేసిన బీజేపీ కేంద్ర క్రమశిక్షణ కమిటీ

సాక్షి, హైదరాబాద్, న్యూఢిల్లీ/ అబిడ్స్: గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్‌కు ఊరట లభించింది. రాజాసింగ్‌పై ఉన్న సస్పెన్షన్‌ను ఆదివారం బీజేపీ అధిష్టానం ఎత్తివేసింది. గతేడాది ఆగస్టులో కమెడియన్ మునావర్ ఫరూకీ హైదరాబాద్‌లో ప్రదర్శన నిర్వహించిన సమయంలో రాజాసింగ్ విడుదల చేసిన ఓ వీడియో వైరల్ కావడంతో పెద్దఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. దీంతో రాజాసింగ్‌పై బీజేపీ సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే. అయితే పార్టీ ఇచ్చిన షోకాజ్ నోటీసుకు రాజాసింగ్ ఇచ్చిన వివరణపై సమీక్ష జరిపిన కేంద్ర క్రమశిక్షణ కమిటీ సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆదివారం బీజేపీ కేంద్ర క్రమశిక్షణకమిటీ సభ్య కార్యదర్శి ఓం పాఠక్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ధూల్‌పేట్ నుంచి రాజాసింగ్‌తో పాటు కార్యకర్తలు, నాయకులు కట్టెలమండిలోని బీజేపీ కార్యాలయానికి భారీ ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఏడాది తరువాత నాంపల్లి కార్యాలయానికి..

సస్పెన్షన్ ఎత్తివేసిన అనంతరం ఎమ్మెల్యే రాజాసింగ్ దాదాపు ఏడాది కాలం తర్వాత నాంపల్లిలోని పార్టీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి , ఇతర నాయకులు సాదరంగా ఆహ్వానించారు. రాజాసింగ్‌పై సస్పెన్షన్‌ను ఎత్తివేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, ఆదివారం పార్టీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి, నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి సమక్షంలో పద్మశాలి సంఘం జాతీయ నాయకుడు, జగిత్యాల జిల్లాకు చెందిన సంకు సుధాకర్ తదితరులు బీజేపీలో చేరారు.

సాక్షి హైదరాబాద్

సోమవారం, 23, అక్టోబర్, 2023

సద్దుల సంబరం

కూకట్‌పల్లిలో...









ట్యాంక్‌బండ్ వద్ద బతుకమ్మ వేడుకల్లో విదేశీ మహిళలు



నగరంలో సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఆదివారం వాడవాడలా ఆడప డుచులు రంగురంగుల పూల బతుకమ్మలతో సందడి చేశారు. కూకట్‌పల్లిలో భారీగా జరిగిన వేడుకల్లో వందలాది మంది మహిళలు పాల్గొన్నారు. భారీ బతుకమ్మలతో కూకట్‌పల్లి ప్రాంతాన్ని పూలవనంగా మార్చారు. సుమారు 100 బతుకమ్మలను 10 అడుగుల మేర పేర్చారు. దాదాపు రెండు గంటల పాటు బతుకమ్మ ఆడిన తర్వాత కూకట్‌పల్లిలోని రంగధాముని చెరువు వద్ద నిమజ్జనం చేశారు. ఇక ట్యాంక్‌బండ్‌పైనా బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. పెద్ద ఎత్తున మహిళలు ఆటపాటలతో అలరించారు.

-కూకట్‌పల్లి







11 స్థానాల్లో ఖరారు

బీజేపీ అభ్యర్థుల పేర్లు ప్రకటించిన అధిష్టానం



గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై బీజేపీ సస్పెన్షన్ ఎత్తివేయడంతో ఆయన అభిమానులు సంబరాలు జరుపుకొన్నారు. ఆదివారం ఆయన తన అనుచరులతో కలిసి బైకు ర్యాలీగా బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చారు.

- అబిడ్స్



సాక్షి, సిటీబ్యూరో: బీజేపీ అభ్యర్థుల తొలి జాబితా ఆదివారం విడుదలైంది. 52 మందితో కూడిన ఈ తొలి జాబితాలో గ్రేటర్ పరిధిలోని 26 నియోజక వర్గాలు ఉండగా, వీటిలో 11 స్థానాలకు అభ్యర్థులను అధిష్టానం ఖరారు చేసింది. హైదరాబాద్ జిల్లాలో 15 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, వీటిలో ఏడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. అదే విధంగా రంగారెడ్డి జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలు ఉండగా, మూడు స్థానాలకు, మేడ్చల్ జిల్లాలో ఐదు స్థానాలు ఉండగా, ఒక స్థానానికి మాత్రమే అభ్యర్థిని ప్రకటించారు. సంగారెడ్డి జిల్లా పరిధిలోని పటాన్‌చెరు నియోజకవర్గానికి కూడా అభ్యర్థిని ఖరారు చేశారు. కీలకమైన స్థానాలకు అభ్యర్థుల పేర్లు ప్రకటించక పోవడంతో ఆయా స్థానాల నుంచి పోటీ చేయాలని భావిస్తున్న ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. అధికార బీఆర్ఎస్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించి, వారికి పార్టీ బీఫారాలు కూడా అందజేసింది. వారంతా ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రతిపక్ష కాంగ్రెస్, విపక్ష బీజేపీలు మెజార్టీ స్థానాల్లో అభ్యర్థుల పేర్లు ప్రకటించకుండా పెండింగ్‌లో పెట్టడంతో పార్టీ శ్రేణులు ఆందోళనకు గురవుతున్నారు. ఇక బీజేపీ టికెట్ దక్కించుకున్న వారిలో ముగ్గురు గౌడ సామాజిక వర్గానికి చెందిన వారు ఉండగా, మరో ముగ్గురు యాదవ సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారు. ఒకరు ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వారు ఉండగా, మరొకరు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారు. మార్వాడీ, లోథా, ఠాగూర్ సామాజిక వర్గాల నుంచి ఒక్కొక్కరికి అవకాశం లభించింది.

టికెట్ దక్కించుకున్న అభ్యర్థులు వీరే...

పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి నందీశ్వర్‌గౌడ్, కుత్బుల్లాపూర్- కూన శ్రీశైలంగౌడ్, ఇబ్రహీంపట్నం -నోముల దయానంద్ గౌడ్, మహేశ్వరం- అందెల శ్రీరాములు యాదవ్, ఖైరతాబాద్- చింతల రామచంద్రారెడ్డి, కార్వాన్ -అమర్‌సింగ్, గోషామహల్ సిట్టింగ్ ఎమ్మెల్యే రాజాసింగ్, చార్మినార్ - మేఘారాణి, చాంద్రాయణగుట్ట-సత్యనారాయణ ముదిరాజ్, యాకుత్‌పురా- వీరేందర్ యాదవ్, బహదూర్‌పురా- నరేష్‌కుమార్, కల్వకుర్తి-తల్లోజు ఆచారి పేర్లను బీజేపీ అధిష్టానం ఖరారు చేసింది. కీలకమైన ఎల్బీనగర్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, జూబ్లీహిల్స్, సనత్‌నగర్, ముషీరాబాద్, అంబర్‌పేట్, సికింద్రాబాద్, కంటోన్మెంట్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, మేడ్చల్, మలక్‌పేట్ నియోజకవర్గాలకు అభ్యర్థులను ఇంకా ఖరారు చేయకపోవడంతో ఆశావహుల్లో ఆందోళన నెలకొంది. ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థుల మధ్య పోటీ ఎక్కువగా ఉండటమే ఈ వాయిదాకు కారణంగా తెలుస్తోంది. దసరా తర్వాత ఆయా నియోజకవర్గాలకు కూడా అభ్యర్థుల పేర్లను ప్రకటించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

కలెక్టర్ విజయ దశమి శుభాకాంక్షలు



సాక్షి, సిటీబ్యూరో: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ జిల్లా ప్రజలకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకొనే విజయదశమి పండగను ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. దసరా పండగ అందరి జీవితాల్లో విజయాలు సమకూర్చాలని, చేపట్టిన ప్రతి కార్యక్రమం సఫలీకృతం కావాలని మనసారా కోరుకుంటున్నట్లు తెలిపారు. దుర్గామాత అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని అమ్మవారి కరుణాకటాక్షాలతో అన్ని వర్గాల వారు సుభిక్షంగా, సుఖ సంతోషాలతో జీవించాలని అభిలాషించారు.

సీజ్ చేసిన రూ10.89 కోట్ల నగదు, బంగారం విడుదల

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసినప్పటి నుండి ఇప్పటి వరకు రూ.10.89 కోట్ల విలువ గల నగదు బంగారం ఇతర వస్తువులను విడుదల చేసినట్లు హైదరాబాద్ జిల్లా ఫిర్యాదుల కమిటీ ఛైర్మన్, అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా అక్రమంగా తరలిస్తున్న నగదు, బంగారం, మద్యం, గంజాయిని పోలీసు శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా పట్టుకొని సీజ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే ఎన్నికలకు సంబంధం లేని నగదు, బంగారం ఇతర వస్తువులను ప్రజలకు ఇబ్బంది కాకూడదనే ఉద్దేశంతో విచారణ జరిపి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సీజ్ చేసిన వాటిలో ఇప్పటి వరకు 95 కేసులు అప్పీల్ రాగా 67 కేసులపై కమిటీ విచారణ జరిపి విడుదల చేసినట్లు చెప్పారు. అందులో రూ.2.92 కోట్ల నగదు, రూ.5.60 కోట్ల విలువ గల బంగారం, రూ.2.37 కోట్ల విలువ గల వెండినీ విడుదల చేసినట్లు తెలిపారు. మిగతా 12 కేసులకు సంబంధించిన వ్యక్తులు హాజరు కాలేదన్నారు. మరో 16 కేసులను త్వరగా పరిష్కరిచేందుకు చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

ప్రయాణం..ప్రయాస!

దసరాకు భారీగా ఊళ్లకు తరలిన ప్రయాణికులు

- టోల్‌గేట్ల వద్ద పడిగాపులు
- పోలీసు తనిఖీలతోనూ పరేషాన్
- భయం భయంగా జనం ప్రయాణం

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరం పల్లె బాట పట్టింది. కొద్ది రోజులుగా నగరవాసులు సొంత ఊళ్లకు తరలివెళ్తున్నారు. సోమవారం దసరా కావడంతో ఆదివారం కూడా పెద్ద సంఖ్యలో నగరవాసులు సొంత ఊళ్లకు తరలివెళ్లారు. దీంతో రైళ్లు, బస్సులు కిక్కిరిశాయి. మరోవైపు సొంత వాహనాల్లోనూ పెద్ద ఎత్తున బయలుదేరారు. వాహనాల రద్దీ కారణంగా టోల్‌గేట్ల వద్ద గంటలతరబడి పడిగాపులు కాయవలసి వచ్చింది. దసరా సందర్భంగా గత వారం రోజులుగా సుమారు 30 లక్షల మంది వరకు సొంత ఊళ్లకు వెళ్లినట్లు అంచనా. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని 5200కు పైగా ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఆర్టీసీ ప్రణాళికలను సిద్ధం చేసింది. రెగ్యులర్‌గా రాకపోకలు సాగించే బస్సులతో పాటు వివిధ మార్గాల్లో అదనపు బస్సులను ఏర్పాటు చేశారు. అలాగే ప్రతిరోజు నడిచే 80 ఎక్స్‌ప్రెస్ రైళ్లు, మరో 100 ప్యాసింజర్ రైళ్లతోపాటు పలు రూట్లలో దక్షిణమధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడిపింది. రద్దీకనుగుణంగా అప్పటికప్పుడు రైళ్లను ఏర్పాటు చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ప్రయాణికుల రద్దీకనుగుణంగా నడిపేందుకు సుమారు 600 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ప్రణాళికలను సిద్ధం చేసినట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు. అన్ని రాష్ట్రాల్లోనూ విజయదశమి ముఖ్యమైన పండుగ కావడంతో ప్రయాణికుల రద్దీ ఎక్కువగానే ఉందని అధికారులు తెలిపారు.

కొనుగోళ్ల కష్టం...

రశీదు ఉంటే నగదు రూపంలో డబ్బు తీసుకెళ్లడానికి వీలు లేదనే నిబంధన వల్ల నగరవాసులు సైతం ఇబ్బందులకు గురవుతున్నారు. 'ఇళ్లల్లో దాచుకున్న డబ్బులకు ఎలాంటి రశీదులు ఉంటాయి. దసరా సందర్భంగా ఏదో ఒక వస్తువు కొనుగోలు చేసేందుకు ఇంట్లోంచి డబ్బు తీసుకెళ్లాలంటే భయంగా ఉంది' అని దిల్‌షుఖ్‌నగర్‌కు చెందిన నరహరి విస్మయం వ్యక్తం చేశారు. మరోవైపు వ్యాపారులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి వచ్చే పండ్లు, కూరగాయలు, తదితర వస్తువుల కోసం చాలా కాలంగా నగదు రూపంలో చెల్లించిన వ్యాపారులు ఇప్పటికిప్పుడు చెక్కులు, ఇతర రూపాల్లో చెల్లించేందుకు కష్టంగా ఉందని చెబుతున్నారు. మరోవైపు కొన్ని రకాల వ్యాపారాల్లో నగదు చలామణీ ఎక్కువగా ఉంటుంది. ఎన్నికలు ముగిసే వరకు ఇంకా ఎన్ని ఇబ్బందులకు గురికావలసి వస్తుందోనని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.



పోలీసుల తనిఖీలతో పరేషాన్...

ఎన్నికల నేపథ్యంలో పోలీసుల తనిఖీలు జనాన్ని బెంబేలెత్తించాయి. అడుగడుగునా వాహనాలను నిలిపి తనిఖీ చేయడంతో సాధారణ ప్రయాణికులు, సొంత వాహనాలపైన ఊళ్లకు బయలుదేరిన వాళ్లు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పండగ సందర్భంగా ఇంటిల్లిపాది కలిసి వెళ్లే క్రమంలో ఎక్కువ డబ్బులతో వెళ్లిన కుటుంబాలు మరింత ఆందోళనకు గురయ్యాయి. రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బులు తీసుకెళ్లేందుకు వీలు లేకపోవడం వల్ల చాలామంది ఇబ్బందులు పడ్డారు. బస్సులు, కార్లు, టాటాఏస్‌లు వంటి వాహనాలే కాకుండా ఆటోలు, బైక్‌లను సైతం వదిలి పెట్టకుండా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మరోవైపు పలు చోట్ల తనిఖీల కారణంగా బస్సులు సైతం ఆలస్యంగా నడిచాయని ప్రయాణికులు తెలిపారు. దీంతో భయం భయంగానే జనం ప్రయాణం సాగించవలసి వచ్చింది. ఊళ్లో అవసరాల కోసం డబ్బులు తీసుకెళ్లాలన్నా ఇబ్బందిగా మారిందని సూర్యాపేటకు చెందిన వెంకటేశ్ తెలిపారు. దాచుకున్న డబ్బులకు ఎలా లెక్కలు చెప్పగలమని విస్మయం వ్యక్తం చేశారు.



ఖైరతాబాద్‌లో..



గన్‌ఫౌండ్రీలో..



బషీర్‌బాగ్‌లో..

నగరం దాదాపు నిర్మానుష్యంగా మారింది. సిటీ ఖాళీ అయింది. పండగ కోసం పట్నం..పల్లెకు తరలడంతో సిటీలో రద్దీ బాగా తగ్గింది. దీంతో ఆదివారం ప్రధాన రహదారులన్నీ ట్రాఫిక్ లేక ఖాళీగా కనిపించాయి. బంజరాహిల్స్, బషీర్‌బాగ్, ఖైరతాబాద్, అబిడ్స్, ఎంజే మార్కెట్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ బాగా తగ్గడంతో వాహనదారులు ఎలాంటి 'జామ్'లు లేకుండా సాఫీగా సాగిపోయారు. - సాక్షి, స్టాఫ్ ఫోటోగ్రాఫర్

హుస్సేన్‌సాగర్ కేంద్రంగా ట్రాఫిక్ ఆంక్షలు

- దుర్గా మాత విగ్రహాల నిమజ్జనం కారణంగా..
- నేటి నుంచి నాలుగు రోజుల పాటు అమలు

సాక్షి, సిటీబ్యూరో: హుస్సేన్‌సాగర్ కేంద్రంగా ఉన్న ఎన్టీఆర్ మార్గ్, గార్డెన్ పాయింట్‌లతో పాటు జలవిహార్, సంజీవయ్య పార్కు వద్ద ఉన్న బేబీ పాండ్స్‌లో దుర్గా మాత విగ్రహాల నిమజ్జనం జరుగనుంది. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి గురువారం వరకు ఆయా మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ అదనపు సీపీ (ట్రాఫిక్) జి.సుధీర్‌బాబు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. విగ్రహాలతో వచ్చే వాహనాల సంఖ్య, సమయం తదితరాల ఆధారంగా ఈ మళ్లింపులు అమలవుతాయని వివరించారు. వాహనచోదకులు వీటిని దృష్టిలో పెట్టుకుని సహకరించాలని, సహాయ సహకారాల కోసం 9010203626 నెంబర్‌తో పాటు ట్రాఫిక్ పోలీసు అధికారిక



ఫేస్‌బుక్ (facebook.com/ HYDTP), ట్విట్టర్ హ్యాండిల్‌ను (@HYDTP) సంప్రదించాలని ఆయన కోరారు. దుర్గామాత విగ్రహాలకు తీసుకు వచ్చే వాహనాలకు మాత్రం మినహాయింపులు ఉంటాయని వివరించారు.

- పంజగుట్ట, రాజ్‌భవన్ వైపు నుంచి ఖైరతాబాద్ ఫ్లైఓవర్ వైపునకు వెళ్ళే ట్రాఫిక్‌ను షాదాన్ కాలేజ్, నిరంకారి భవన్ మీదుగా పంపిస్తారు.
- నిరంకారి నుంచి ఇక్బాల్ మినార్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను సైఫాబాద్ పాత ట్రాఫిక్ ఠాణా వద్ద నుంచి రవీంద్రభారతి మీదుగా పంపిస్తారు.
- ఇక్బాల్ మినార్ నుంచి అప్పర్ ట్యాంక్‌బండ్ వైపు వచ్చే వాహనాలను తెలుగుతల్లి ఫ్లైఓవర్ మీదుగా కట్ట మైసమ్మ వైపు పంపిస్తారు. అంబేడ్కర్ విగ్రహం జంక్షన్ నుంచి వచ్చే వాహనాలను ఎన్టీఆర్ మార్గ్ వైపు వాహనాలను అనుమతించరు. వీటిని ఇక్బాల్ మీనార్ వైపు మళ్ళిస్తారు.
- మినిస్టర్స్ రోడ్, రాణిగంజ్ వైపు నుంచి పీవీ నర్సింహ్మారావు మార్గ్ వైపు వెళ్ళే వాహనాలను నల్లగుట్ట రోడ్ నుంచి మళ్ళిస్తారు.
- బుద్ధభవన్ వైపు నుంచి వచ్చే వాహనాలను నల్లగుట్ట బ్రిడ్జ్, పీవీ నర్సింహ్మారావు మార్గ్ వైపు అనుమతించరు. వీటిని రాణిగంజ్, మినిస్టర్స్ రోడ్ వైపు మళ్ళిస్తారు.
- నాంపల్లి వైపు నుంచి బీజేఆర్ స్టాట్యూ వైపు వచ్చే వాహనాలను ఏఆర్ పెట్రోల్ పంప్ నుంచి రవీంద్రభారతి, ఎంజే మార్కెట్ మీదుగా పంపిస్తారు.

జూబ్లీహిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ పదవులకు మురళీముకుంద్ రాజీనామా

- కుమారుడు ఆకర్ష్‌కృష్ణ సైతం రాజీనామా
- ఆమోదించిన చైర్మన్ కృష్ణదేవరావు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యత్వానికి మురళీముకుంద్ రాజీనామా చేశారు. తన ఇంట్లో పనిచేస్తున్న యువతిపై లైంగికదాడికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో పాటు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ మురళీముకుంద్ ఆదివారం తన రాజీనామా పత్రాన్ని సొసైటీ చైర్మన్ కృష్ణదేవరావుకు పంపించారు. ఎడ్యుకేషన్ సొసైటీలో కోశాధికారిగా పనిచేస్తున్న మురళీముకుంద్ కుమారుడు ఆకర్ష్ కృష్ణ సైతం తన పదవికి రాజీనామా చేశారు. వీరి రాజీనామాలను చైర్మన్ కృష్ణదేవరావు ఆమోదించారు.

కౌంటర్ పాయింట్ పుస్తకావిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: దేశ చరిత్రకు సంబంధించినఎన్నో విషయాలను కౌంటర్ పాయింట్ స్పృశించిందంటూ వక్తలు కొనియాడారు. భారతదేశ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక చరిత్ర, పరస్పర విరుద్ధ భావజాలాలు అనే అంశంపై రచయిత ఆనందేశి నాగరాజు రచించిన కౌంటర్ పాయింట్ పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగింది. కార్యక్రమానికి హాజరైన పలువురు వక్తలు మాట్లాడుతూ... పుస్తక రచనలో రచయిత ఎంచుకున్న శైలిని ప్రశంసించారు. పుస్తక రచయిత మాట్లాడుతూ... చరిత్రను మసిబూసి మారేడు కాయ చేయకుండా వాస్తవాలు వెల్లడించే ప్రయత్నమే తన పుస్తకమని పేర్కొన్నారు. పీకాక్స్ పబ్లికేషన్స్ ప్రచురణ కర్త, ఎడిటర్ ఎ.గాంధీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మందలపర్తి కిషోర్, తల్లా వజ్ఝుల శివాజీ, డాక్టర్ వి.రామారావు, టి.నరేందర్‌రెడ్డి, రఘురాములు, ఎన్.శ్రీనివాసరావు తదితర సీనియర్ జర్నలిస్టులు, రచయితలు పాల్గొన్నారు.

న్యూడ్ కాల్స్ పేరుతో బెదిరింపులు

యువకుడి ఆత్మహత్య

అమీర్‌పేట: వాట్సాప్‌లో మాట్లాడిన న్యూడ్ కాల్స్ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసి డబ్బుల కోసం వేధిస్తుండటంతో మనస్తాపానికి లోనైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రామప్రసాదరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్లకు చెందిన పరుచూరి మణికంఠ (22) ఎస్‌ఆర్‌నగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ కంప్యూటర్ కోర్సు చేస్తున్నాడు. శనివారం రాత్రి అతను తన స్నేహితుడు అనిల్‌కు ఫోన్ చేసి రూ.5 వేలు అడగ్గా లేవని చెప్పాడు. రాత్రి అనిల్ హాస్టల్‌కు వచ్చి గది తలుపులు తట్టగా తెరవకపోవడంతో హాస్టల్ నిర్వాహకుడు మహేందర్‌తో కలిసి తలుపులు విరగొట్టి లోపలికి వెళ్లి చూడగా మణికంఠ గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆత్మహత్యకు కారణాలపై విచారణ చేపట్టారు. ఓ యువతి మణికంఠ వాట్సాప్‌కు లింక్ పంపి అతడితో న్యూడ్ కాల్స్ మాట్లాడించింది. అనంతరం వాటిని రికార్డు చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తామని బెదిరించడంతో అతను సదరు యువతికి రూ.10 వేలు పంపాడు. ఇంకా డబ్బులు ఇవ్వాలని వేధిస్తుండటంతో మనస్తాపానికి లోనైన మణికంఠ ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని పోలీసులు తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గంజాయి ముఠా అరెస్ట్

రూ.29 లక్షల విలువ చేసే సరుకు స్వాధీనం

శంషాబాద్ రూరల్: అంతర్రాష్ట్ర గంజాయి సరఫరా ముఠా పోలీసులకు పట్టుబడింది. వీరి నుంచి రూ.29 లక్షల విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా నుంచి బెంగళూరుకు గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో ఈనెల 20న పాల్మాకుల వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో ఓ వాహనంలో 102 కిలోల గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి ప్రాంతానికి చెందిన అపుర్బ బిస్వాస్(28) గంజాయి వ్యాపారం చేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన బాసుదేబ్ హలాదర్(31), రాబిన్ మండల్(31)లు అతడికి సహకరిస్తున్నారు. కాగా మరో నిందితుడు అర్జున్ ముడ్లి అక్కడి ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి సేకరించి వీరికి అందజేస్తాడు. కర్ణాటక వాసి ఫెరోజ్ ఈ గంజాయిని కొనుగోలు చేస్తుంటాడన్నారు. గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.29 లక్షల విలువైన గంజాయితో పాటు 5 మొబైల్ ఫోన్లు, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై 2019లో ఖమ్మం జిల్లా ఇల్లందు పోలీస్‌స్టేషన్‌లో వీరిపై ఎన్‌డీపీఎస్ కేసు కూడా నమోదైంది. ఈ మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఆకృతి సుధాకర్‌కు అక్కినేని పురస్కారం



సాక్షి, సిటీబ్యూరో: మూడు దశబ్దాలుగా కళల వ్యాప్తి, పరిరక్షణ కోసం ఆకృతి సుధాకర్ చేస్తున్న కృషి అభినందనీయమని అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా స్థాపక అధ్యక్షుడు డాక్టర్ తోటకూర ప్రసాద్ అన్నారు. ఆదివారం అమెరికా టెక్సాస్ లోని ఫ్రిస్కోలో అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో ఆయనకు అక్కినేని అంతర్జాతీయ ప్రత్యేక పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా తోటకూర ప్రసాద్ మాట్లాడుతూ.. అక్కినేని నాగేశ్వరరావు తమ సంస్థను స్వయంగా ప్రారంభించినందున ఈ సంస్థ పై మరింత బాధ్యత పెరిగిందన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్, విశిష్ట అతిథిగా డాక్టర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ఫౌండేషన్ సభ్యులు రావు కాలవల, సుబ్బు జొన్నల గడ్డ, లెనిన్ వేమన, దయాకర్, చిన్న సత్యం పలువురు కళాభిమానులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు మజ్లిస్ నిరసన సభ

సాక్షి, సిటీబ్యూరో: పాలస్తీనాలోని గాజాలో జరిగిన దురాగతాలకు వ్యతిరేకంగా మజ్లిస్ పార్టీ ప్రధాన కార్యాలయమైన హైదరాబాద్ దారుస్సలాంలో సోమవారం సాయంత్రం ఆరున్నర గంటలకు నిరసన బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సభలో ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, పార్టీ శాసన సభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ, పార్టీ శాసనసభ్యులు, వివిధ వర్గాల మత పండితులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు.

పీజీ ప్రవేశాల రెండో జాబితా విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూతో పాటు రాష్ట్రంలోని వివిధ వర్సిటీల్లో పీజీ కోర్సుల ప్రవేశానికి రెండో జాబితాను ఆదివారం విడుదల చేశారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఇతర పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు 20,743 మంది ఆప్షన్ ఇవ్వగా 12,244 సీట్లను కేటాయించినట్లు టీఎస్‌సీపీజీఈటీ-2023 కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 28లోగా ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాలన్నారు.

నియోజకవర్గాల్లో కవాతు

- రాచకొండలో ఏడు కంపెనీల కేంద్ర సాయుధ బలగాలు
- పోలీసులతో కలిసి అన్ని సెగ్మెంట్లలో ఫ్లాగ్ మార్చ్
- మద్యం, నగదు, బహుమతుల పంపిణీపై నిఘా
- రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాచకొండ పోలీసు సిబ్బందికి సహాయంగా ఏడు కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలు వచ్చేశాయి. ఇవి తొలి విడత బలగాలు కాగా త్వరలో మరిన్ని కేంద్ర బలగాలు రానున్నాయి. రాచకొండ పోలీస్ సిబ్బందితో కలిసి ఈ కేంద్ర బలగాలు పలు నియోజకవర్గాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించనున్నట్లు రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని, ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పాత నేరస్తులను ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా బైండోవర్ చేస్తున్నామన్నారు.

ప్రలోభాలపై నిఘా..

రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అవసరమైన ప్రదేశాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. అక్రమ నగదు తరలింపు, మద్యం బహుమతుల పంపిణీ పై నిఘా ఉంచామన్నారు. మరోవైపు నేరాలను అడ్డుకునేందుకు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని, సరైన పత్రాలు లేకుండా నగదు తదితర వస్తువులు తీసుకెళితే సీజ్ చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా...

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసినందుకు జరిమానా



బంజారాహిల్స్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా జీహెచ్ఎంసీ అధికారులు కఠిన చర్యలపై దృష్టిసారించారు. ఎన్నిసార్లు అవగాహన కల్పించినా తీరు మార్చుకోని వారికి జరిమానాలతో బుద్ధి చెప్తున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎన్బీటీ నగర్ బస్తీలో ఉన్న సాయిరాం స్కూల్ వద్ద గత కొద్ది రోజులుగా స్థానికులు చెత్త వేస్తున్నారు. సర్కిల్–18 ఏఎంహెచ్‌వో రజినీకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఎనిమిది మందికి రూ. 100 చొప్పున జరిమానా విధించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దంటూ వారికి తెలిపారు.

నాయిని సేవలు చిరస్మరణీయం

లిబర్టీ: నీతికి నిజాయితీకి నిలువుటద్దం మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి అని లోక్ దళ్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పి.వి.రాజేశ్వరరావు అన్నారు. నాయిని నర్సింహారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమావేశంలో నేతలు వాసంతి, సంకీర్త, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

'నేషనల్ పీపుల్స్ ఫ్రంట్' ఆవిర్భావం

లిబర్టీ: శాసనసభ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోని 119 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయాలని నేషనల్ పీపుల్స్ ఫ్రంట్ నిర్ణయించింది. రాజ్యాధికార పార్టీ, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీలతో నేషనల్ పీపుల్స్ ఫ్రంట్ ఏర్పడింది. ఆదివారం ఫ్రంట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌బాబు జాతీయ కార్యదర్శి సి.హెచ్.బాలకృష్ణ, ఫ్రంట్ చైర్మన్ నారగోని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్ మీడియాతో మాట్లాడుతూ... మూడు పార్టీలతో ఫ్రంట్ ఏర్పడిందని, నవంబర్‌లో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో తెలంగాణలోని 33 జిల్లాల్లో అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. 90 శాతం టికెట్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కేటాయించాలని తీర్మానించినట్లు వారు తెలిపారు. మహిళలకు సముచిత స్థానం ఇస్తామన్నారు.

వైభవంగా శ్రీవారి రథోత్సవం



వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ఆలయ పరిసరాల్లో శ్రీవారి తిరువీధి రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో విచ్చేసి స్వామివారి ఊరేగింపులో పాల్గొన్నారు. ఉదయం స్వామివారి సుప్రభాత సేవ, భగవదారాధన, సేవాకాలం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా స్వామివారికి ఆలయ చైర్మన్ సి.హెచ్.రామయ్య, ఈవో ఎన్.లావణ్య విశేష పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో విశ్వశాంతి హోమం

లిబర్టీ: దేశభక్తి, దైవభక్తిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని భారతీయ ధార్మిక సేవా సమితి అధ్యక్షులు కె.వి.ఎస్.శర్మ కోరారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం విశ్వశాంతి హోమం నిర్వహించారు. నిరంతరం భక్తితో హోమాలు నిర్వహిస్తే శాంతి సామరస్యంతో ముక్తి మార్గంలో భగవంతుని చేరుకోవచ్చని శర్మ అన్నారు.

దుర్గాదేవి అలంకారంలో జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి



జూబ్లీహిల్స్ సీతారామస్వామి ఆలయంలో పర్వత వర్ధని దేవీ



దైవసన్నిధానం రాజరాజేశ్వరి దేవి



మహిషాసుర మర్ధనిగా శ్రీనగర్ కాలనీ భ్రమరాంబాదేవి



దుర్గాదేవిగా జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి



బంజారాహిల్స్ కనకదుర్గా దేవి

దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మతల్లి శ్రీ దుర్గా దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా రాత్రి చండీహోమం నిర్వహించారు. జూబ్లీహిల్స్ శ్రీ సీతారామస్వామి దేవాలయంలో కొలువుదీరిన పర్వత వర్ధనీ దేవి అమ్మవారు శ్రీ దుర్గా దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఫిలింనగర్ దైవసన్నిధానంలో శ్రీ దుర్గా దేవి సన్నిదానంలో చండీ హోమం వైభవంగా నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని శ్రీ కనకదుర్గా దేవి ఆలయంలో దుర్గాష్టమి సందర్భంగా ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ లలితా సహస్రనామ విధాన సామూహిక కుంకుమార్చనలు వైభవంగా జరిగాయి. శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కొలువుదీరిన శ్రీ భ్రమరాంబా దేవి అమ్మవారు శ్రీ మహిషాసుర మర్దనీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. వేడుకల్లో భాగంగా శ్రీ మహాగణపతి పూజ రుద్రాభిషేకం, శ్రీ చక్రార్చన, చండీ హోమం వైభవంగా నిర్వహించారు.

– బంజారాహిల్స్



ఇందిరానగర్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి



జవహర్‌కాలనీలో పూజల్లో పాల్గొన్న దానం



వెంకటగిరిలో పూజలు చేస్తున్న జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు



హిమాయత్‌నగర్‌లో టీ పీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి...



హేమావతీనగర్‌లో అన్నదానం

ఒక్కేసి.. పువ్వేసి చందమామా..

- వాడవాడలా బతుకమ్మ సందడి
- ఆటపాటలతో సందడి చేసిన మహిళలు



ఎమ్మెల్యే కాలనీ క్లబ్‌లో బతుకమ్మ వేడుకలు...



ఎన్బీటీ నగర్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న నగర మేయర్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: సద్దుల బతుకమ్మ పండగ వేడుకలు ఆదివారం వాడవాడలా కనుల పండువగా జరిగాయి. పూల పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. బస్తీలు, కాలనీలు, అపార్ట్‌మెంట్లలో ప్రత్యేకంగా వేదికలు ఏర్పాటు చేసి బతుకమ్మలు ఆడి, పాడి సందడి చేశారు. నందినగర్, ఎన్బీటీనగర్, ఖైరతాబాద్ ఐమ్యాక్స్ పక్కన ఉన్న ఖాళీ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదయాలకు చిహ్నమైన బతుకమ్మ ఆటపాటలతో ఖైరతాబాద్ నియోజకవర్గంలోని అపార్ట్‌మెంట్‌లు, కాలనీలు, బస్తీలు, ప్రధాన కూడళ్లు మారుమోగాయి. తీరొక్క పువ్వుతో పేర్చిన బతుకమ్మలను తీసుకువచ్చి ఒకదగ్గరపెట్టి బతుకమ్మ పాటలకు అనుగుణంగా మహిళలు మైమరచి నృత్యాలు చేశారు. ఒక్కేసి పువ్వేసి చందమామా... ఒక్కజాములాయే చందమామా అంటూ మహిళలు ఆడిపాడారు.



బంజారాహిల్స్‌లో బతుకమ్మ వేడుకలు..



గౌరీ శంకర్ కాలనీలో బతుకమ్మ వేడుకలు..



ఖైరతాబాద్‌లో బతుకమ్మ వేడుకలు..



నందినగర్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న విజయారెడ్డి..



ఫిలింనగర్‌లో బీజేఆర్‌నగర్ బస్తీలో బతుకమ్మ వేడుకలు..

భళా.. బొమ్మల కొలువు



సాక్షి, సిటీబ్యూరో: ఆధునిక సాంకేతిక యుగంలో ఆధ్యాత్మిక సంప్రదాయ రీతులను వెతికి పట్టుకోవడం కూడా కష్టమైపోతోంది. అంతకంతకూ అంతరిస్తున్న అనేక రకాల అందమైన సంప్రదాయాల్లో దసరా పండగను పురస్కరించుకొని ఏర్పాటు చేసే బొమ్మల కొలువు ఒకటి. ఈ నేపథ్యంలో బంజారాహిల్స్‌లో నివాసం ఉంటున్న హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంగరాజన్ నివాసంలో నెలవైన బొమ్మల కొలువు అతిథులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

పర్యావరణ సందేశంతో...

వీణను గ్యాస్ కనెక్షన్ ట్యూబ్‌తో పాముకి రూపం కట్టారు. పదుల సంఖ్యలో బొమ్మలు పలు ఈవెంట్లకు హాజరైనప్పుడు జస్టిస్ రంగరాజన్ ధరించిన బ్యాడ్జెస్ వంటివి వినియోగించి వాటికి దుస్తులు కుట్టారు. బొమ్మల్ని కొలువు ఉంచిన ఫ్లోరింగ్‌ను పాత సిడీలతో కుట్టేశారు. ఇలా అన్నీ పాత వస్తువుల రీసైక్లింగ్‌తో అందమైన బొమ్మల్ని తయారు చేసి అటు సంప్రదాయాన్ని సజీవంగా ఉంచుతూ ఇటు పర్యావరణ హిత సందేశాన్ని పంచుతూ నట్టింట కనుల పండుగగా కొలువుదీర్చారు రంగరాజన్ సతీమణి.

జంగ్ తెలంగాణ 2023

చింతలకు అభినందన

రహమత్‌నగర్: బీజేపీ ఖైరతాబాద్ నియోజకవర్గం అభ్యర్థిగా రెండవ సారి ఎంపికైన చింతల రామచంద్రారెడ్డిని ఆ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధి కొలన్ సత్యనారాయణ పార్టీ నాయకులతో కలిసి ఆదివారం అభినందించారు. ఎన్నికల్లో చింతల ఘన విజయం సాధిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

బీజేపీ ఖైరతాబాద్ అభ్యర్థిగా చింతల రామచంద్రారెడ్డి

బంజారాహిల్స్:



పేరు: చింతల రామచంద్రారెడ్డి
పార్టీ: బీజేపీ
నియోజకవర్గం: ఖైరతాబాద్
తల్లిదండ్రులు: రామిరెడ్డి, అనసూయమ్మ
విద్యార్హతలు: పాలిటెక్నిక్ ఎల్ఎల్ఈ
వృత్తి: వ్యాపారం
కుమారుడు: ఖగేంద్ర రామానుజారెడ్డి
రాజకీయ రంగ ప్రవేశం: చింతల రామచంద్రారెడ్డి ప్రస్తుతం తెలంగాణ బీజేపీ ఉపధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. భారతీయ జనసంఘ్ పార్టీ నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ గ్రేటర్ హైదరాబాద్ బీజేపీ అధ్యక్షుడిగా పని చేశారు. బీజేపీ నుంచి ఖైరతాబాద్ నియోజకవర్గం అభ్యర్థిగా మూడు సార్లు పోటీ చేసి 2014లో తెలంగాణ అసెంబ్లీ తొలి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు.



బీజేపీ టికెట్ చింతలకు కేటాయించడంపై హర్షం

హిమాయత్‌నగర్: బీజేపీ ఖైరతాబాద్ నియోజకవర్గం అభ్యర్థిగా చింతల రామచంద్రారెడ్డిని ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేయడంతో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఆదివారం హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ హిమాయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్ ముదిరాజ్, పందిర్ల ప్రసాద్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్, విజయ తులసి, జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

ప్రతి ఇంటికీ పట్టా ఇప్పిస్తా: ఎమ్మెల్యే దానం

ఫిలింనగర్: ఎన్నో ఏళ్లుగా డబ్బులు చెల్లించక బ్యాంకు తనాఖాలో ఉన్న జేఎన్ఎన్‌యూఆర్ఎం నివాసాల పట్టాలను విడిపించి ఇప్పించే బాధ్యత తనదేనని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని జూబ్లీహిల్స్ రోడ్ నెం. 46 అంబేడ్కర్ కాలనీలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బస్తీవాసులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... సమాఖ్య సంఘాలకు ప్రత్యేకంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయిస్తామన్నారు. సౌభాగ్యలక్ష్మి స్కీం కింద ప్రతీ మహిళ లబ్ధి పొందే విధంగా తానే చొరవ తీసుకుంటానన్నారు. వచ్చే ఏడాది మార్చి తర్వాత ఇక్కడున్న నివాసితుల పక్కా ఇళ్ల బకాయిలను మాఫీ చేయించి పట్టాలు అందిస్తానన్నారు. ఎన్నికలు పూర్తికాగానే సంక్షేమ పథకాలను పంపిణీ చేపడతామన్నారు. కాంగ్రెస్, బీజేపీల వైపు చూస్తూ నిండా మునిగిపోతారని ఆగం కావొద్దని పిలుపునిచ్చారు. ఖైరతాబాద్‌లో మళ్ళీ తాను గెలవడం ఖాయమని కేసీఆర్ ముఖ్యమంత్రి కావడాన్ని ఎవరూ ఆపలేరన్నారు. కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు గద్దల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్, ఉపాధ్యక్షులు ఎం. శ్రీను, అందె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



మట్లాడుతున్న ఎమ్మెల్యే దానం

'బీజేపీ పతనం ప్రారంభం'

లిబర్టీ: బీసీలను విస్మరించిన బీజేపీ పతనం ప్రారంభమైందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు డి.కుమారస్వామి వ్యాఖ్యానించారు. బీజేపీని ఓడించే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. ఆదివారం దళ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీల పంతం బీజేపీ అంతం లక్ష్యంగా పని చేస్తామన్నారు. కేంద్రంలో రెండుసార్లు అధికారంలోకి వచ్చిన దాదాపు 10 ఏళ్లలో ఏ ఒక్క బీసీ సమస్యనైనా పరిష్కరించారని నిలదీశారు.

జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ విజయం తథ్యం

రహమత్‌నగర్: శాసనసభ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ మరోసారి విజయం సాధించడం ఖాయమని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ ధీమా వ్యక్తం చేశారు. బోరబండ డివిజన్‌లోని పలు బస్తీల్లో ఆదివారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, ఇన్‌చార్జ్ సిరాజ్, కో ఆర్డినేటర్ విజయసింహ, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిత్వంపై వీడని పీటముడి

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనే విషయంపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఆ పార్టీ ఇటీవల మొదటి జాబితాను విడుదల చేయగా అందులో ఖైరతాబాద్ అభ్యర్థిని ప్రకటించకపోవడంతో ఆశావహులు ఎదురు చూపులతో టెన్షన్ పడుతున్నారు. ఖైరతాబాద్ టికెట్‌ను ఆశిస్తున్న వారిలో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత వినోద్‌రెడ్డిలు ఉన్నారు. అధిష్టానం ఇంకా టికెట్ ప్రకటనలో జాప్యం పెంచుతుండటంతో కార్యకర్తలు సైతం అయోమయపడుతున్నారు. ఇప్పటికే బీజేపీ, బీఆర్ఎస్ తమ అభ్యర్థులను ప్రకటించగా కాంగ్రెస్‌లో మాత్రమే ఉత్కంఠకు తెరదింపడం లేదు. ఇప్పటికే ఢిల్లీ స్థాయిలో రోహిణ్‌రెడ్డి పైరవీలు ముమ్మరం చేయగా పీజేఆర్ కూతురిగా విజయారెడ్డి వైపు సైతం అధిష్టానం మొగ్గుచూపుతున్నది. వీరిద్దరికి తోడు పార్టీకి నమ్మిన బంటుగా ఉన్న పార్టీని వీడకుండా కాంగ్రెస్ బలోపేతానికి గత రెండు దశాబ్ధాలుగా కృషి చేస్తున్న వినోద్ రెడ్డి పేరును కూడా అధిషానం పరిశీలనలోకి తీసుకుంది. మరో రెండు రోజుల్లో ఖైరతాబాద్ కాంగ్రెస్ టికెట్ ఖరారు కానున్న నేపథ్యంలో ఈ ముగ్గురిలో అదృష్టం ఎవరిని వరిస్తుంది అన్నది సస్పెన్స్‌గా మారింది.

అమ్మవారి పూజల్లో అజహరుద్దీన్ తనయుడు అసదుద్దీన్

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్‌లోని టి.అంజయ్యనగర్ బస్తీలో పీజేఆర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద శనివారం రాత్రి మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అజహరుద్దీన్ తనయుడు మహ్మద్ అసదొద్దీన్, కాంగ్రెస్ పార్టీ నగర నాయకుడు భవానీశంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు రవీందర్‌రెడ్డి, గ్యార నాగరాజు, కేశవులు, ఆండాళు, శివ, జె.పి.జ్ఞానేశ్వర్, సాయి, అరుణ్‌గౌడ్, యాదగిరి, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ జూబ్లీహిల్స్ అభ్యర్థిత్వంపై కొనసాగుతున్న సస్పెన్స్!

- ఆశావహుల్లో ఉత్కంఠ
- దసరా తరువాతే స్పష్టత

శ్రీనగర్‌కాలనీ: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అధిష్టానం ప్రకటించిన మొదటి జాబితాలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగే అభ్యర్థి పేరు లేకపోవడంపై ఆశావహుల్లో ఒకింత గందరగోళం నెలకొంది. 52 మందితో కూడిన జాబితాను ఆదివారం ప్రకటించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న వారు ప్రచారం చేయకుండా లోలోపల స్థానిక నేతలు, కాలనీవాసులలో చర్చలు జరుపుతున్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా విదేశాల్లో డాక్టర్‌గా సేవలందించి, ఫౌండేషన్ పేరులో సేవాకార్యక్రమాలను నిర్వహిస్తూ, జాతీయ మహిళా మోర్చా సభ్యురాలిగా జాతీయ స్థాయిలో పార్టీకి సేవలందిస్తున్న డాక్టర్ పద్మ వీరపనేపని పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. పలు రాష్ట్రాల్లో, తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో ఆమె చురుకుగా పాల్గొన్నారు. పార్టీ సైతం ఆమె చేసిన కార్యక్రమాలను గుర్తుంచుకొని రేసులో ముందు వరుసలో పెట్టినట్లు సమాచారం. తదుపరి వ్యాపారవేత్త కీర్తి రెడ్డి, సీనియర్ నేతలు లంకల దీపక్‌రెడ్డి, ఆలపాటి లక్ష్మీనారాయణ, కుంబాల గంగరాజు, కిలారి మనోహర్ రేసులో ఉన్నారు. కీర్తిరెడ్డి మహిళానేతగా కాలనీ, బస్తీల్లో చురుకుగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. తాను చేస్తున్న కార్యక్రమాలు, ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే పనితీరు ప్రశ్నించిన తీరుపై తనకు టికెట్ వస్తుందని ధీమాగా ఉన్నారు. లంకల దీపక్‌రెడ్డి సీనియర్ నేతగా, ఢిల్లీ నుంచి తెలంగాణ వరకూ తనకున్న పేరు, సీనియారిటీతో పార్టీ తనకు కచ్చితంగా టికెట్ వస్తుందని ఆశిస్తున్నారు. వ్యాపారవేత్త, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనే ఆలపాటి లక్ష్మీనారాయణ తన వెనకున్న క్యాడర్, తాను చేసిన కార్యక్రమాలతో పార్టీ తనకు టికెట్ ఇస్తుందని, వీరందరినీ కాదని తనను ప్రకటిస్తుందని ధీమాగా ఉన్నారు. మాజీ కార్పొరేటర్‌గా, సుదీర్ఘంగా రాజకీయం ప్రస్థానంలో ఉన్న కిలారి మనోహర్ టికెట్‌ని పార్టీ ఇస్తుందని గంపెడు ఆశతో ఉన్నారు. రెండు దశాబ్దాలుగా పార్టీలో ఉంటూ, కార్పొరేటర్‌గా పోటీచేసి అతితక్కువ ఓట్లతో ఓడిన ఎస్సీ నేత కుంబాల గంగరాజు పార్టీ తన సీనియారిటీకి సీటు ఇస్తుందని ఆశిస్తున్నారు. ఇలా రేసులో జూబ్లీహిల్స్ బీజేపీ టికెట్‌కి పెద్ద లిస్టే ఉంది. ప్రముఖ నేతల సమాచారం మేరకు ఇప్పటికే టికెట్ ఇవ్వాలనుకున్న వారికి ఆదేశాలను ఇచ్చి పార్టీ కార్యక్రమాలను చూసుకోమని చెప్పినట్లు తెలిసింది. రెండు లేకుంటే మూడో జాబితాలో జూబ్లీహిల్స్ టికెట్ ఖరారు చేసే అవకాశాలున్నాయి. బీజేపీ ప్లాన్‌లో బీఆర్ఎస్, టీఆర్ఎస్‌తో పాటు ఎంఐఎం పోటీలో ఉంటే ముక్కోణపు పోరులో తమకున్న ఓటుబ్యాంకుతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో తమ గెలుపు పక్కా అని పేపర్ వర్క్ కూడా చేశారని విశ్వసనీయ సమాచారం. ఆశావాహుల్లో పెద్దలిస్టే ఉన్నా జూబ్లీహిల్స్ బీజేపీ సీటు ఎవరికీ వరిస్తుందో దసరా తర్వాత తెలిసే అవకాశం ఉంది.

సాక్షి
ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం ॥ 23-10-2023

విజయ దశమి ప్రత్యేకం



స్త్రీ శక్తి విజయం విజయ దశమి

ఈ చరాచర జగత్తుని నడిపించేది శక్తి. ఈ శక్తి లేనట్టయితే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు తమ తమ కృత్యాలైన సృష్టి స్థితిలయాలు నిర్వర్తించటమే కాదు, కదలటం కూడా చేత కాని వారవుతారు. ఆ శక్తినే అదిశక్తి, పరాశక్తి అంటారు. ఆ శక్తి త్రిగుణాత్మకంగా ఉంటుంది. సత్వరజస్తమో గుణాలతో శక్తిబీజం సంయోగం చెందితే 'స్త్రీ'అవుతుంది. అటువంటి త్రిగుణాలతో కూడిన శక్తి ఆవిర్భవించి దుష్టరాక్షస సంహారం చేసిన సమయం శరదృతువు.

ఇవే కాదు మహాశక్తి ఎప్పుడు ఎక్కడ దుష్టసంహారం చేయవలసిన అవసరం వచ్చినా, శిష్టరక్షణ చేయవలసిన అవసరం కలిగినా జీవులపై ఉన్న అంతులేని ప్రేమతో అవతరిస్తూ వచ్చింది. ఎంతైనా జగన్మాత కదా! అన్ని సందర్భాలలోను ఆ తల్లి ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు అవతరించి నవమి నాడు రాక్షససంహారం చేయటం జరిగింది. కనుక ఆదిపరాశక్తిని ఆ సమయంలో పూజించి ఆ తల్లి అనుగ్రహం పొందటం సంప్రదాయం అయింది.

అందరు దేవతల శక్తి ఏకీకృతమై రూపుదాల్చిన శ్రీదేవి రాక్షసులతో యుద్ధంచేసే సమయంలో దేవతలు, ఋషులు ఆమెకు పుష్టి కలగటానికి – యజ్ఞాలు, హోమాలు, జపాలు, తపాలు, పూజలు, పారాయణలు మొదలైన దీక్షలు పూనారు. మానవులు కూడా ఉడతాభక్తిగా తమకు తోచిన విధంగా దీక్షలు చేయటం మొదలు పెట్టారు.

ప్రథమంగా ఆవిష్కృతమైన శక్తి తమోగుణ ప్రధానమైనది. నిర్గుణయైన పరాశక్తి మొదటి సగుణ ఆవిర్భావం తమోగుణమయమైన మహాకాళి. అందువల్లనే మహాకాళీ మహాలక్ష్మీ మహాసరస్వతీ అని జగదంబిక త్రిశక్తులలో మొదటిదిగా మహాకాళినే పేర్కొనటం జరుగుతుంది.

ఇది వైవస్వత మన్వంతర వృత్తాంతం.

సావర్ణి మన్వంతరంలో ఆదిపరాశక్తి రజోగుణ ప్రధానమైన మహాలక్ష్మిగా అవతరించింది. దానికి హేతువు మహిషాసురుడు.ఈ తత్వాన్ని వంట పట్టించుకోవటం ఏ కాలం లోనైనా అవసరమే. మహిషాసురులు ఎప్పుడూ ఉంటారు. అందుకే మహిషాసుర మర్దినులైన మహాలక్ష్ముల అవసరం ఎప్పుడూ ఉంటుంది.

మహిషుని సంహరించేందుకు త్రిమూర్తుల నుంచి ఉద్భవించిన తేజస్సు అమ్మవారిగా ఆకారం ధరించింది. దేవతలందరూ ఆమెకు తమ తేజస్సును, ఆయుధాలను సమకూర్చారు. తన సంహారం కోసమే ఆమె ఆవిర్భవించిందని తెలిసినా మహిషుడు రకరకాలుగా ఆమెను ప్రలోభ పెట్టాలని చూశాడు. ఆమె అంగీకరించకపోయేసరికి కామరూపి గనుక ఆమెతో రకరకాల రూపాలతో యుద్ధం చేశాడు. ఆ రూపాలకు తగిన రూపాలను ధరించి దేవి మహిషరూపంలో ఉన్న రాక్షసుని సంహరించింది. ఇది జరిగింది ఆశ్వయుజ శుద్ధ నవమి రోజున. అప్పటివరకు దీక్ష వహించిన వారందరు దశమి నాడు జగదంబను స్తుతించి, అమ్మకు పట్టాభిషేకం చేసి, స్త్రీ శక్తి విజయానికి వేడుకలు చేసుకుని ఆనందించారు. వారి స్తుతులకు సంతసించిన శ్రీదేవి వారిని వరం కోరుకోమన్నది. తమకు అవసరమైనప్పుడు ఈ విధంగా కాపాడమని కోరారు. ఆమె వారు తలచినప్పుడు అవతరిస్తానని మాట ఇచ్చింది.

మరొకప్పుడు శుంభ నిశుంభులనే దానవ సోదరులు వేల ఏండ్లు తపస్సు చేశారు. బ్రహ్మ వారి తపసుకి మెచ్చి, ప్రత్యక్షమై వరం కోరుకోమంటే – తమకు అమరత్వం ప్రసాదించమని కోరారు. బ్రహ్మ అది తన చేతులలో లేదని, ఇంకేదైన వరం కోరుకోమని అన్నాడు. వారు తమకు అమర, నర, పశు, పక్షి పురుషుల వల్ల చావులేని వరం ఇమ్మని కోరారు. అంతటితో ఆగలేదు. స్త్రీలు బలహీనులు కనుక మాకు వారి వల్ల భయం లేదు అని చెప్పారు. బ్రహ్మ తథాస్తు అన్నాడు. స్వర్గంపై దాడి చేసి, ఇంద్రుని ఆసనాన్ని అధిరోహించి, త్రైలోక్యాధిపత్యాన్ని, యాగభాగాలని కూడా హరించారు. దిక్పాలకులను సూర్యచంద్రాది దేవతలను గెలిచి, వారి పదవులను కూడా గ్రహించాడు. వారి పనులు కూడా తానే చేయటం మొదలు పెట్టాడు.

దేవతలు బృహస్పతి సూచననుసరించి హిమవత్పర్వతం మీద ఉన్న దేవిని శరణు వేడారు. జగదంబ వారికి అభయం ఇచ్చింది. ఆ సమయంలో సర్వదేవతలు తమ శక్తులను జగదంబకు తోడుగా పంపారు. అవన్నీ ఆయా దేవతలకు చెందిన ఆభరణాలను, ఆయుధాలను ధరించి, వాహనాలను అధిరోహించి వచ్చి రక్తబీజుని సైన్యాన్ని మట్టు పెట్టసాగాయి. ఈ శక్తులను మాతృకాగణాలు అంటారు.

1. బ్రహ్మ శక్తి బ్రహ్మాణి.
2. విష్ణువు శక్తి వైష్ణవి
4. కుమారస్వామి శక్తి షష్ఠీ దేవి కౌమారి.
5. ఇంద్రుని శక్తి ఐంద్రి, మాహేంద్రి, ఇంద్రాణి అనే పేర్లు కూడా ఆమెకున్నాయి.
6. ఆదివరాహమూర్తి శక్తి వారాహీ దేవి
7. నృసింహుని శక్తి నరసింహ రూపం నారసింహీ అనే నామం.

ఈ మాతృకా గణంతో పాటుగా వరుణుని శక్తి వారుణీదేవి శత్రువులని పాశంతో బంధించి, మూర్ఛితులను చేసి, ప్రాణాలను తీస్తోంది.

యముని రూపంతో యముని శక్తి యామ్యాదేవి మహిషము నెక్కి, దండాన్ని ధరించి, భయం గొలిపే విధంగా రణభూమిలో అడుగు పెట్టి, దానవులని యమసదనానికి పంపుతోంది. వీరికి తోడు శివదూతి కూడ విజృంభించి దానవులను నేలకూల నేస్తూ ఉంటే, చాముండా, కాళికలు వారిని తినేస్తున్నారు.

దానవులు భయపడి పారిపోతుంటే రక్తబీజుని కోపం మిన్ను ముట్టి, దేవితో యుద్ధానికి వచ్చాడు. మాతృకాగణాలు అతడిపై ఆయుధాలను వేయగానే వాడి శరీరం నుండి కారిన ప్రతి రక్తబిందువు నుండి, ఒక్కొక్క రక్తబీజుడు పుట్టి వారి సంఖ్య అసంఖ్యాకం అయింది. దేవతలందరు భయభ్రాంతులై పోయారు. అప్పుడు అంబిక కాళికను నోరు పెద్దది చేసి, రక్తబీజుడి నుండి కారుతున్న రక్తాన్నంతా తాగివేయ మని చెప్పింది. వాడి శరీరం నుండి కారుతున్న రక్తాన్ని, కింద పడకుండా తాగటంతో వాడు నీరసించాడు. వాడి శరీరాన్ని శ్రీదేవి ముక్కలు చేస్తుంటే, కాళిక తినేసింది. అంబిక వాహనమైన సింహం కూడా ఎంతో మంది దానవులని తినేసింది.

అపుడు నిశుంభుడు శ్రీదేవితో యుద్ధానికి బయల్దేరాడు. ముందుగా నిశుంభుడి తల తెగ నరికింది దేవి. అయినా అతడి మొండెం కత్తి పట్టుకొని తిరుగుతుంటే ఆ మొండెం కాళ్ళు చేతులు నరికింది దేవి. దానితో నిశుంభుడు అసువులు బాసాడు.

శుంభుణ్ణి శ్రీదేవి తనతో యుద్ధం చేయలేకపోతే చండికతో గాని, కాళికతో గాని యుద్ధం చెయ్యమంది. అతడు పౌరుషం పెరిగి, శ్రీదేవితోనే యుద్ధం చేయదలచాడు. ఘోరయుద్ధం తరువాత శ్రీదేవి శుంభుని పరిమార్చింది. దేవతలకు తిరిగి స్వర్గ రాజ్యం లభించింది. మాటలతో సాధించిన విజయానికి సంకేతం ఇది. మాట నైపుణ్యంతో యుద్ధానికి ఆహ్వానించి గెలిచిన జగన్మాత అవతారాన్ని మహా సరస్వతిగా చెప్పటం జరిగింది.

సామూహికంగా కుంకుమార్చనలు చేసినా, చండీహోమాదులు చేసినా, బొమ్మల కొలువులు పెట్టినా, బతకమ్మలు ఆడినా కనపడేది ఏదైనా పది మంది కలిసి చేయాలనే ఐక్యభావన. శక్తి స్వరూపమైన స్త్రీ జాతి పట్ల గౌరవ మర్యాదలు నెరపటం.

''యా దేవీ సర్వ భూతేషు శక్తి రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః.''

– డాక్టర్ ఎన్.అనంతలక్ష్మి



నవరాత్రులు అన్నా, అమ్మవారి పూజలన్నా ప్రధానంగా చేసేది లలితా రహస్య నామ సాహస్ర పారాయణం. కుంకుమార్చన చేసినా సహస్రనామాలతోనే చేస్తారు. జగదంబ లలితాదేవిగా ఆవిర్భవించిన ఇతివృత్తం బ్రహ్మాండ పురాణం లలితోపాఖ్యానంలో వివరించబడింది. ఆమె సర్వచైతన్యస్వరూపిణి కనుక ఆమెను 'లలిత' అని పిలిచారు.తమను కన్నతల్లి లాగా భావించి శ్రీమాతా! అని సంబోధించారు. జీవితం అంటే సుఖపడటం – సుఖపడటం అంటే తినటం, నిద్రపోవటం మాత్రమే అని భావించటమే బండతనం. అటువంటి వారికి ఉండేది శూన్యమే కదా! బండతనం పోవాలంటే తగిన మార్గం ఒకటే. అది చైతన్యవంతులు కావటమే. అందుకే జగదంబ భండాసురవధ చేయటానికి సర్వచైతన్యస్వరూపిణిగా అవతరించింది. బండతనం మీద చైతన్యం విజయం సాధించటానికి సంకేతం విజయదశమి. శరన్నవరాత్రులలో అమ్మ అవతారాలలో లలితాదేవి అవతారం ఎంతో ప్రాధాన్యాన్ని కలిగి ఉంటుంది. నిజానికి శక్తి అన్నా, చైతన్యమన్నా ఒకటిగానే భాసిస్తాయి. చైతన్యం లేనిదే శక్తి వ్యక్తం అయ్యే అవకాశం లేదు కదా!



సమాజంలో ఎప్పుడూ మంచి చెడూ కలిసే ఉంటాయి. వాటి మధ్య జరిగే సంఘర్షణలో మంచి గెలవటానికి ప్రతీక విజయ దశమి. అలా మంచి గెలవటానికి ఎప్పుడు ఏ శక్తి కావాలో ఆ శక్తిగా అవతరించి సజ్జనులకు తోడుపడుతుంది జగన్మాత. అది శరీరంలో అనారోగ్యం కావచ్చు, మనస్సులో ఉన్న దుర్గుణాలు, దురాలోచనలు కావచ్చు, సమాజంలో ఉన్న దురాచారాలు, మూఢనమ్మకాలు కావచ్చు, ప్రకృతిని, పర్యావరణాన్ని కలుషితం చేసే మాలిన్యాలు కావచ్చును, సృష్టి నియమాలకి విరుద్ధంగా కలకాలం బతికి ఉండాలనే స్వార్థం కావచ్చును, ఒక జాతినో, వర్గాన్నో చులకన చేసే అహంకారం కావచ్చు ఒక జాతినో, వర్గాన్నో అవమానం చెయ్యటం కావచ్చును – ఇటువంటి ఎన్నో చెడులక్షణాల మీద విజయం సాధించిన రోజు విజయ దశమి. ముఖ్యంగా స్త్రీ పట్ల చులకన భావం కలిగిన దున్నపోతు మనస్తత్వం మీద స్త్రీ శక్తి విజయానికి సంకేతం విజయ దశమి. సద్భావనలు పెంపొందించుకునే రోజు. అందుకే ఒకరినొకరు అభినందించుకుంటూ జమ్మి పత్రాలని బంగారం, వెండి అనే పేరుతో పంచుకుంటూ ఉంటారు.

సినిమా

టైగర్ నాగేశ్వరరావు సంతృప్తి ఇచ్చింది – రవితేజ



● అభిషేక్ అగర్వాల్, వంశీకృష్ణ, రవితేజ, వివేక్ కూచిభొట్ల, మయాంక్ సింఘానియా

''టైగర్ నాగేశ్వరరావు' చిత్రాన్ని ప్రేక్షకులు, నా శ్రేయోభిలాషులు, నా అభిమానులు గొప్పగా ప్రశంసిస్తున్నారు. వాళ్లే ఈ సినిమాని బ్రహ్మాండంగా ప్రమోట్ చేయడం ఆనందంగా ఉంది. 'విక్రమార్కుడు' చిత్రంలోని విక్రమ్ రాథోడ్ తర్వాత నాకు మళ్లీ అంతటి సంతృప్తిని ఇచ్చిన పాత్ర 'టైగర్ నాగేశ్వరరావు'. ఈ చిత్రాన్ని ఇంత గొప్పగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని హీరో రవితేజ అన్నారు. వంశీ కృష్ణ దర్శకత్వంలో రవితేజ హీరోగా, నూపుర్ సనన్, గాయత్రి భరద్వాజ్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న(శుక్రవారం) విడుదల అయింది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా సక్సెస్ మీట్‌లో రవితేజ మాట్లాడుతూ– ''అభిషేక్ అగర్వాల్ ఎక్కడా రాజీ పడకుండా ఈ సినిమాని తీశారు. ఆయన భవిష్యత్‌లో భారీ సినిమాలు తీసి, హిట్లు కొట్టాలి. వంశీలో మంచి ప్రతిభ ఉంది. తనతో మళ్లీ సినిమా చేయాలని ఉంది'' అన్నారు. ''నాకు ఇది పెద్ద సినిమా. రవితేజ, అభిషేక్‌గార్ల వల్లే ఇది సాధ్యపడింది. వీడు మావాడు అని చెప్పుకునేలా సినిమాలు తీస్తూనే ఉంటాను'' అన్నారు వంశీకృష్ణ. ''మా సినిమాకి ప్రేక్షకుల స్పందన, షోలు, వసూళ్లు రోజురోజుకి పెరుగుతున్నాయి'' అన్నారు అభిషేక్ అగర్వాల్. ఈ కార్యక్రమంలో నిర్మాతలు వివేక్ కూచిభొట్ల, మయాంక్ సింఘానియా తదితరులు పాల్గొన్నారు.

ఆ కిక్కే వేరు రా!

''నేను దాన్ని ఎంత ప్రేమిస్తున్నానంటే, దానికి ఫ్రెండ్స్, ఫ్యామిలీ ఎవరూ అక్కర్లేదు రా..! నేను చాలు..! ట్వంటీఫోర్ హవర్స్ పిల్ల నాతోనే ఉండాలనిపిస్తది.. నాది అని చెప్పుకోవడానికి ఓ గర్ల్ ఫ్రెండ్ ఉంటే.. ప్చ్.. ఆ కిక్కే వేరు రా..!'' అనే డైలాగ్స్‌తో కూడిన వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా మోషన్ పోస్టర్. హీరోయిన్ రష్మికా మందన్నా



● 'ది గర్ల్ ఫ్రెండ్' లో రష్మిక

ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం ఇది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించనున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్‌మెంట్ పతాకాలపై విద్య కొప్పినేని, ధీరజ్ మొగిలినేని నిర్మించనున్న 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమాను ఆదివారం అధికారికంగా ప్రకటించారు. ''ఈ ప్రపంచం ప్రేమకథలతో నిండిపోయి ఉంది. కానీ ఈ ప్రేమ కథల్లో ఇప్పటివరకు ఎవరూ వినని, చూడనవి కూడా ఉన్నాయి. 'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రం అలాంటిదే'' అని ట్వీట్ చేశారు రష్మికా మందన్నా. ''ఈ సినిమా ప్రేక్షకులకు ఓ సరికొత్త అనుభూతిని ఇస్తుంది. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వాహబ్, కెమెరా: కృష్ణన్ వసంత్.


అప్పుడే అది జరుగుతుంది – అల్లు అర్జున్



● దేవిశ్రీ ప్రసాద్, అల్లు అర్జున్

''పుష్ప' చిత్రానికి నేను, దేవిశ్రీ ప్రసాద్ జాతీయ అవార్డులు అందుకోవడం సంతోషంగా ఉంది. ఏదైనా మనం మనసులో గట్టిగా అనుకుంటే జరుగుతుందని అంటుంటారు. అయితే మనం అనుకున్నా, కష్టపడినా అది యాభై శాతం మాత్రమే జరుగుతుంది. మిగతా యాభై శాతం మన చుట్టూ ఉన్న వాళ్లు కూడా కోరుకోవాలి.. అప్పుడే అది జరుగుతుంది'' అని హీరో అల్లు అర్జున్ అన్నారు. 'పుష్ప' చిత్రానికి జాతీయ ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, ఉత్తమ సంగీత దర్శకుడుగా దేవిశ్రీ ప్రసాద్ జాతీయ అవార్డులు సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. జాతీయ అవార్డుల్లో సత్తా చాటిన తెలుగు నటీనటులను, సాంకేతిక నిపుణులను మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మాతలు నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ– ''నాకు జాతీయ అవార్డు రావాలని కోరుకునేవాణ్ణి. అయితే నా కంటే బలంగా కోరుకున్నారు దర్శకుడు సుకుమార్‌గారు. నేను అచీవ్‌మెంట్ అయితే సుకుమార్ అచీవర్'' అన్నారు. దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ–''అల్లు అర్జున్, సుకుమార్‌గార్లతో పనిచేయడం ఎంతో ఆనందంగా ఉంటుంది. మైత్రీమూవీ మేకర్స్ అంటేనే రాజీపడని నిర్మాతలు'' అన్నారు. ఈ వేడుకలో నటుడు ప్రకాష్ రాజ్‌తో పాటు పలువురు హీరోలు, దర్శకులు, నిర్మాతలు, నటీనటులు పాల్గొన్నారు.

కృష్ణారామా మా ఇంట్లో పుట్టిన కథే – దర్శకుడు రాజ్ మదిరాజు



''ప్రస్తుతం చాలా మంది తమ తల్లిదండ్రులకు దూరంగా జీవిస్తున్నారు. దీంతో ఒంటరి తనంగా భావించిన తల్లిదండ్రులు తమ మనసులోని భావాలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేసుకుంటున్నారు. మా తల్లి దండ్రులు కూడా ఒంటరితనాన్ని దూరం చేసుకోవడానికి ఫేస్ బుక్‌లోకి వచ్చారు. ఒక విధంగా '#కృష్ణారామా' కథ మా ఇంట్లో పుట్టిందే'' అని దర్శకుడు రాజ్ మదిరాజు అన్నారు. రాజేంద్ర ప్రసాద్, గౌతమి ప్రధాన పాత్రల్లో అనన్య శర్మ కీలక పాత్రలు పోషించిన చిత్రం ''#కృష్ణారామా'. అద్వితీయ మూవీస్‌పై వెంకట కిరణ్, కుమార్ కల్లకూరి, హేమ మాధురి నిర్మించిన ఈ సినిమా ఆదివారం నుంచి ఓ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు రాజ్ మదిరాజు మాట్లాడుతూ– ''మన తల్లిదండ్రులు రిటైర్ అయిపోతే వాళ్ల జీవితమే అయిపోయిందనే భావనలోకి వెళ్లిపోతున్నాం. కానీ, వారి అనుభవం సమాజానికి ఎంతో అవసరం అని మా సినిమా ద్వారా చెబుతున్నాం. ఒక డైరెక్టర్‌గా నా పనిని నేను ఇష్టపడతాను. నటుడిగా నా పరిధిలోనే ఉంటాను.. డైరెక్టర్స్‌కి సలహాలు, సూచనలు ఇవ్వను. ప్రస్తుతం డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి సినిమాలో ఓ మంచి పాత్ర చేశాను. డైరెక్టర్‌గా రెండు మూడు కథలు సిద్ధంగా ఉన్నాయి'' అన్నారు.

ఓ సవాల్‌గా తీసుకున్నా – తల్లాడ వెంకన్న



● వెంకన్న

తల్లాడ వెంకన్న హీరోగా నటించిన చిత్రం 'ఒక్కడే నెం.1'. సునీత, శృతిక, మధువని హీరోయిన్లుగా నటించారు. శ్రీపాద రామచంద్రరావు దర్శకత్వంలో క్లాసిక్ సినీ క్రియేషన్స్‌పై నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో తల్లాడ వెంకన్న మాట్లాడుతూ–''వ్యాపారవేత్తగా సక్సెస్ అయిన నేను, సినిమా రంగాన్ని కూడా ఓ సవాల్‌గా తీసుకున్నాను. మంచి కథ, కథనంతో 'ఒక్కడే నెం.1' తీశాం. సురేశ్ బాబు, ఏషియన్ ఫిలింస్ వారు తెలుగు రాష్ట్రాల్లో మా సినిమాను రిలీజ్ చేసేందుకు ఒప్పుకోవడంతో సినిమా విజయంపై మా నమ్మకం మరింత పెరిగింది. కర్ణాటకలో కూడా డైరెక్ట్ రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు. ''నేను గతంలో భక్తిరస చిత్రాలు తీశాను. వెంకన్నగారి ప్రోత్సాహం వల్లే 'ఒక్కడే నెం.1' లాంటి మంచి కమర్షియల్ సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం లభించింది'' అన్నారు దర్శకుడు శ్రీపాద రామచంద్రరావు. నిర్మాతలు సి.కల్యాణ్, దామోదర ప్రసాద్, అంబికా కృష్ణ, తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, దర్శకుల సంఘం అధ్యక్షుడు కాశీ విశ్వనాథ్, డైరెక్టర్ రేలంగి నరసింహారావు అతిథులుగా పాల్గొని, ఈ సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు.

భలే చాన్స్



● శ్రీనిధి

'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి మంచి జోరుమీద ఉన్నారు. ఇటీవల తెలుగులో సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న 'తెలుసు కదా' సినిమాలో ఓ హీరోయిన్‌గా నటించేందుకు శ్రీనిధి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ బ్యూటీ భలే చాన్స్ అందుకున్నారు. కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ సరసన నటించనున్నారు శ్రీనిధి శెట్టి. హీరో సుదీప్, దర్శకుడు చేరన్ కాంబినేషన్‌లో సత్యజ్యోతి ఫిలింస్ ఓ సినిమాను నిర్మించనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించనున్నారు శ్రీనిధి. త్వరలోనే ఈ సినిమా సెట్స్‌లో జాయిన్ కానున్నారట ఈ బ్యూటీ.

తండ్రీకొడుకుల నేపథ్యంలో...



● ధన్‌రాజ్

నటుడు ధన్‌రాజ్ దర్శకుడిగా మారారు. ఈ కొత్త చిత్రంలో తండ్రి పాత్రలో సముద్రఖని, కొడుకు పాత్రలో ధన్‌రాజ్ నటించనున్నారు. ప్రభాకర్ ఆరిపాక సమర్పణలో స్లేట్ పెన్సిల్ స్టోరీస్ బ్యానర్‌పై పొలవరపు పృథ్వి తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు సుబ్బు కెమెరా స్విచ్చాన్ చేయగా, నటుడు శివబాలాజీ క్లాప్ ఇచ్చారు. తొలి సన్నివేశానికి 'బలగం' దర్శకుడు వేణు గౌరవ దర్శకత్వం వహించగా, తెలుగు స్క్రిప్ట్‌ను దర్శకుడు రాజేంద్ర, తమిళ స్క్రిప్ట్‌ను దర్శకుడు భరత్‌కమ్మ యూనిట్ సభ్యులకు అందించారు. 'విమానం' చిత్ర దర్శకుడు శివ ప్రసాద్ యానాల ఈ మూవీకి కథ–మాటలు అందిస్తున్నారు. ''తండ్రీ కొడుకుల భావోద్వేగాల నేపథ్యంలో ఈ చిత్రం రూపొందనుంది. నవంబరు 9 నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించనున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రం ప్రారంభోత్సవంలో నటులు సుడిగాలి సుధీర్, చమ్మక్ చంద్ర, తాగుబోతు రమేష్, మధునందన్, భూపాల్, పృథ్వి, 'రాకెట్' రాఘవ తదితరులు పాల్గొన్నారు. ఈ సినిమాకు సంగీతం: అరుణ్ చిలువేరు, కెమెరా: దుర్గా ప్రసాద్.

అందరూ మెచ్చే చిత్రాలు చేస్తా – నిర్మాత సతీష్ కుమార్



''గతంలో నేను నిర్మించిన 'బట్టల రామస్వామి బయోపిక్', 'కాఫీ విత్ ఏ కిల్లర్' సినిమాలు ప్రేక్షకాదరణ పొందాయి. ప్రస్తుతం గౌతమ్ కృష్ణ హీరోగా ఓ చిత్రం నిర్మిస్తున్నాను. యువత, కుటుంబ ప్రేక్షకులతో పాటు అందరూ మెచ్చే చిత్రాలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నా'' అని నిర్మాత సెవెన్ హిల్స్ సతీష్ కుమార్ అన్నారు. గౌతమ్ కృష్ణ, శ్వేతా అవస్థి, రమ్య పసుపులేటి హీరో హీరోయిన్లుగా పి.నవీన్ కుమార్ దర్శకత్వంలో కొత్త సినిమా రూపొందుతోంది. సెవెన్ హిల్స్‌పై సతీష్ కుమార్ నిర్మిస్తున్నారు. నేడు (సోమవారం) తన పుట్టినరోజు సందర్భంగా సతీష్ కుమార్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ–''ఒక సాధారణ మధ్యతరగతి వ్యక్తి స్టూడెంట్ నుంచి కార్పొరేట్ స్థాయికి ఎలా ఎదిగాడు? అనే నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది. గౌతమ్ కృష్ణ ప్రస్తుతం బిగ్‌బాస్ తెలుగు సీజన్ 7 షోలో ఉన్నారు. ఆ షో నుంచి తిరిగి రాగానే మా సినిమా చివరి షెడ్యూల్ పూర్తి చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: త్రిలోక్ సిద్ధు, సంగీతం: జుడా శాండీ.



9 ఏళ్లు గప్‌చుప్
మరి ఇప్పుడెందుకు గడబిడ
విద్యుత్‌శాఖలో ఓ పెద్దాయన తీరుపై అధికారుల యాతన

గాసిప్ టైమ్

రాష్ట్రంలోని విద్యుత్ సంస్థలకు ఆయన మకుటం లేని మహారాజు... అన్నీ.. అంతా.. ఆయనే. ఒకప్పుడు ఐఏఎస్ అధికారులు ఏలిన ఆ పదవుల్లో గడిచిన తొమ్మిదిన్నరేళ్లుగా ఉన్నారు. ఏనాడూ ఐఏఎస్‌లకు, ఉన్నతాధికారులకు వ్యతిరేకంగా నోరు విప్పకపోగా... అధికార పార్టీ ఆలోచనలకు తగ్గట్టుగా అన్ని కార్యక్రమాలు చక్కపెడుతూ వచ్చారు. 24 గంటలపాటు విద్యుత్ సరఫరా, పరిశ్రమలకు కోతలు లేని విద్యుత్ సరఫరా చేయడంలో విజయం సాధించారు. కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లిన వేళ ఆయన ఓ బాంబ్ పేల్చారు. రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థ మెరుగుపడడం ఐఏఎస్ అధికారులకు కంటగింపుగా మారిందని, నిధులు విడుదల చేయకుండా అడ్డుకుంటున్నారంటూ ధ్వజమెత్తారు. సదరు పెద్దాయన మాటలకు ఐఏఎస్ అధికారులు ముఖ్యంగా ఆర్థిక శాఖ అధికారులు బిత్తరపోతున్నారట.

తప్పుకోవడానికే ఈ తంటాలా..
రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా.. విద్యుత్ రంగానికి బడ్జెట్‌లో కేటాయించిన విద్యుత్ సబ్సిడీని క్రమం తప్పకుండా ప్రతీనెలా విడుదల చేస్తూనే ఉండడమేకాక.. అవసరమైన మేరకు అధిక నిధులు కూడా ఇస్తున్నా ఈ తరుణంలో ఆయన ఇలాంటి వ్యాఖ్యలు ఎందుకు చేశారా అని తెగ మధనపడుతున్నారట. వయస్సు పైబడడంతో ఆ పదవి నుంచి తప్పుకునేందుకు ఆయన ఈ రూట్‌ను ఎంచుకున్నారా.? అన్న అనుమానాలను ఆ అధికారులు వ్యక్తం చేస్తున్నారట. సీఎంని కలవనీయకుండా అడ్డుకుంటున్నారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలపై ఐఏఎస్ అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారట. నిధులు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారంటూ ఆ పెద్దాయన చేసిన ఆ వ్యాఖ్యలు ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలకు రాజకీయ అస్త్రంగా మారడానికి వీలుందని అధికారపార్టీ ముఖ్యులు కూడా భావిస్తున్నారట.

పీపుల్స్ మేనిఫెస్టో!

ఉమ్మడి కరీంనగర్ జిల్లా

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 13 నియోజకవర్గాలు ఉన్నాయి. 31,12,283 లక్షల మంది ఓటర్లు ఈసారి ఎన్నికల్లో తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఈ ఓటర్ల సంఖ్య రాష్ట్రం మొత్తం ఓటర్లలో 10వ శాతం కావడం గమనార్హం. పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో కరీంనగర్.. అప్పటి హైదరాబాద్ రాష్ట్రం నుంచే తన ఘనత చాటుకుంటోంది. రాజకీయంగా ప్రభావం చేయగలిగిన ఈ జిల్లాలో కొన్ని సమస్యలు ఏళ్లుగా పరిష్కారం నోచుకోకుండా మిగిలిపోయాయి.

గోదా'వర్రీ'
పెద్దపల్లి జిల్లాలో ప్రవహించే గోదావరి నదీజలాలు కాలుష్యపు కోరల్లో చిక్కుకున్నాయి. రామగుండం కార్పొరేషన్ డ్రైనేజీ నీరు, రసాయనాలను నేరుగా నీటిలోకి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజీల నిర్మాణంతో ఏడాది పొడువునా నీరు నిల్వ ఉంటుంది. రామగుండం కార్పొరేషన్ పరిధిలో రోజుకు సుమారు 70మిలియన్ లీటర్ల నీటిని ప్రజలు వినియోగిస్తున్నారు. అందులోంచి రోజుకు 40మిలియన్ లీటర్ల మురుగు గోదావరిలో కలుస్తుంది.

ఆదాయపన్ను, మారుపేర్లు, ప్రైవేటీకరణ భూతం
రామగుండం సింగరేణిలో రెండున్నర దశాబ్దాల కాలంగా మారుపేర్ల మార్పిడికి చట్టబద్ధత కోసం కోసం కార్మికులు ఎదురుచూస్తున్నారు. గతంలో ఈ సమస్య పరిష్కారానికి సీఎం హామీ ఇచ్చినా ఇంకా అమలుకు నోచుకోలేదు. మరోవైపు తమకు ఆదాయపు పన్ను మినహాయించాలని డిమాండ్ కోరుతున్నారు. అలాగే కోల్ బ్లాకులను ప్రైవేటు పరం చేయవద్దని కార్మికులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వేడుకుంటున్నారు.

విమానం ఎగిరేనా..?
1980లో కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ అధినేత బీకే బిర్లా వచ్చేందుకు 294 ఎకరాల విస్తీర్ణంలో విమానాశ్రయం నిర్మాణం చేపట్టారు. 21 సీట్ల సామర్థ్యం ఉన్న చిన్న విమానాలు రాకపోకలు సాగించేవి. 2009లో దీన్ని రామగుండం ఎయిర్‌పోర్టు పేరిట అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు నడిచినా అవి అటకెక్కాయి. 2016లో ఉడాన్ పథకంలో భాగంగా 2020లో ఎయిర్ ఫోర్స్ అథారిటీ ఆఫ్ఇండియా రాష్ట్ర ప్రభుత్వంతో పలు భౌగోళిక సర్వేలు నిర్వహించినా అడుగు ముందుకు పడలేదు.


జగిత్యాలలో మామిడి ప్రాసెస్ యూనిట్
జగిత్యాల జిల్లా ముఖ్యంగా వ్యవసాయాధారిత జిల్లా. జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల్లో మామిడి పంట సాగు చేస్తున్నారు. దేశ విదేశాల నుంచి ఇక్కడి నుంచి మామిడి ఎగుమతి అవుతుంది. ఇక్కడ మామిడి మార్కెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని చెప్పి నాలుగు ఏళ్ల గడిచినా అది కార్యరూపం దూపుదాల్చలేదు.

నాలుగోసారి నిర్వాసితులు..
కరీంనగర్ జిల్లాలో అదనపు టీఎంసీ కాలువ పనుల్లో భాగంగా రామడుగు, గంగాధర మండలాల్లో పలువురు నిర్వాసితులు నాలుగోసారి భూమిని కోల్పోతున్నారు. ఎవరైనా ఒకసారి కోల్పోవడం సాధారణం, రెండుసార్లు కోల్పోవడమే అరుదు. కానీ, ప్రభుత్వం చేపట్టే వివిధ అభివృద్ధి పనుల వల్ల ఈ మండలాల్లో కొన్ని గ్రామాలవారు నాలుగు తరాలుగా నిర్వాసితులుగా మారిపోయారు.

ఈఎస్ఐ ఆస్పత్రి కావాలి..
ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో లక్షలాది మంది బీడీ కార్మికులు ఉన్నారు. మున్సిపల్, పలు పరిశ్రమల్లో పనిచేసేవారికి ప్రతి నెలా వేతనం నుంచి ఈఎస్ఐ కట్ అవుతుంది. కానీ, ఈఎస్ఐ ఆస్పత్రి ఉమ్మడి జిల్లాలో రామగుండంలో ఉంది. అసలు రామగుండంలో ఈఎస్ఐ ఆస్పత్రి ఉందన్న విషయం కూడా చాలామందికి తెలియదు. అత్యవసరాల్లో శస్త్రచికిత్స సమయంలో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి అప్పులపాలవుతున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఒక ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని లక్షలాది మంది కార్మికులు కోరుతున్నారు.

మీకు తెలుసా?

1983 నుంచి కేసీఆర్ అండ్ కో..



తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం ప్రస్తుత రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉంది. 1983 నుంచి కేసీఆర్ రాజకీయాల్లో ఉన్నప్పటికీ ఆయన కుటుంబం మాత్రం ప్రత్యక్ష రాజకీయాల్లోకి 2004లో ప్రవేశించింది. కేసీఆర్ మేనల్లుడు హరీశ్‌రావు 2004లో ఎమ్మెల్యేగా ఎన్నిక కాగా, కేసీఆర్ కుమారుడు కె.తారక రామారావు 2009లో ప్రవేశించారు. కేసీఆర్ కుమార్తె కవిత 2014లో నిజామాబాద్ నుంచి ఒకసారి ఎంపీగా, ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. కేసీఆర్ రెండు ఉప ఎన్నికలతో సహా ఐదుసార్లు లోక్‌సభకు, ఒక ఉప ఎన్నికతో సహా ఎనిమిదిసార్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. కేటీఆర్ ఒక ఉప ఎన్నికతో సహా నాలుగుసార్లు సిరిసిల్ల నుంచి అసెంబ్లీకి నెగ్గారు. తండ్రి కేబినెట్ లో మంత్రిగా ఉన్నారు. కేసీఆర్ మేనల్లుడు హరీశ్‌రావు మూడు ఉప ఎన్నికలతో సహా ఏడుసార్లు సిద్దిపేట నుంచి గెలుపొందారు. హరీశ్ కూడా కేసీఆర్ మంత్రివర్గంలో సభ్యుడిగా ఉన్నారు. ఇంతవరకు కేసీఆర్, ఆయన కుమారుడు కలిసి పన్నెండుసార్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు.

ఒవైసీ ఫ్యామిలీ ది గ్రేట్ @ 61 నాటౌట్



తెలంగాణలో కొన్ని రాజకీయ కుటుంబాల ప్రాధాన్యత స్పష్టంగా కనిపిస్తుంది. వాటిలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ కుటుంబం గురించి ముందుగా తెలుసుకోవాలి. అసదుద్దీన్ తండ్రి సలావుద్దీన్ ఒవైసీ 1962 నుంచి 2004 వరకు ఎమ్మెల్యే, ఎంపీ పదవులు నిర్వహిస్తే, 1994లో అసద్ రాజకీయాల్లోకి వచ్చి ఇప్పటికీ కొనసాగుతున్నారు. 1999 నుంచి అసద్ సోదరుడు అక్బరుద్దీన్ ఒవైసీ ఎమ్మెల్యేగా వరుసగా గెలుస్తున్నారు. ఆ రకంగా అరవై ఒక్క సంవత్సరాలుగా ఒవైసీ కుటుంబం రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండడం విశేషం.

ఆ కుటుంబం పదిమార్లు లోక్‌సభకు
సలావుద్దీన్ 1962 నుంచి ఐదుసార్లు శాసనసభకు, ఆరుసార్లు ఎంపీగా హైదరాబాద్ నుంచి గెలుపొందారు. అసద్ రెండుసార్లు చార్మినార్ నుంచి అసెంబ్లీకి, తదుపరి 2004 నుంచి నాలుగుసార్లు హైదరాబాద్ నుంచి ఎంపీగా గెలుపొందారు. ఇక అక్బరుద్దీన్ ఒవైసీ చాంద్రాయణగుట్ట నుంచి 1999 నుంచి వరుసగా ఐదుసార్లు గెలిచారు. 1999లో తండ్రి లోక్ సభకు, ఇద్దరు కుమారులు అసెంబ్లీకి ఎన్నికవడం ఒక ప్రత్యేకత. సలావుద్దీన్, అసద్ కలిసి ఇంతవరకు పదిసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారన్నమాట. తండ్రి, ఇద్దరు కుమారులు కలిసి పన్నెండుసార్లు అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించారు.




తండ్రి రాజ్యసభలో.. తనయుడు లోక్‌సభలో..

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, ఆయన తండ్రి, సీనియర్ నేత ధర్మపురి శ్రీనివాస్ ఒకే సమయంలో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులుగా పార్లమెంటులో ఉన్నారు. ధర్మపురి శ్రీనివాస్ 2016 జూలై నుంచి 2022 జూలై వరకు ఆరేళ్ల పాటు రాజ్యసభ సభ్యునిగా వ్యవహరించారు. ఆయన కుమారుడైన అర్వింద్ 2019 మే నెలలో బీజేపీ తరఫున నిజామాబాద్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. దీంతో ఒకే సమయంలో వారిద్దరూ పార్లమెంట్‌లో ఉన్నట్టయ్యింది.



మూడో వంతు స్థానాల్లో.. ముస్లింలే కీలకం

హైదరాబాద్ పాతబస్తీ సహా 40 వరకు నియోజకవర్గాల్లో వీరి ప్రభావం

- పార్టీల గెలుపోటములు ప్రభావితం చేసే అవకాశం
- ఈ వర్గం ఓటర్లను ఆకర్షించేందుకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రయత్నాలు

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్:

రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ సెగ్మెంట్లకుగాను మూడింట ఒక వంతు స్థానాల్లో ముస్లింల ఓట్లే కీలకం కానున్నాయి. ఈ ఓటర్లు ఎవరి వైపు మొగ్గు చూపితే.. వారి గెలుపు కాస్త సులభతరం అయ్యే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలో దాదాపు 14% వరకు ముస్లింల జనాభా ఉండగా 40 వరకు నియోజకవర్గాల్లో వీరి ప్రభావం ఉంటుందని అంచనా వేస్తున్నారు. అంటే వీరి మద్దతు పొందిన పార్టీ గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉంటాయనే విషయం స్పష్టమవుతోంది. ఈ కారణంగానే పోటీలో ఉన్న ప్రధాన పార్టీలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వారిని తమ వైపు ఆకర్షించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే ఈసారి ముస్లింలు ఎవరికి మద్దతు పలికే అవకాశం ఉందనేది ఆసక్తికరంగా మారింది.

తొలుత కాంగ్రెస్‌తో, తర్వాత బీఆర్‌ఎస్‌తో..




తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత మెజారిటీ వర్గం ప్రధానంగా తెలంగాణ రాష్ట్ర సమితి (ప్రస్తుతం బీఆర్‌ఎస్)కే మద్దతు ఇస్తూ వచ్చింది. అంతకుముందు వీరు కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకుగా ఉన్న సంగతి తెలిసిందే. 2004లో ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన ఎన్నికల సమయంలో డాక్టర్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు బీసీ రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇవ్వడమేకాక.. ఆ వాగ్దానాన్ని నెరవేరుస్తూ ఆయన అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగు శాతం రిజర్వేషన్లు కలిప్ంచారు. తర్వాత 2014 ఎన్నికల నుంచి బీఆర్‌ఎస్‌కు ముస్లింలు మద్దతుగా నిలిచారు. ఎంఐఎం) పూర్తిస్థాయి సహకారం ఈ పార్టీకి లభిస్తూ వస్తోంది. ఈసారి కూడా ఎంఐఎం పార్టీ పోటీ చేస్తున్న స్థానాల్లో మినహా మిగతా చోట్ల పార్టీ కార్యకర్తలతో పాటు యావత్ ముస్లింలు బీఆర్‌ఎస్‌కు మద్దతివ్వాలంటూ ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ఒక ప్రకటనలో బహిరంగంగానే విజ్ఞప్తి చేశారు. కానీ ఈసారి పరిస్థితిలో కాస్త మార్పు వచ్చే అవకాశం ఉందని, ఆ పార్టీ వర్గాల్లోనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గంపగుత్తగా ఓట్లు పడే అవకాశం లేదంటూ.. కర్ణాటక ఎన్నికల్లో అక్కడి ముస్లింలు జేడీఎస్‌ను కాంగ్రెస్‌కు బాసటగా నిలవడాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఇక్కడ కూడా ఆ విధమైన వాతావరణం ఏర్పడే చాన్స్‌ను తోసిపుచ్చలేమని అంటున్నారు.



రాజధాని నియోజకవర్గాలతో పాటు..: హైదరాబాద్ నగర పరిధిలోని యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, చార్మినార్, మలక్‌పేట, బహదూర్‌పురా, నాంపల్లి, కార్వాన్, ఖైరతాబాద్, సనత్‌నగర్, జూబ్లీహిల్స్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో ముస్లిం ఓట్లు అధికంగా ఉన్నారు. అదే విధంగా ఉమ్మడి మెదక్ జిల్లాలోని సంగారెడ్డి, జహీరాబాద్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిజామాబాద్ అర్బన్, బోధన్, కామారెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, ముధోల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్ ఈస్ట్, వరంగల్ వెస్ట్, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, ఉమ్మడి రంగారెడ్డిలోని తాండూరు, మల్కాజిగిరి, మహేశ్వరం, వికారాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్లలో ముస్లిం ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కాగా వీరి మద్దతుతో ముఖ్యంగా హైదరాబాద్ పాతబస్తీయేతర నియోజకవర్గాల్లో పాగా వేయాలని అధికార బీఆర్‌ఎస్, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నాయి.

ఆ మూడూ ఒక్కటే అంటూ కాంగ్రెస్...: కర్ణాటకలో గెలుపుతో ఉత్సాహంగా ఉన్న కాంగ్రెస్ ఈసారి ఎలాగైనా మైనారిటీలను తమ వైపు తిప్పుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే బీజేపీకి బీఆర్‌ఎస్ బీ టీంగా వ్యవహరిస్తోందని, బీజేపీతో రహస్య ఒప్పందం కుదుర్చుకుందని ఆరోపిస్తూ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. మైనారిటీలకు రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనంటూ గుర్తు చేస్తోంది. ముందు నుంచి మైనారిటీలపై కాంగ్రెస్‌ది సానుకూల దృక్పథమేనని చెబుతోంది. బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీలు మూడూ ఒక్కటేనని, అంతర్గత అవగాహనతో పనిచేస్తున్నాయనే ప్రచారాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. ఇతర రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న ఇతర రాష్ట్రాలలోని సీట్లలో ఎంఐఎం పోటీ చేస్తూ బీజేపీకి సహకరిస్తోందని ఆరోపిస్తోంది. మైనారిటీల సంక్షేమానికి భవిష్యత్తులో కూడా కట్టుబడి ఉంటామని గట్టిగా హామీ ఇస్తోంది.

సంక్షేమ పథకాలే ఆలంబనగా బీఆర్‌ఎస్..: మైనారిటీలను ఆకట్టుకోవడానికి బీఆర్‌ఎస్ గడచిన తొమ్మిదిన్నరేళ్లుగా ఆ వర్గానికి అందించిన సంక్షేమ పథకాలపైనే భరోసా పెట్టుకుంది. ఈసారి కూడా ముస్లింలు తమకే మద్దతు పలుకుతారనే ధీమాతో ఉంది. అదే సమయంలో వారు తమ చేజారే అవకాశం లేకుండా.. తాము బీజేపీతో ఎట్టిపరిస్థితుల్లోనూ కలిసే అవకాశం లేదంటూ స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్, బీజేపీ పార్టీలే పరస్పరం సహకరించుకుంటున్నారంటూ ప్రతి విమర్శలు చేస్తోంది. మరోవైపు మైనారిటీలకు రాజకీయంగా అవకాశాలు కల్పించడమేకాకుండా..మంత్రివర్గంలో కీలకమైన పదవిని ఆ వర్గానికి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తోంది. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మత సామరస్యం కొనసాగుతుండటాన్ని, కర్ఫ్యూల్లాంటివి లేకుండా ప్రజలు ప్రశాంతంగా జీవిస్తుండటాన్ని కూడా ప్రధానంగా ప్రస్తావిస్తోంది. ఇటీవలి బహిరంగ సభల్లో సీఎం కేసీఆర్..వినాయక నిమజ్జన సమయంలో ముస్లింలు పెద్ద మనస్సు చేసుకుని మిలాద్ ఉన్ నబీ ఊరేగింపును వాయిదా వేసుకున్నారంటూ పదే పదే గుర్తు చేయడం ద్వారా ఆ వర్గానికి మరింత చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతుండటం కూడా గమనార్హం.



మళ్లీ అధికారం బీఆర్‌ఎస్‌కే..!

సాక్షి, హైదరాబాద్, పంజగుట్ట: తెలంగాణలో మరోసారి బీఆర్‌ఎస్ పూర్తిస్థాయి మెజార్టీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని మిషన్ చాణక్య సంస్థ సర్వే పేర్కొంది. రైతులతోపాటు మహిళలు, మైనారిటీలు ఆ పార్టీవైపే మొగ్గు చూపుతున్నారని తెలిపింది. కాంగ్రెస్ పార్టీ ఓట్లశాతం పెరిగినా సీట్లు పెద్దగా పెరగవని తేలిందని పేర్కొంది. ఈ మేరకు మిషన్ చాణక్య వ్యవస్థాపక చైర్మన్ అముక శివకేశవ్ ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో వివరాలు వెల్లడించారు. మిషన్ చాణక్యకు చెందిన 6,500 మంది ఉద్యోగులు 110 నియోజకవర్గాల పరిధిలో 14 లక్షల మంది నుంచి రహస్యంగా ప్రజాభిప్రాయాన్ని సేకరించినట్టు తెలిపారు. సర్వేలో పేర్కొన్న ముఖ్యాంశాలివీ..



శివకేశవ్

- బీఆర్‌ఎస్ 44.62 శాతం ఓట్లతో 76 అసెంబ్లీ స్థానాలు గెలుచుకుంటుందని.. కాంగ్రెస్‌కు 32.71 శాతం ఓట్లతో 25 సీట్లకు అటూఇటూగా వస్తాయని సర్వే పేర్కొంది. ఇక బీజేపీ 17.6 శాతం ఓట్లతో 9 స్థానాల వరకు గెలుచుకుంటుంది.
- బీసీలలో 45.97 శాతం మంది బీఆర్‌ఎస్‌కే మద్దతు చూపారు. అదే కాంగ్రెస్‌కు 26.70 శాతం, బీజేపీకి 24.60శాతం మొగ్గు చూపారు.
- ఓసీల్లో బీఆర్‌ఎస్‌కు 41.20 శాతం మంది మొగ్గు చూపగా.. కాంగ్రెస్‌కు 29.62శాతం, బీజేపీకి 24.89 శాతం జైకొట్టారు.
- ఎస్సీల్లో 43.17 శాతం మంది బీఆర్‌ఎస్‌వైపే ఉండగా.. కాంగ్రెస్‌కు 33.67 శాతం, బీజేపీకి 16.60 శాతం మద్దతిచ్చారు.
- ఎస్టీల్లో 44.45శాతం బీఆర్‌ఎస్‌కు, 37.16 శాతం కాంగ్రెస్‌కు, 16.41 శాతం బీజేపీకి సానుకూలంగా ఉన్నారు.
- మైనారిటీలకు వస్తే.. గులాబీ పార్టీకి 48.31 శాతం, కాంగ్రెస్ పార్టీకి 36.41 శాతం, బీజేపీకి 5.52 శాతం మద్దతు వస్తోంది.
- పురుషుల్లో 38.91 శాతం మంది బీఆర్‌ఎస్‌కు, 33.76శాతం కాంగ్రెస్‌కు, 20.14 శాతం బీజేపీకి మద్దతు పలుకుతున్నారు.
- మహిళల్లో బీఆర్‌ఎస్‌కు 50.32 శాతం, కాంగ్రెస్‌కు 31.65శాతం, బీజేపీకి 15.05 శాతం మొగ్గు కనిపిస్తోంది.
- హైదరాబాద్ నగరం పరిధిలో మాత్రం బీజేపీ బలంగా ఉందని సర్వే పేర్కొంది. జీహెచ్ఎంసీ పరిధిలో ఆ పార్టీకి 38.21శాతం మంది ఓటర్లు మొగ్గుచూపగా.. బీఆర్‌ఎస్‌కు 37.13శాతం మద్దతు వచ్చినట్టు తెలిపింది.



'ఓట్ ఫర్ పవర్'
పరకాల: హనుమకొండ జిల్లా పరకాల పట్టణానికి చెందిన యెల్లంకి శోభారాణి కుటుంబ సభ్యులు 'ఓట్ ఫర్ పవర్' అంటూ భారీ బతుకమ్మను పేర్చారు. తోపుడు బండిపై బతుకమ్మను స్థానిక పశువుల సంత ప్రాంగణానికి తరలించి బతుకమ్మ ఆడారు.

రిజర్వుడ్‌లో ఖమ్మం టాప్



సాక్షి, ఖమ్మం డెస్క్: తెలంగాణలో 119 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో 31 రిజర్వుడ్ నియోజకవర్గాలు. వీటిల్లో 19 ఎస్సీ, 12 ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గాలు ఉన్నాయి. 2009లో చేపట్టిన డీలిమిటేషన్ సందర్భంలో జనాభా ఆధారంగా వీటిని ఖరారు చేశారు. రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల వారీగా చూస్తే ఎక్కువగా రిజర్వుడ్ నియోజకవర్గాలు ఖమ్మంలోనే ఉన్నాయి. ఇక్కడ పది స్థానాలకు గాను ఏడు రిజర్వుడ్ స్థానాలే. ఇందులో ఐదు ఎస్టీ, రెండు ఎస్సీ నియోజకవర్గాలు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాల వారీగా పరిశీలిస్తే.... కరీంనగర్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్, హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో ఒక ఎస్టీ రిజర్వ్ నియోజకవర్గం కూడా లేదు.


రాష్ట్రంలో 31 రిజర్వుడ్ నియోజకవర్గాలు
అత్యధికంగా ఉమ్మడి ఖమ్మంలోనే ఏడు.. హైదరాబాద్, నిజామాబాద్‌లో ఒక్కొక్కటే...

ఎస్టీ అసెంబ్లీ సెగ్మెంట్‌లు
- ఉమ్మడి ఖమ్మం : పినపాక, ఇల్లెందు, అశ్వారావుపేట, భద్రాచలం, వైరా
- ఉమ్మడి ఆదిలాబాద్ : ఆసిఫాబాద్, బోథ్, ఖానాపూర్
- ఉమ్మడి వరంగల్ : డోర్నకల్, మహబూబాబాద్, ములుగు
- ఉమ్మడి నల్లగొండ : దేవరకొండ

ఎస్సీ అసెంబ్లీ సెగ్మెంట్‌లు
- ఉమ్మడి కరీంనగర్ : ధర్మపురి, చొప్పదండి, మానకొండూరు
- ఉమ్మడి ఖమ్మం : మధిర, సత్తుపల్లి
- ఉమ్మడి మహబూబ్‌నగర్ : అచ్చంపేట, అలంపూర్
- ఉమ్మడి ఆదిలాబాద్ : చెన్నూరు, బెల్లంపల్లి
- ఉమ్మడి నల్లగొండ : నకిరేకల్, తుంగతుర్తి
- ఉమ్మడి వరంగల్ : స్టేషన్‌ఘన్‌పూర్, వర్ధన్నపేట
- ఉమ్మడి రంగారెడ్డి : చేవెళ్ల, వికారాబాద్
- ఉమ్మడి మెదక్ : జహీరాబాద్, అందోల్
- హైదరాబాద్ : కంటోన్మెంట్
- ఉమ్మడి నిజామాబాద్ : జుక్కల్

గడ్డం రాజిరెడ్డి

తెలంగాణ తొలి, మలి దశల ఉద్యమాలకు చిరునామాగా ఉన్న పోరాటాల ఖిల్లా, ఉద్యమాల జిల్లా ఉమ్మడి వరంగల్‌లో 2023 ఎన్నికల సమరంలో తమ సర్వశక్తులొడ్డేందుకు రాజకీయ పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. 2018 ఎన్నికల్లో 12 నియోజకవర్గాలకు గానూ 10 స్థానాలను బీఆర్‌ఎస్ గెలుచుకుంది. భూపాలపల్లి, ములుగు నుంచి కాంగ్రెస్ అభ్యర్థులుగా గండ్ర వెంకటరమణారెడ్డి, ధనసరి సీతక్క (అనసూయ) విజయం సాధించారు. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో గండ్ర వెంకటరమణారెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరగా.. ఆ పార్టీ ఎమ్మెల్యేల సంఖ్య ఉమ్మడి జిల్లాలో 11కు చేరింది. ఇక వచ్చే నెలలో జరిగే ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే బీఆర్‌ఎస్ 12 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించగా.. కాంగ్రెస్ పార్టీ ములుగు, స్టేషన్‌ఘన్‌పూర్, నర్సంపేట, భూపాలపల్లిలకు అభ్యర్థులను ఖరారు చేసింది. బీజేపీ 9చోట్ల అభ్యర్థులను ప్రకటించింది.



పోరుగల్లు.. పోటాపోటీ

పట్టు నిలుపుకునేందుకు బీఆర్‌ఎస్
పాగా వేసేందుకు కాంగ్రెస్

అభ్యర్థుల ఎంపిక నుంచే వ్యూహాత్మకం...

రాజకీయ పార్టీలు ఈసారి అభ్యర్థుల ఎంపిక నుంచే వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. బీఆర్‌ఎస్ తొమ్మిది చోట్ల సిట్టింగ్‌లకే అవకాశం ఇచ్చినా.. స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ నియోజకవర్గాల్లో డా.టి.రాజయ్య, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిలను మార్చింది. రైతుబంధు సమితి చైర్మన్‌గా రాజయ్యకు, ఆర్టీసీ చైర్మన్‌గా యాదగిరిరెడ్డిని నియమించి.. ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డిలకు ఆ రెండు చోట్ల ఎమ్మెల్యే అభ్యర్థులుగా అవకాశం కల్పించింది. ములుగు జెడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతికి తొలిసారిగా ములుగు నుంచి చాన్స్ ఇచ్చారు. అయితే నామినేటెడ్ పదవులు ఇచ్చినా.. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్‌లలో అభ్యర్థుల గెలుపునకు చేసే కృషిని బట్టి ఫలితాలు ఉంటాయన్న చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ ములుగు, స్టేషన్‌ఘన్‌పూర్, నర్సంపేటలలో పాతవారికే (సీతక్క, సింగాపురం ఇందిర, దొంతి మాధవరెడ్డి)లకే అవకాశం ఇచ్చి భూపాలపల్లికి గండ్ర సత్యనారాయణరావును ప్రకటించింది. మరో ఎనిమిది స్థానాలకు ఐదు చోట్ల ఖరారు కాగా, మూడింట్లో పోటాపోటీగా ఉంది. ఆ ఐదు చోట్ల కూడా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఇక బీజేపీ ఉమ్మడి జిల్లాలో ములుగు, నర్సంపేట, పరకాల మినహా మిగతా చోట్ల అభ్యర్థులను ఖరారు చేసింది.

ఆ రెండింటి మధ్యే పోరు...
ఏఐఎఫ్‌బీ, బీఎస్పీ వైపు అసంతృప్తులు..

మొత్తం 12 స్థానాలకు రెండు ఎస్సీలకు, మూడు ఎస్టీలకు రిజర్వు కాగా.. ఏడు జనరల్ స్థానాలు ఉమ్మడి వరంగల్‌లో ఉండగా... ఈసారి జరిగే ఎన్నికల్లో సామాజిక కోణాలు ప్రభావం చూపనున్నాయి. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు సైతం ఆచితూచి పావులు కదుపుతున్నాయి. కాగా ఇప్పటికే బీఆర్‌ఎస్ తరఫున సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు ప్రచారసభలు నిర్వహించగా.. కాంగ్రెస్ తరఫున ఈ నెల 18, 19 తేదీల్లో ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలు బస్సుయాత్రను రామప్ప వేదికగా ప్రారంభించి ప్రచారం నిర్వహించారు. రెండు రోజులపాటు ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో ప్రచారం నిర్వహించారు. చాలా నియోజకవర్గాల్లో పోటీ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్యనే ఉంటుందన్న చర్చ జరుగుతోంది. ఇదిలా ఉంటే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ వారంతా కూడా ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ), బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) వైపు చూస్తున్నారు.

ఓటర్లను 'ఉచిత'రీతినే గౌరవించుకుందాం

విదేశాలవాళ్లందరూ ఫ్రీ వల్చర్స్, మనదంతా ఫైన్ అండ్ రిఫైన్డ్ కల్చర్ అని గొప్పలు పోతుంటాం గానీ... నిజానికి మనదే నిజమైన 'ఫ్రీ' సంస్కృతి. ఇది వినగానే ఫెడేల్మంటూ గుండెలవీ బాదుకోనక్కర్లేదు. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల్ని హాయిగా అనుభవించే ఫ్రీడమ్ కాదిది. 'ఫ్రీగా వస్తే ఫినాయిలైనా' అనే అద్భుత సంస్కృతి మనది.



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

ఎన్నికలన్నప్పుడల్లా 'అయ్యో... పింఛన్లంటూ, ఫ్రీలంటూ ఎడాపెడా పంచేస్తున్నారూ, దేశాన్ని వంచిస్తున్నారం'టూ శోకాలు పెడుతుంటారుగానీ అది సరి కాదు. ఉచితమనేది మన సంస్కృతిలో భాగమెలాగో గుర్తెరిగి... ఉచితరీతిన నడవాలి.

మాంచి హోటలుకెళ్లి డాబుగా బిర్యానీ ఏదో ఆర్డరిస్తామా! వాడిచ్చిన 'నీంబూ, ప్యాజ్' కాకుండా సిగ్గుపడకుండా ఎగస్ట్రా 'ఫ్రీ'లడిగి మళ్లీ మళ్లీ తీసుకుంటుంటాం.

అంతెందుకు... మొన్నెప్పుడో పంజాగుట్టలోని ఓ హోటల్లో ఫ్రీ రైతా (పెరుగు) అడిగినందుకు పంజా విసిరారు కొందరు బేరర్స్. బహుశా... ఉచితాలవీ ఇచ్చేసి ప్రజల్ని సోమరుల్ని చేయడం నచ్చని నికార్సైన కష్టజీవుల బ్యాచీ తాలూకు క్యాపిటలిస్టిక్, కార్పొరేటిక్, కన్సర్వేటిక్ (ఫ్లాగ్)'బేరర్స్' కాబోలు వాళ్లంతా.

పాపం... అమాయకుడైన ఆ వినియోగదారుడు చచ్చిపోయి, 'ఫ్రీ'ల కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుల లిస్టులోకి చేరిపోయాడు. నిజానికి అందరి సానుభూతికీ ఎంతో అర్హుడతడు. ఎందుకంటే... హోటల్‌వాడు ఎంత ఫ్రీగా ఇచ్చినా, లెక్కలుగట్టి చూస్తే... మొత్తం ఆ ఫ్రీ ఉల్లిముక్కలూ, నిమ్మచెక్కలూ, రైతా విలువ సదరు కస్టమరిచ్చే టిప్పు–డబ్బు కంటే చాలా చాలా తక్కువ.

అదే లెక్క సోంపుకీ వర్తిస్తుంది. ఎంతగా 'ఫిల్దీ రిచ్చు' ఆసామైనా, ఎంతగా డబ్బున్న మొనగాడైనా... ఆ ఫ్రీ సోంపును ఆబగా, ఆత్రంగా తినే వాళ్లే అందరూ! కొందరైతే కక్కుర్తిగా కర్చీఫ్‌లోనో, టిష్యూలోనో పొట్లం కట్టుకుపోతారు.

మోజంజాహీ మార్కెట్టయినా, మోండా మార్కెట్టయినా, చింతలబస్తీ, చిక్కల్‌గూడా, చింతల్‌కుంటా మరెక్కడైనా... టమాటాలూ, పచ్చిమిరపకాయా, ఉల్లిగడ్డలూ, కూరగాయలూ కొన్నాక, కొసరడగని ఇల్లాలంటూ ఉంటుందా? ఫ్రీగా వస్తే సంతోషించని గృహిణులెవరైనా ఉంటారా?

కేవలం మన నేటివ్సే కాదు, ఇక్కడే ఓటేసే ఉత్తర భారతీయులు సైతం 'తర్‌కారీ కే సాథ్... ఫ్రీ ధనియా భీ' అంటూ కూరగాయల్తో పాటూ కొసరి కొసరి కొత్తిమీర అడిగి మరీ తీసుకుంటుంటారు. అడక్కపోయినా వాళ్లయినా ఇచ్చిపోతుంటారు.

ఇన్ని ఉదాహరణల తర్వాత చెప్పేదొక్కటే... 'ఫ్రీ' కాన్సెప్టు ఇంతగా రక్తంలోకి ఇంకిపోయాక, 'ఉచితాలం'టూ లేకుండా ఓటేద్దామా? ఓటేస్తామా?

చివరగా ఒక్కమాట... సాక్షాత్తూ దేశ పాలకుల సొంత రాష్ట్రానికి చెందిన 'సంజయ్ ఎరూవా' అనే సామాజిక కార్యకర్తగారు... ఓ 'ఆర్టీఐ' అభ్యర్థన ద్వారా ఆర్‌బీఐని అడిగినప్పుడు వచ్చిన సమాధానం ప్రకారం... ఏలినవారి ఎన్డీయే ప్రభుత్వం కార్పొరేట్లకు 'రైటాఫ్' చేసిన మొత్తం రూ. 25 లక్షల కోట్లు! బ్యాంకు సొమ్ములెగ్గొట్టేసి సొగ్గా పారిపోయినవారి సొమ్ములకివి అదనం. కార్పొరేట్ ఇన్‌సెంటివ్‌లనీ ఇతర ప్రోత్సాహకాలనేవి మరో ఎక్స్‌ట్రా. ఇవన్నీ కలుపుకుంటే సంక్షేమానికి ఇచ్చేది... ఆస్ట్రిచ్‌గుడ్డు పక్కన ఆవగుండంత!

ఇద్దరూ కరీంనగర్ బిడ్డలే

సాక్షి, కరీంనగర్ డెస్క్: రాజకీయ ఉద్దండులు పీవీ నరసింహారావు, చెన్నమనేని విద్యాసాగర్‌రావు కరీంనగర్ జిల్లా నుంచే రాజకీయ ఓనమాలు నేర్చుకున్నారు. ఈ ప్రాంతంలోనే పుట్టి, ఇక్కడి నుంచే ఎమ్మెల్యేలుగా ప్రస్థానాన్ని ప్రారంభించారు. అంచెలంచెలుగా ఎదిగి ఒకరు ముఖ్యమంత్రి, ఆ తర్వాత ఏకంగా దేశానికే ప్రధానమంత్రి అయ్యారు. మరొకరు గవర్నర్‌గా పనిచేశారు.

మంథని నుంచి పీవీ..

పాత కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని వంగరకు చెందిన పీవీ నరసింహారావు మంథని నియోజకవర్గం నుంచి తన రాజకీయ అడుగులు వేశారు. 1957లో మొదటిసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. తర్వాత 1962, 67, 72లో వరుసగా విజయం సాధించారు. ఎమ్మెల్యేగా రెండోసారి గెలిచిన తర్వాత పీవీకి మంత్రిగా అవకాశం వచ్చింది. తొమ్మిది సంవత్సరాల పాటు ఆయన న్యాయ, సమాచార, వైద్య, దేవాదాయ శాఖల మంత్రిగా పనిచేశారు. 1971లో జరిగిన పరిణామాలతో పీవీని కాంగ్రెస్ అధిష్టానం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నియమించింది. రెండు సంవత్సరాల పాటు ఆ పదవిలో కొనసాగిన ఆయన తర్వాత రాష్ట్ర రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు. 1977లో హనుమకొండ లోక్‌సభస్థానం నుంచి పోటీ చేసి కేంద్ర రాజకీయాల్లో అడుగుపెట్టారు. 1980లో జరిగిన ఎన్నికల్లో మరోసారి ఇదే నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొందారు. ఆ తర్వాత 1984, 89 సంవత్సరాల్లో మహారాష్ట్రలోని రాంటెక్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. కేంద్ర కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. 1991లో అనూహ్యంగా అత్యున్నతమైన ప్రధానమంత్రి పదవి వరించింది. పీఎం పదవి చేపట్టిన తొలి తెలుగు వ్యక్తిగా, దక్షిణ భారతీయుడిగా చరిత్రలో నిలిచిపోయారు.


పీవీ నరసింహారావు విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి నుంచి విద్యాసాగర్‌రావు..

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని నాగారం గ్రామానికి చెందిన చెన్నమనేని విద్యాసాగర్‌రావు ఏబీవీపీలో చురుకుగా పనిచేశారు. 1983లో కరీంనగర్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 1985లో మెట్‌పల్లి నుంచి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకిదిగి విజయం సాధించారు. 1989, 1994 సంవత్సరాల్లో వరుసగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. 1998లో లోక్‌సభకు జరిగిన మధ్యంతర ఎన్నికల్లో కరీంనగర్ నుంచి ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత ఏడాది జరిగిన ఎన్నికల్లోనూ మరోమారు గెలుపొందారు. ఆ సమయంలో వాజ్‌పేయి ప్రభుత్వంలో హోం, వాణిజ్య, పరిశ్రమలశాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2014లో మహారాష్ట్ర గవర్నర్‌గా కేంద్రం నియమించింది.

నది లేనిచోట వంతెన నిర్మిస్తారట!

- సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ తప్పుడు హామీలిస్తున్నారు
- మధ్యప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు కమల్‌నాథ్ ఆగ్రహం

భోపాల్: మధ్యప్రదేశ్‌లో ఓటర్లను మభ్యపెట్టడానికి ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు శివరాజ్‌సింగ్ చౌహాన్ తప్పుడు హామీలు ఇస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ సీఎం కమల్‌నాథ్ ఆరోపించారు. ఇప్పటికే 22,000కుపైగా హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. నది లేని చోట వంతెన నిర్మిస్తామని చెబుతున్నారని, ఇదెక్కడి చోద్యమని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీజేపీకి బుద్ధి చెప్పాలని, కాంగ్రెస్‌ను గెలిపించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. ఆదివారం గోపాల్‌గంజ్‌లో ఎన్నికల ప్రచార సభలో కమల్‌నాథ్ ప్రసంగించారు. రాష్ట్రంలో బీజేపీ పాలనలో అవినీతి, నిరుద్యోగం పెరిగిపోయాయని ఆరోపించారు. ధరల పెరుగుదల వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని చెప్పారు. శివరాజ్‌సింగ్ చౌహాన్ హయాంలో ప్రతి పనిలో '50 పర్సెంట్ కమిషన్' దందా విచ్చలవిడిగా సాగుతోందని కమల్‌నాథ్ మండిపడ్డారు.

ఎన్డీఏను ఓడించేది పీడీఏనే

సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ • ప్రతిపక్ష 'ఇండియా'కూటమి పేరెత్తకుండా వ్యాఖ్యలు • కాంగ్రెస్‌తో విభేదాల నేపథ్యంలో తాజా పరిణామం




న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ తమకు ఒక్క సీటూ కేటాయించకపోవడంపై గుర్రుగా ఉన్న సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ తాజాగా 'పీడీఏ'బాంబు పేల్చారు. ఆదివారం ఆయన 'ఎక్స్'లో ఇందుకు సంబంధించి చేసిన పలు వ్యాఖ్యలు ఇండియా కూటమి ఐక్యతపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. 'వచ్చే ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏను పీడీఏ ఓడిస్తుంది. ఆ ఎన్నికల్లో పీడీఏ విప్లవం తెస్తుంది' అని అందులో పేర్కొన్నారు. పీడీఏ అంటే పిఛ్డే(వెనుకబడిన కులాలు), దళితులు, మైనారిటీలని వివరించారు. 2024 ఎన్నికల్లో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీఏను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ సారథ్యంలో ప్రతిపక్షాలతో ఏర్పాటైన 'ఇండియా'కూటమిలో సమాజ్‌వాదీ పార్టీ కీలక భాగస్వామి. నవంబర్ 17న మధ్యప్రదేశ్ అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలకు గాను 18 నియోజకవర్గాల్లో ఎస్పీ అభ్యర్థులను నిలిపింది. తమకు ఆ సీట్లను కేటాయించాలంటూ కాంగ్రెస్ పార్టీని కోరింది. కాంగ్రెస్ ఎస్పీ వినతిని పట్టించుకోలేదు. ఆయా స్థానాలకు సైతం అభ్యర్థులను ప్రకటించింది. ఈ పరిణామం రుచించని ఎస్పీ చీఫ్ అఖిలేశ్ కాంగ్రెస్‌పై పలు విమర్శలు చేశారు. కాంగ్రెస్ నేతలు కూడా ఎదురు దాడికి దిగారు. 'కాంగ్రెస్ ఇతర పార్టీలను ఫూల్ చేస్తోంది. రాష్ట్ర స్థాయిలో పొత్తులు పని చేయవని తెలిసుంటే, ఇండియా కూటమిలో చేరి ఉండేవాళ్లం కాదు. కాంగ్రెస్‌తో మాట్లాడేవాళ్లమే కాదు'అని గురువారం పేర్కొన్నారు. కాంగ్రెస్ తీరు ఇలాగే కొనసాగితే, ఆ పార్టీతో కలిసుండే దెవరని ప్రశ్నించారు. తమతో పొత్తు కొనసాగిస్తారా లేదా కాంగ్రెస్ తేల్చాలని పట్టుబట్టారు. ఇండియా కూటమి లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా కేంద్ర స్థాయిలో ఏర్పాటైందంటూ కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు. మూడు రోజులుగా వారి మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు కొనసాగుతున్న వేళ..ఆదివారం తాజాగా అఖిలేశ్ 'పీడీఏ'అస్త్రం బయటకు తీశారు. 2024 ఎన్నికల్లో పీడీఏ విప్లవం సృష్టించనుందని పేర్కొన్నారు. అందులో ఇండియా కూటమి గురించి అందులో ఎక్కడా ప్రస్తావించకపోవడం గమనార్హం.

'మాపై కుట్రలు, ద్రోహం చేయవద్దు. సమాజ్‌వాదీలు అవసరం లేదని వారు మాకు సూటిగా చెప్పాలి. పొత్తుపై ఒక్కసారి కూడా మాట్లాడబోమని, బీజేపీని ఓడించడానికి సొంతంగా మా ప్రయత్నాల్లో ఉంటామని'అన్నారు. గతంలో కులగణన అంటే మండిపడిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు దానిని కోరుకోవడం విడ్డూరంగా ఉందని అఖిలేశ్ వ్యాఖ్యానించారు. గతంలో చేపట్టిన కులగణన వివరాలను ఆ పార్టీ వెల్లడించనేలేదు. బీసీల మద్దతు లేకుండా గెలుపు సాధ్యం కాదని ఇప్పుడు అందరూ గ్రహించారు. బీసీలు తమతో లేరని కాంగ్రెస్ తెలుసుకుంది కాబట్టే, ఇప్పుడు కులగణన హామీలిస్తోందని వివరించారు.

రైతులే కీలకం

అన్నదాతల కోసం ఎన్నో పథకాలు తెచ్చాం

అసెంబ్లీ ఎన్నికల్లో 75పైగా సీట్లు ఖాయం	పీటీఐ ప్రత్యేక ఇంటర్వ్యూలో ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బఘేల్



రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి త్వరలో జరిగే ఎన్నికల్లో రైతులదే నిర్ణాయక పాత్ర అని సీఎం భూపేశ్ బఘేల్ చెప్పారు. రైతుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ఎన్నో పథకాలు తీసుకువచ్చిందని, వారి మద్దతుతో అసెంబ్లీలోని 90 సీట్లకు గాను 75కు పైగా స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. సీఎం బఘేల్ తాజాగా పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. మహిళలు, యువత, వ్యాపారులు కూడా తమ పార్టీ వెంటే ఉన్నారని ఆయన చెప్పారు. 'మేం ప్రవేశపెట్టిన పథకాలతో రైతులు, యువ లబ్ధిదారులు ఆర్థికంగా బలపడ్డారు. ఈ డబ్బు మార్కెట్‌లోకి చేరడంతో వ్యాపారులు సంతోషంగా ఉన్నారు. రైతులకు, తునికాకు సేకరణదారులకు ఇచ్చిన హామీలను గత అయిదేళ్లలో అమలు చేశాం. విద్య, ఆరోగ్యం, మౌలిక రంగాల కోసం ఎంతో ఖర్చు చేశాం. ఆయా రంగాల అభివృద్ధి కోసం చేపట్టిన పనులతో ప్రజల జీవితాల్లో ముఖ్యంగా ఆర్థికపరంగా ఎంతగానో మార్పు వచ్చింది'అని సీఎం బఘేల్ చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మద్య నిషేధం హామీలుకు ఎంతగానో ప్రయత్నించామన్నారు. అయితే, కొందరు కల్తీ మద్యం వాడకం మొదలుపెట్టి మృత్యువాత పడటంతో నిషేధం యోచనను విరమించుకున్నట్లు వివరించారు. '15 ఏళ్లపాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మద్యంపై నిషేధం మాటే ఎత్తలేదు. దేశవ్యాప్తంగా మద్య నిషేధం అమలు చేయాలని ప్రధాని మోదీని డిమాండ్‌చేస్తున్నా'అని తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. 'గిరిజనులకు ఎంతో కీలకమైన జల్, జంగల్, జమీన్(నీరు, అటవి, భూమి)హక్కుల సమస్యను పరిష్కరించాం. ఒకప్పుడు రణరంగాన్ని తలపించిన బస్తర్‌లో నేడు ప్రశాంతత నెలకొంది. ఇవన్నీ మాకు ఎన్నికల్లో కలిసొచ్చే అంశాలే'అని ఆయన తెలిపారు. 'రైతుల నుంచి ఎకరానికి 20 క్వింటాళ్ల ధాన్యం సేకరించాలని నిర్ణయించాం. ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) ద్వారా కేంద్రం మాకు సాయం చేయడం లేదు. అందుకే మేం సొంతంగా గృహ నిర్మాణ పథకం ప్రారంభించాం. కులగణన చేపడతామని మా నేత ప్రియాంకా గాంధీ ప్రకటించారు. ప్రధానంగా వీటిని మేం ప్రకటించినా ప్రతిపక్ష బీజేపీ మాత్రం వీటిపై మౌనంగా ఉంది. పైపెచ్చు మాపై విమర్శలు మాత్రం చేస్తోంది'అని అన్నారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న పాత పింఛను విధానం కారణంగా రాష్ట్ర ఖజానాపై 2060 వరకు అదనంగా ఎలాంటి భారం పడబోదని చెప్పారు. కొత్త పింఛను విధానంలో భాగంగా సేకరించిన రూ.17 వేల కోట్లను కేంద్రం వాపసు చేయాల్సి ఉంటుందని వివరించారు. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి నవంబర్ 7, 17వ తేదీల్లో రెండు విడతలుగా ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

ముస్లింల ఓట్లపై కాంగ్రెస్ గురి

మధ్యప్రదేశ్‌లోని 47 స్థానాల్లో మైనార్టీల ప్రాబల్యం • 22 స్థానాల్లో నిర్ణయాత్మక శక్తిగా ముస్లిం ఓటర్లు

మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో విపక్ష కాంగ్రెస్ పార్టీ ఈసారి మైనార్టీ ఓట్లపై గంపెడాశలు పెట్టుకుంది. మైనార్టీల్లో మెజార్టీ ఓట్లు దక్కించుకుంటే చాలు అధికారం హస్తగతమైనట్లేనని కాంగ్రెస్ నాయకులు నమ్ముతున్నారు. 2011లో మధ్యప్రదేశ్ జనాభాలో ముస్లింలు 7 శాతం ఉన్నారు. ఇప్పుడు 10 శాతానికి చేరి ఉండొచ్చని అంచనా. రాష్ట్రంలో మొత్తం 230 అసెంబ్లీ స్థానాలుండగా, 47 స్థానాల్లో ముస్లింల ఓట్లు గణనీయంగా ఉన్నాయి. వీటిలో 22 స్థానాల్లో ముస్లింల ఓట్లే నిర్ణయాత్మక శక్తి కావడం విశేషం. 47 స్థానాల్లో వారి ఓట్లు 5 వేల నుంచి 15 వేల దాకా ఉన్నాయి. 22 స్థానాల్లో 15 వేల నుంచి 35 వేల వరకూ ఉన్నాయి. 2018 ఎన్నికల్లో బీజేపీకి 41.02 శాతం, కాంగ్రెస్‌కు 40.89 శాతం ఓట్లు వచ్చాయి. బీజేపీ కంటే తక్కువ శాతం ఓట్లు లభించినప్పటికీ కాంగ్రెస్ ఎక్కువ సీట్లు గెలుచుకుంది. 114 సీట్లతో కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా అవతరించింది. బీజేపీకి 109 సీట్లు గెలుచుకుంది. రెండో స్థానంలో నిలిచింది. సమాజ్‌వాదీ, బహుజన సమాజ్‌వాదీ పార్టీలతోపాటు స్వతంత్ర ఎమ్మెల్యేల మద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కేవలం 15 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోయింది. కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలోకి ఫిరాయించారు. దాంతో శివరాజ్‌సింగ్ చౌహాన్ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.



ప్రభుత్వ వ్యతిరేకతపై ఆశలు

మధ్యప్రదేశ్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోరు సాగుతోంది. 2018 ఎన్నికల్లో ముస్లింల మద్దతు వల్లే కాంగ్రెస్‌కు ఎక్కువ స్థానాలు లభించాయని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ముస్లిం ఓటర్లలో 90 శాతం తమకు అనుకూలంగా ఓటు వేస్తే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అంటున్నారు. రాష్ట్రంలో బీజేపీ సర్కారుపై మైనార్టీల్లో వ్యతిరేకత పెరిగిపోయిందని, అంతిమంగా అది తమకు లాభిస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మైనార్టీలను ఆకట్టుకొనేందుకు కాంగ్రెస్ నాయకులు వ్యూహాలు రచిస్తున్నారు. మైనార్టీల సంక్షేమం కోసం బీజేపీ ప్రభుత్వం చేసిందేమీ లేదంటూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

అసెంబ్లీలో ఇద్దరే ముస్లిం ఎమ్మెల్యేలు

రాష్ట్ర శాసనసభలో ముస్లింల ప్రాతినిధ్యం క్రమంగా తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం ఇద్దరు ముస్లిం ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇద్దరూ కాంగ్రెస్‌కు చెందినవారే. గత ఎన్నికల్లో భోపాల్ నార్త్ నుంచి ఆరీఫ్ అకీల్, భోపాల్ సెంట్రల్ నుంచి ఆరీఫ్ మసూద్ విజయం సాధించారు. చాలాఏళ్లుగా వారు ఆయా స్థానాల నుంచి కాంగ్రెస్ టికెట్‌పై విజయం సాధిస్తున్నారు. వారిని ఓడించేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఈసారి ఎన్నికల్లో భోపాల్ నార్త్ నుంచి ఆరీఫ్ అకీల్ తనయుడు అతీఫ్ అకీల్ పోటీ చేస్తున్నారు. ఆయనపై బీజేపీ అభ్యర్థిగా భోపాల్ మాజీ మేయర్ అలోక్ శర్మ పేరు ఖరారైంది. ఇక భోపాల్ సెంట్రల్ నుంచి ఆరీఫ్ మసూద్ మరోసారి పోటీ చేయబోతున్నారు. ఇక్కడ బీజేపీ తమ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ధ్రువ్ నారాయణ్ సింగ్‌ను ప్రకటించింది. 230 స్థానాలకు గాను కేవలం ఇద్దరు ముస్లింలకు టికెట్లు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆ వర్గం మొత్తం ఓట్లు కొల్లగొట్టాలని భావిస్తోందని మధ్యప్రదేశ్ వక్ఫ్ బోర్డు చైర్మన్, బీజేపీ అధికార ప్రతినిధి శాన్వార్ పటేల్ విమర్శించారు. మైనార్టీలను కాంగ్రెస్ దగా చేస్తోందని ఆరోపించారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

పంచతంత్రం

రాజస్తాన్‌లో 43 మందితో కాంగ్రెస్ మరో జాబితా

న్యూఢిల్లీ: రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికలకు గాను కాంగ్రెస్ పార్టీ ఆదివారం 43 మంది అభ్యర్థుల పేర్లతో మరో జాబితా విడుదల చేసింది. మాజీ చీఫ్ సెక్రటరీ నిరంజన్ ఆర్యకు ఎస్సీ రిజర్వుడు స్థానం సోజత్‌ను కేటాయించింది. మంత్రులు రాజేంద్ర సింగ్ యాదవ్‌ను కొట్‌పుత్లి నుంచి, ప్రతాప్ సింగ్‌ను సివిల్ లేన్స్, శకుంతలా రావత్‌ను బన్సూర్ నుంచి బరిలోకి దించనుంది.

ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ తుది జాబితా విడుదల

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలకు గాను కాంగ్రెస్ పార్టీ ఏడుగురు అభ్యర్థులతో కూడిన తుది జాబితాను ఆదివారం విడుదల చేసింది. ఈ జాబితాలో అంబికా దేవ్‌కు బైకుంఠ్ సీటును, చతురి నంద్‌కు సరాయ్‌పాలి, రశ్మి చంద్రశేఖర్‌కు మహాసముంద్‌ను, సందీప్ సాహుకు కస్డోల్‌ను, కుల్దీప్ జునేజాకు రాయ్‌పూర్ సిటీ నార్త్, అంబికా మార్కమ్‌కు సిహావా సీట్లను కేటాయించింది.

కాంగ్రెస్ అభ్యర్థులు నేర చరిత్రను తెలపలేదు

ఛత్తీస్‌గఢ్ ఎన్నికల అధికారులకు బీజేపీ ఫిర్యాదు

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన 83 మంది కాంగ్రెస్ అభ్యర్థులు తమ నేర చరిత్ర వివరాలను ఎన్నికల సంఘానికి వెల్లడించలేదంటూ ప్రతిపక్ష బీజేపీ రాయ్‌పూర్‌లోని చీఫ్ ఎలక్టోరల్ అధికారి(సీఈవో)కి ఫిర్యాదు చేసింది. బీజేపీవి తప్పుడు ఆరోపణలంటూ అధికార కాంగ్రెస్ కొట్టిపారేసింది. రాష్ట్ర అసెంబ్లీలోని 90 సీట్లకు నవంబర్ 7, 17వ తేదీల్లో రెండు విడతలుగా జరగనున్న పోలింగ్‌కు కాంగ్రెస్ పార్టీ 83 మంది అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది. అభ్యర్థిత్వం ఖరారైన 48 గంటల్లోగా సంబంధిత రాజకీయ పార్టీలు అభ్యర్థుల నేర చరిత్రను ఎన్నికల సంఘానికి అందజేయాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను కాంగ్రెస్ పార్టీ పాటించలేదంటూ బీజేపీ శనివారం సీఈవోకు ఫిర్యాదు చేసినట్లు బీజేపీ నేత జయప్రకాశ్ చంద్రవంశీ చెప్పారు. అభ్యర్థుల నేరచరిత్రను తమ వెబ్‌సైట్, రెండు వార్తా పత్రికలు లేదా సామాజిక మాధ్యమంలోనూ వెల్లడి చేయలేదన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించినందున వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ ప్రతినిధి ధనుంజయ్ ఠాకూర్ స్పందించారు. నేర ప్రవృత్తి గల వారికి తాము టిక్కెట్లు ఇవ్వలేదని వివరించారు. నేరచరితులను కాపాడటం, వారిని ఎన్నికల బరిలోకి దించడం బీజేపీ అలవాటేనన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
232	82
65,398	19,543

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	12,984	▽ 202
డోజోన్స్	33,127	▽ 287
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,402	▽ 97
డాక్స్	14,798	▽ 247
షాంఘై	2,983	▽ 22
నికాయ్	31,259	▽ 171

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.43	84.10
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	99.44	102.75
€	యూరో	ఎస్‌బీఐ	86.54	89.63
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.73	56.44
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.55	53.84
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.70	61.63
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.21	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.73	23.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.24	12.31

పాత బంగారం మార్చుకుంటున్నారా?

పండుగలు అంటే కేవలం ఖర్చు చేయడమే కాదు.. భవిష్యత్‌కు 'బంగారు'బాట వేసుకోవడం కూడా. నచ్చిన గృహోపకరణాలు, గ్యాడ్జెట్లు కొనే వారు, అందులో కొంత ఆదా చేసి భవిష్యత్ కోసం ఎందుకు ఇన్వెస్ట్ చేసుకోకూడదు? ఇలా ఆలోచించే కొందరు పండుగ సమయాల్లో బంగారం కొనుగోలు చేస్తుంటారు. బంగారం కేవలం అందాన్ని పెంచే ఆభరణం మాత్రమే కాదు, విలువను పెంచే ఆస్తి. అస్థిరతల్లో ర్యాలీ చేసే పెట్టుబడి సాధనం. కనుక పండుగ సమయాల్లో విలువ తరిగిపోయే వాటి కోసం వేలాది రూపాయలు ఖర్చు పెట్టేవారు.. పసిడికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నది నిపుణుల సూచన.



- ఆభరణం కోసమా.. పెట్టుబడి కోసమా?
- రెండింటికీ ఒక్కటే విధానం అనుకూలం కాదు
- అవసరమైతేనే కొత్త ఆభరణంతో మార్పిడి
- ఈ సమయంలో తయారీ, పన్నుల రూపంలో నష్టం
- పెట్టుబడి దృష్ట్యా మెరుగైన ప్రత్యామ్నాయాలు

గడిచిన కొన్నేళ్లలో బంగారం కొనుగోలు ఎన్నో మార్పులను సంతరించుకుంది. 20 ఏళ్ల క్రితం బంగారంపై పెట్టుబడి పెట్టే వారు అరుదుగా కనిపించే వారు. తర్వాత కాలంలో ఇందులో స్పష్టమైన మార్పు కనిపించింది. ముఖ్యంగా గడిచిన పదేళ్ల కాలంలో బంగారాన్ని పెట్టుబడి సాధనంగా అర్థం చేసుకోవడం పెరిగింది. గతంలో బంగారంపై పెట్టుబడి అంతా భౌతిక రూపంలోనే ఉండేది. ఇప్పుడు సార్వభౌమ పసిడి బాండ్లు (ఎస్‌జీబీలు), గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్, గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (గోల్డ్ ఈటీఎఫ్‌లు) సాధనాలు అందుబాటులో ఉన్నాయి. అయినా, ఇప్పటికీ పెట్టుబడి దృష్ట్యా భౌతిక బంగారానికే ఎక్కువ మంది ప్రాధాన్యం ఇస్తున్నారు. ధంతేరస్ (ధనత్రయోదశి) వంటి ప్రత్యేక పర్వదినాల్లో పెద్ద ఎత్తున బంగారం కొనుగోళ్లు నమోదవుతుంటాయి. ఒక తరం నుంచి మరో తరానికి బదిలీ అయ్యే ఆస్తుల్లో బంగారానికి మొదటి స్థానం ఉంటుంది. నేటితరం పాత బంగారాన్ని, కొత్త ఆభరణాలతో మార్చుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. నిజానికి పాత బంగారం మార్పిడితో కొత్త ఆభరణాలు కొనుగోలు చేయడం సరైనదా..? ఆభరణాలను పెట్టుబడిగా చూడొచ్చా? పెట్టుబడి కోసం ఏ రూపంలో ఇన్వెస్ట్ చేయడం మెరుగు? ఈ విషయంలో నిపుణుల అభిప్రాయాలను ఎలా ఉన్నాయో పరిశీలిద్దాం.

బంగారం మార్పిడి విధానం..?

పాత బంగారు ఆభరణాలను మార్చుకోవడం వెనుక ఎన్నో కారణాలు ఉండొచ్చు. మార్కెట్లోకి వచ్చే కొత్త డిజైన్ల పట్ల ఆసక్తి ఏర్పడొచ్చు. పాత నగలు డ్యామేజ్ కావొచ్చు. లేదంటే కొత్త ఆభరణాలు కొనుగోలు చేసుకోవడానికి బడ్జెట్ లేక పాత వాటిని మార్చుకోవచ్చు. కారణం ఏదైనా.. పాత బంగారం మార్చుకునే క్రమంలో కొంత నష్టపోతున్నామనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. పాత బంగారం ఆభరణాల మార్పిడికి సంబంధించి మన దేశంలో ప్రామాణిక విధానం అంటూ లేదు. వర్తకుల మధ్య వ్యత్యాసం కనిపిస్తుంది. ఆభరణం కొనుగోలు చేసిన వర్తకుడి వద్దే దాన్ని మార్చుకోవడం వల్ల గరిష్ట విలువను తిరిగి పొందడానికి అవకాశం ఉంటుంది. హాల్‌మార్క్ ఆభరణాలు అయితే బంగారం మార్కెట్ ధర మేర విలువను పొందొచ్చు. అయినా కానీ, ఆభరణాల తరుగు-తయారీ చార్జీలు అధికంగా ఉంటున్నాయి. బంగారం ధరలో 10-20 శాతం వరకు తరుగు, తయారీ చార్జీలను జ్యుయలరీ సంస్థలు వసూలు చేస్తున్నాయి. పాత ఆభరణాన్ని మార్చుకున్నప్పుడు అందులో తరుగు-తయారీ రూపంలో కొంత నష్టం ఏర్పడుతుంది. తిరిగి నూతన ఆభరణం కొనుగోలు చేయడం వల్ల, దాని తరుగు-తయారీ చార్జీల రూపంలో అదనంగా చెల్లించుకోవాల్సి వస్తుంది.

కొనుగోలు చేసిన వర్తకుడి నుంచి కాకుండా, వేరొక చోట పాత ఆభరణాన్ని మార్చుకునేట్టు అయితే ప్రక్రియ వేరుగా ఉంటుంది. వర్తకులు కొందరు కొన్ని అంశాల్లో ఏకరూప విధానాన్ని అనుసరిస్తుంటే, కొన్నింటి విషయాల్లో సొంత ప్రక్రియలను అమలు చేస్తున్నారు. పాత బంగారం ఆభరణాన్ని కరిగించి, స్వచ్ఛత చూసిన తర్వాత, కొత్త ఆభరణంతో మార్చుకోవడానికి చాలా సంస్థలు అనుమతిస్తున్నాయి. ''డిజిటల్ స్కేల్ సాయంతో బంగారం ఆభరణం బరువు చూస్తారు. దీని ఆధారంగా స్వచ్ఛతను బట్టి ధర నిర్ణయిస్తారు. సాధారణంగా అనుసరించే స్వచ్ఛతలు 24 క్యారట్ (99.9 శాతం స్వచ్ఛత), 22 క్యారట్ (91.6 శాతం స్వచ్ఛత), 18 క్యారట్ (75 శాతం స్వచ్ఛత). కొందరు జ్యుయలర్లు స్క్రాచ్ (గీయడం), యాసిడ్ టెస్ట్ ద్వారా బంగారం స్వచ్ఛతను నిర్ధారిస్తుంటారు''అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కమోడిటీస్ హెడ్ హరీశ్.వి తెలిపారు. అన్నింటికంటే ప్రామాణికమైనది హాల్‌మార్క్ స్వచ్ఛత విధానం. భారతీయ ప్రమాణాల మండలి (బీఐఎస్) హాల్‌మార్క్ సర్టిఫికేషన్ సేవలు అందిస్తోందని, హాల్‌మార్క్ గోల్డ్ స్వచ్ఛత పరంగా విశ్వసనీయమైనదిగా హరీశ్ పేర్కొన్నారు. ఇప్పుడు పెద్ద సంస్థలు అయితే క్యారట్‌ను కొలిచే మెషీన్లను ఉపయోగిస్తున్నాయి. వీటినే గోల్డ్ అనలైజర్ మెషీన్లు అంటున్నారు. అందులో బంగారం లేదా ఆభరణాన్ని ఉంచితే బరువు ఎంత, ప్యూరిటీ ఎంత అనే వివరాలను ప్రదర్శిస్తాయి. ఉదాహరణకు వడోదరకు చెందిన రీనా దంపతులు ఎదుర్కొన్న అనుభవాన్ని తెలుసుకుంటే పాత బంగారం మార్పిడి ఇప్పుడు ఎంత సులభంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. వీరివద్దనున్న 20 గ్రాముల బంగారం చైన్ తెగిపోగా, 2014లో మార్చుకుందామని అనుకున్నారు. ఓ జ్యుయలర్ వద్దకు వెళితే, కంటితో చూసి 18 క్యారట్ల బంగారం అని ఖరారు చేసి, రూ.37,500 ధర చెల్లిస్తానని చెప్పాడు. అప్పుడు 10 గ్రాముల బంగారం ధర రూ.25,000 స్థాయిలో ఉంది. దీంతో వారు మార్చుకోలేదు. ఇటీవలే అదే చైన్‌ను ఓ వర్తకుడి వద్దకు తీసుకెళ్లగా, గోల్డ్ అనలైజర్ మెషీన్‌లో పెట్టి చూశారు. 22 క్యారెట్ల ప్యూరిటీ ఉన్నట్టు చూపించింది. దాన్ని కరిగించిన తర్వాత అసలు విలువ చెబుతానని అనడంతో, అందుకు రీనా దంపతులు ఒప్పుకున్నారు. కరిగించిన తర్వాత కూడా 22.1 క్యారెట్ నిర్ధారణ అయింది. దాంతో 10 గ్రాములకు రూ.61,000 చొప్పున విలువ కట్టారు. కొత్త ఆభరణం ధర కూడా అదే రీతిలో ఉండడంతో వారు మార్చుకునేందుకు సమ్మతించారు.

మార్చుకుంటే ఎంత కోల్పోవచ్చు..?

	పాత ఆభరణం	కొత్త ఆభరణం
బరువు	20గ్రాములు	20 గ్రాములు
ధర (10 గ్రా.)	రూ.60,000 (సుమారు)	రూ.60,000
తరుగు-తయారీ చార్జీలు	లేవు	15 శాతం
పన్ను	వర్తించదు	3 శాతం
మొత్తం ధర	1,20,000	1,41,600

మార్చుకోవడం వల్ల కోల్పోయేది రూ.21,600

కొనుగోలు మార్గాలు.. చార్జీలు.. రిస్కులు

సాధనం	కొనుగోలు మార్గం	రిస్క్	చార్జీలు	కనీస పెట్టుబడి
భౌతిక బంగారం	ఆభరణాలు, కాయిన్లు, కడ్డీలు	జాగ్రత్తగా కాపాడుకోవడం	లాకర్, తయారీ, ఇన్సూరెన్స్ వ్యయాలు	ఒక గ్రాము విలువ
డిజిటల్ గోల్డ్	యాప్స్ సాయంతో	నియంత్రణ, పర్యవేక్షణ లేదు	జీఎస్‌టీ పన్ను	రూపాయి నుంచి
గోల్డ్ ఈటీఎఫ్‌లు	షేర్ల మాదిరే, స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల నుంచి	ధరల్లో రోజువారీ హెచ్చుతగ్గులు	ఫండ్ ఎక్స్‌పెన్స్ రేషియో, డీమ్యాట్ ఏఎంసీ చార్జీలు, బ్రోకరేజ్	ఒక గ్రాము నుంచి
గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్	ఏఎంసీల నుంచి, బ్రోకర్ల నుంచి	ఈటీఎఫ్‌ల మాదిరే	0.6-1.20 శాతం	రూ.100 నుంచి
ఎస్‌జీబీలు	ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంక్‌లు, బ్రోకర్ల సాయంతో	దాదాపుగా లేనట్టే	చార్జీల్లేవు. పైగా పెట్టుబడి విలువపై ఏటా 2.5 శాతం రాబడి	రూ.5,000 నుంచి



కొత్త ఆభరణాల కొనుగోలు

బంగారం కూడా ఒక ఆస్తే. ఎవరి పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోకైనా ఇది విలువను పెంచుతుంది. ఆభరణం కోసం కొంటున్నారా? లేక పెట్టుబడి దృష్ట్యా కొంటున్నారా? అన్న స్పష్టత అవసరం. భౌతిక బంగారం, ఆభరణాల రూపంలో ఇన్వెస్ట్ చేసుకునేట్టు అయితే తరుగు-తయారీ చార్జీలు, దానిపై జీఎస్‌టీ చార్జీలు చెల్లించాల్సి వస్తుంది. స్వచ్ఛతకు సంబంధించిన సమస్యలు కూడా ఉంటాయి. నేడు చాలా జ్యుయలరీ సంస్థలు తమ వద్దే విక్రయిస్తే 100 శాతం విలువను చెల్లిస్తున్నాయి. ఒకవేళ ఆభరణంతో మార్చుకోకుండా, నగదు కోరితే మొత్తం విలువలో 5 శాతం వరకు తగ్గించి ఇస్తున్నాయి. పన్ను కోణంలో ఇలా చేస్తున్నాయి. ''జ్యుయలరీ అనేది సెంటిమెంటల్. మనోభావాలతో ఉంటుంది. ఒక తరం నుంచి ఇంకో తరానికి బదిలీ అవుతుంటుంది. అయితే అధిక తరుగు-తయారీ చార్జీల (10-20 శాతం)తో మార్చుకునేందుకు అయ్యే వ్యయం ఎక్కువ. దీనికితోడు జ్యుయలరీ కోసం స్టోరేజ్, లాకర్ చార్జీలను కూడా చెల్లించుకోవాల్సి రావచ్చు. భౌతిక బంగారం అయినా, ఆభరణాలు అయినా అవి వ్యక్తిగత ఆస్తులు. ఒక ఇన్వెస్టర్ పెట్టుబడుల విలువకు తోడు కావు. పెట్టుబడి కోసం అయితే బంగారం కడ్డీలు లేదా కాయిన్లను కొనుగోలు చేయడం కాస్త మెరుగైనది'' అని సెబీ నమోదిత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ దిల్షద్ బిల్లిమోరియా సూచించారు. అయితే బంగారం కాయిన్లు, కడ్డీలను తిరిగి విక్రయించే సమయంలో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె అంటున్నారు. ''బ్యాంక్‌లు కాయిన్లు, కడ్డీలను విక్రయించడమే కానీ, వెనక్కి తీసుకోవడం లేదు. దీంతో వీటిని బయట విక్రయించుకోవాల్సి వస్తుంది. తరుగు, కరిగించేందుకు చార్జీలను ఆ సమయంలో వసూలు చేస్తున్నారు''అని బిల్లిమోరియా వివరించారు.

ఏమిటి మార్గం..?

ద్రవ్యోల్బణం ప్రభావాన్ని కాచుకునే చక్కని హెడ్జింగ్ సాధనం బంగారం అని నిపుణులు చెబుతున్నారు. బంగారంలో ఇన్వెస్ట్ చేయడం వల్ల ఎవరి పోర్ట్‌ఫోలియోలో అయినా వైవిధ్యం ఏర్పడుతుందని అంటున్నారు. కాకపోతే పెట్టుబడి దృష్ట్యా అయితే ఆభరణాల కంటే మెరుగైన ప్రత్యామ్నాయాలను పరిశీలించాలన్నది నిపుణుల సూచన. గోల్డ్ ఈటీఎఫ్‌లు, ఎస్‌జీబీలు, గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్‌ను ఇందుకు నిదర్శనంగా పేర్కొంటున్నారు. ''చారిత్రకంగా చూస్తే బంగారం ధరలు ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా సగటున ఏటా 5-11% మధ్య వృద్ధి చెందాయి. ద్రవ్యోల్బణం పెరిగే సమయంలో గోల్డ్ చక్కని హెడ్జింగ్ సాధనం. పెట్టుబడుల వైవిధ్యం దృష్ట్యా బంగారం ఒక మంచి పెట్టుబడి సాధనం అవుతుంది. అయితే అది కడ్డీలు లేదా జ్యుయలరీ రూపంలో ఉండకూడదు'' అని బిల్లిమోరీ సూచించారు. పీపీఎఫ్, కార్పొరేట్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు వంటి సాధనాలు బంగారం మాదిరే వైవిధ్యానికి తోడు, మెరుగైన రాబడి, లిక్విడిటీతో ఉంటాయని చెప్పారు. కనుక పాత బంగారం మార్పిడి అనేది అవసరం ఆధారంగానే నిర్ణయించుకోవాలి. ఉపయోగించని ఆభరణాలను మార్చుకుని కొత్తవి తీసుకోవడం మంచి నిర్ణయం అవుతుంది. పెట్టుబడి కోసం అయితే ఆభరణాలకు బదులు నిపుణులు సూచించిన ప్రత్యామ్నాయాలను పరిశీలించడం మేలు. దీని వల్ల బంగారం విలువలో నష్టపోయే అవకాశం ఉండదు. 2010 వరకు బంగారం విలువ 10 గ్రాములు రూ.15,000 స్థాయిలోనే ఉండేది. కనుక పెట్టుబడుల దృష్ట్యా భౌతిక బంగారాన్ని పెద్ద మొత్తంలో కొనుగోలు చేసే వారు. కానీ, నేడు ధర గణనీయంగా పెరిగిపోవడంతో, పెట్టుబడి కోణంలో డిజిటల్ బంగారం సాధనాలకు ప్రాధాన్యం పెరుగుతోంది.

కొటక్ బ్యాంక్ లాభం అప్

క్యూ2లో రూ. 4,423 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కొటక్ మహీంద్రా బ్యాంక్ ఈ ఏడాది (2023-24) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్ (క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 24% జంప్‌చేసి రూ. 4,423 కోట్లను తాకింది. వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. స్టాండెలోన్ లాభం సైతం రూ. 2,581 కోట్ల నుంచి రూ. 3,191 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 21% వృద్ధితో రూ. 6,297 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 5.22 శాతాన్ని తాకాయి. ఇతర ఆదాయం రూ. 1,832 కోట్ల నుంచి రూ. 2,314 కోట్లకు పుంజుకుంది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.08% నుంచి రూ. 1.72%కి తగ్గాయి.

అశోక్ వాశ్వానికి సై: కొటక్ మహీంద్రా బ్యాంక్ కొత్త ఎండీ, సీఈవోగా బయటి వ్యక్తి అశోక్ వాస్వాని ఎంపికకు ఆర్‌బీఐ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కొటక్ నాలుగు నెలల ముందుగానే ఎండీ, సీఈవో బాధ్యతల నుంచి వైదొలగుతున్న నేపథ్యంలో అశోక్‌ను బ్యాంక్ బోర్డు ప్రతిపాదించింది.

ఐసీఐసీఐ బ్యాంక్ లాభం జూమ్

క్యూ2లో రూ. 10,896 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జూలై-సెప్టెంబర్ (క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 36% జంప్‌చేసి రూ. 10,896 కోట్లను తాకింది. ప్రొవిజన్లు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. స్టాండెలోన్ లాభం సైతం రూ.7,558 కోట్ల నుంచి రూ. 10,261 కోట్లకు ఎగసింది. మొత్తం ఆదాయం రూ. 31,088 కోట్ల నుంచి రూ. 40,697 కోట్లకు దూసుకెళ్లింది. నికర వడ్డీ ఆదాయం 24 శాతం వృద్ధితో రూ. 18,308 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 4.31 శాతం నుంచి 4.53 శాతానికి బలపడ్డాయి. ట్రెజరీ మినహా వడ్డీయేతర ఆదాయం 14 శాతం అధికమై రూ. 5,861 కోట్లయ్యింది.

ఎన్‌పీఏలు డౌన్...

తాజా సమీక్షా కాలంలో ఐసీఐసీఐ బ్యాంక్ స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.19 శాతం నుంచి రూ. 2.48 శాతానికి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 16.07 శాతంగా నమోదైంది.

స్టాక్స్ వ్యూ

రామ్‌కో సిమెంట్స్	షేర్‌ఖాన్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 991 టార్గెట్: రూ. 1,130



ఎందుకంటే: ప్రయివేట్ రంగ కంపెనీ రామ్‌కో సిమెంట్స్ దక్షిణాదిలో సగటు సిమెంట్ ధరల వేగవంత పెరుగుదల, ఈ ఏడాది(2023-24) రెండో త్రైమాసికం (క్యూ2) తదుపరి ఇంధన వ్యయాలు తగ్గడం వంటి అంశాల కారణంగా లబ్ధి పొందే అవకాశముంది. దక్షిణాదిలో సగటు సిమెంట్ ధరలు అక్టోబర్ 5 నుంచి ఒక్కో బ్యాగుకి సుమారు రూ. 40 చొప్పున ఎగశాయి. వెరసి క్యూ2(జులై-సెప్టెంబర్)తో పోలిస్తే సిమెంట్ ధరలు 10 శాతం అధికంగా లభించనున్నాయి. సీజనల్‌గా ఈ ఆర్థిక సంవత్సరం క్యూ2 బలహీన కాలం అయినప్పటికీ బలమైన డిమాండ్ కనిపించింది. ఈ ట్రెండ్ పూర్తి ఏడాదిలోనూ కొనసాగే అంచనాలున్నాయి. పూర్తి ఏడాదికి సిమెంట్ అమ్మకాల పరిమాణంలో 20 శాతం వార్షిక వృద్ధిని కంపెనీ అంచనా వేస్తోంది. ఈ నెలలో అంతర్జాతీయ కోల్, దేశీ పెట్ కోక్ ధరలు నెలవారీగా చూస్తే 13-5 శాతం చొప్పున క్షీణించాయి. మరోవైపు ప్రాంతాలవారీగా సిమెంట్ ధరలు బలపడటంతో నిర్వహణ లాభాలు మరింత పుంజుకునేందుకు వీలుంది. నాన్‌ట్రేడ్ విభాగంపై కంపెనీ ప్రత్యేక దృష్టి సారించడం, అధిక ధరల ఉత్పత్తులు(ప్రీమియమైజేషన్), వ్యయ నిర్వహణా సామర్థ్యాలు, సిమెంటు విక్రయాలలో గరిష్ట ధరలను పొందడం, కొనసాగుతున్న పటిష్ట డిమాండు వంటి అంశాలు కంపెనీ నిర్వహణ లాభం, నికర లాభాలను భారీగా మెరుగుపరిచే అవకాశముంది. దీంతో కంపెనీ ఆర్జనలు పుంజుకోనున్నాయి. ఇది కంపెనీ రీరేటింగ్‌కు దారితీయవచ్చని భావిస్తున్నాం.

హిండాల్కో	మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 473 టార్గెట్: రూ. 570



ఎందుకంటే: అల్యూమినియం తయారీ దిగ్గజం హిండాల్కో ఇండస్ట్రీస్‌కు ఒడిషాలోని హీరాకుడ్, ఆదిత్య ప్లాంట్లను ఇటీవలే సందర్శించాం. తద్వారా ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ మెటల్ తయారీ విధానాలు, కార్యకలాపాలను పరిశీలించాం. ఆదిత్య స్మెల్టర్ ప్లాంటు ప్రపంచంలోనే చౌక వ్యయాల, అత్యంత సమర్థవంతమైన యూనిట్లలో ఒకటిగా నిలుస్తోంది. అత్యంత ఆటోమేటెడ్ విధానంలో ఏర్పాటైన ఈ యూనిట్ కార్యకలాపాల నియంత్రణలో అతిఎక్కువ టెక్నాలజీతోపాటు, క్రేన్లు తదితరాలను వినియోగిస్తోంది. డౌన్‌స్ట్రీమ్‌లో ముడిసరుకులకు సంబంధించి ఫైబర్ రీఇన్‌ఫోర్స్‌డ్ పాలిమర్స్(ఎఫ్ఆర్‌పీ) విస్తరణపై ప్రత్యేక దృష్టిని సారిస్తోంది. తద్వారా లాభదాయకతను మరింత మెరుగుపరచుకునేందుకు వీలుంటుంది. ఇది వ్యయాల ప్రభావిత(ఆదా) సమీకృత విధానంలో భాగంకాగా.. సొంత హాట్ మిల్ సామర్థ్యం ద్వారానే ఎఫ్ఆర్‌పీ ప్రొడక్టులను రూపొందించుకోగలుగుతోంది. అత్యున్నత ఆటోమేషన్, టెక్నాలజీ వినియోగంతోపాటు.. తయారీ విధానంలో ప్రతీ చోటా వ్యయాల ఆదాకు మరింతగా ప్రయత్నిస్తోంది. తయారీలో అత్యంత రక్షణాత్మక చర్యలను అనుసరిస్తోంది. సామర్థ్యాన్ని గరిష్ఠంగా వినియోగించుకునే బాటలో సిమ్యులేషన్ ఆధారిత శిక్షణా విధానాలను అవలంబిస్తోంది. పటిష్ట బ్యాలన్స్‌షీట్ కలిగిన కంపెనీ అంతర్గత వనరుల ద్వారానే విస్తరణ సంబంధ పెట్టుబడి వ్యయాలను సమకూర్చుకుంటోంది. అత్యంత సమీకృత కార్యకలాపాలు కలిగిన కంపెనీ డౌన్‌స్ట్రీమ్ సామర్థ్య విస్తరణ ద్వారా లాభాలను భారీగా పెంచుకునే ప్రణాళికలు అమలు చేస్తోంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

పిల్లల ఉన్నత విద్యకు అనుకూల సాధనాలు?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

మార్కెట్లలో అస్థిరతలను ఇన్వెస్టర్లు అధిగమించడం ఎలా?
– కిరణ్

అస్థిరతలనేవి ఈక్విటీల సహజ లక్షణం. ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చలిస్తుంటాయి. గడిచిన ఐదు, పదేళ్లుగా మార్కెట్లలో ఇదే ధోరణి కనిపిస్తోంది. ఇన్వెస్టర్లు వీటిని ఎదుర్కోడం ఎలా అన్నది తెలుసుకోవాలి. ఇందుకోసం కొన్ని చర్యలను అమలు చేయాల్సి ఉంటుంది. ముందుగా ప్రతీ ఇన్వెస్టర్ లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్లను తీసుకుని తమకు, తమ కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించుకోవాలి. అత్యవసర సందర్భాల్లో ఈక్విటీ పెట్టుబడులను కదిలించకుండా ఉండాలి. ఇందుకోసం ప్రత్యేకంగా అత్యవసర నిధిని (ఈఎఫ్) ఏర్పాటు చేసుకోవాలి. ఈక్విటీల్లో మీ పెట్టుబడులను కనీసం ఐదు నుంచి ఏడేళ్ల పాటు కదపకూడదు. ఈక్విటీ అస్థిరతలను అధిగమించేందుకు ఈ చర్యలు అవసరం. అలాగే, సిప్ వంటి సాధనాల ద్వారా ఇన్వెస్ట్ చేయడం వల్ల మార్కెట్ అస్థిరతల నుంచి ప్రయోజనాన్ని పొందొచ్చు. సిప్ రూపంలో క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేసే వారికి మార్కెట్లలో కరెక్షన్లు మంచి అవకాశాలను తెస్తాయి. ఎందుకంటే ఆ సమయాల్లో ఎక్కువ ఫండ్ యూనిట్లను తక్కువ ధరకే సమకూర్చుకోవచ్చు. మార్కెట్లు దిద్దుబాటుకు గురైతే చౌకగా కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుంది. కానీ, మీడియాలో వచ్చే గందరగోళ సమాచారం ఇన్వెస్టర్లను నిరాశకు, అయోమయానికి, భయానికి గురి చేస్తుంది. దాంతో వారు ప్రతికూల సమయాల్లో పెట్టుబడులు చేయడానికి వెనుకాడుతుంటారు. పైగా కొందరు అమ్మకాలు కూడా చేస్తుంటారు. ఇదే అతిపెద్ద తప్పు. ఆ సమయంలో తప్పకుండా సిప్‌ను కొనసాగించాలి. వీలైతే సిప్ మొత్తాన్ని పెంచుకోవాలి. దీనివల్ల దీర్ఘకాలంలో మరిన్ని రాబడులు సమకూర్చుకోడానికి వీలుంటుంది.

నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారి వయస్సు పదేళ్లలోపే ఉంటుంది. వారి ఉన్నత విద్య కోసం ఏకమొత్తంలో ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. ఇందుకు అనుకూల సాధనాలు ఏవి? – విజయశ్రీ

పిల్లల విద్య కోసం ఏక మొత్తంలో ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి?.. చాలా మంది తల్లిదండ్రులు సాధారణంగా ఎదుర్కొనే సందేహం ఇది. ప్రాపర్టీ విక్రయం లేదా బోనస్ లేదా తాతలు తమ మనవళ్లు, మనవరాళ్ల కోసం నగదు బహుమతి ఇచ్చినప్పుడు.. ఆ మొత్తాన్ని పిల్లల భవిష్యత్తు కోసం ఇన్వెస్ట్ చేయాలని చాలా మంది తల్లిదండ్రులు భావిస్తారు. ఇందుకోసం పలు మార్గాలు ఉన్నాయి. సాధారణంగా ఈ మొత్తాన్ని పిల్లల ఉన్నత విద్య కోసం ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటే అందుకు, సాధారణంగా పదేళ్ల కాల వ్యవధి ఉంటుంది. అటువంటప్పుడు ఈక్విటీలకు మించి మెరుగైన సాధనం లేదనే చెప్పాలి. ఈక్విటీల్లోనూ ఫ్లెక్సీక్యాప్ విభాగం అనుకూలంగా ఉంటుంది. ఎందుకంటే ఫ్లెక్సీక్యాప్ పథకాలు పెట్టుబడులను వైవిధ్యం ఉండేలా చూస్తాయి. అన్ని రంగాల పరిధిలో, భిన్న మార్కెట్ క్యాప్ కలిగిన (డైవర్సిఫైడ్) కంపెనీల్లో ఫండ్ మేనేజర్ పెట్టుబడులు పెడతారు.

ఒకవేళ పన్ను ప్రయోజనం కూడా కోరుకుంటే ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్)ను ఎంపిక చేసుకోవచ్చు. ఇవి కూడా ఫ్లెక్సీక్యాప్ మాదిరే పనిచేస్తుంటాయి. అన్ని రంగాలకు చెందిన కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా రిస్క్ తగ్గించే విధంగా ఈఎల్ఎస్ఎస్ పథకాల పనితీరు ఉంటుంది. ఈ పథకాల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలు ఇన్వెస్ట్ చేయడం ద్వారా సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనం పొందొచ్చు. ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ ఐదేళ్ల కాలంలో సగటున 12 శాతానికి పైనే వార్షిక రాబడులు ఇచ్చాయి. ఈ రాబడి రేటు ప్రకారం ఎవరైనా రూ.లక్షను పదేళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేస్తే.. రూ.3.14 లక్షలు సమకూరుతుంది. ఈక్విటీల్లో అస్థిరతలు సహజంగా ఉంటాయి. కనుక ఫ్లెక్సీక్యాప్ పథకాల్లోనూ ఇదే కనిపిస్తుంది. అందుకనే ఈక్విటీల్లో ఏక మొత్తంలో ఇన్వెస్ట్ చేయడం కాకుండా, తమ దగ్గరున్న పెట్టుబడులను కొన్ని విడతలుగా ఇన్వెస్ట్ చేసుకోవాలి. మీ దగ్గర ఉన్న ఏక మొత్తాన్ని ఏదైనా డెట్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసి.. దాని నుంచి ప్రతి నెలా సిస్టమ్యాటిక్ ట్రాన్స్‌ఫర్ ప్లాన్ (ఎస్‌టీపీ) రూపంలో ఈక్విటీ పథకాల్లోకి మళ్లించుకోవాలి. మూడేళ్ల కాలంలో దీన్ని పూర్తి చేయాలి. దీనివల్ల మార్కెట్ల ర్యాలీ, కరెక్షన్లలోనూ ఇన్వెస్ట్ చేసినట్టు అవుతుంది.

1 వన్డే ప్రపంచకప్ చరిత్రలో రెండుసార్లు మ్యాచ్‌లో ఐదు వికెట్ల చొప్పున తీసిన తొలి భారతీయ బౌలర్‌గా షమీ గుర్తింపు పొందాడు. 2019 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌పై కూడా షమీ (5/69) ఐదు వికెట్లు తీశాడు.

38 వన్డేల్లో తక్కువ ఇన్నింగ్స్‌లలో 2000 పరుగులు పూర్తి చేసిన బ్యాటర్‌గా శుబ్‌మన్ గిల్ నిలిచాడు. గిల్ 38 ఇన్నింగ్స్‌లో ఈ మైలు రాయిని దాటి దక్షిణాఫ్రికా ప్లేయర్ ఆమ్లా (40 ఇన్నింగ్స్) పేరిట ఉన్న రికార్డును బద్దలు కొట్టాడు.

5 ఈ ప్రపంచకప్‌లో భారత్ తరఫున ఐదు మ్యాచ్‌ల్లో ఐదు గురు వేర్వేరు ఆటగాళ్లకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డులు లభించాయి. ఆస్ట్రేలియాపై రాహుల్, అఫ్గానిస్తాన్‌పై రోహిత్ శర్మ, పాకిస్తాన్‌పై బుమ్రా, బంగ్లాదేశ్‌పై కోహ్లి, న్యూజిలాండ్‌పై షమీ ఈ పురస్కారాలు గెల్చుకున్నారు.



మిచెల్ (130)

షమీ 5 కోహ్లి 95 భారత్ 5

ప్రపంచకప్‌లో ఎదురులేని టీమిండియా ● వరుసగా ఐదో గెలుపు న్యూజిలాండ్‌కు తొలి పరాజయం ● మెరిసిన షమీ, కోహ్లి

1, 2, 3, 4, 5... ఐదు మ్యాచ్‌లు మనవే! మైదానంలోకి దిగిన ప్రతీసారి విజయం మన జట్టునే వరించింది... ఆస్ట్రేలియా, అఫ్గానిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల తర్వాత ఇప్పుడు న్యూజిలాండ్ లెక్క కూడా తేల్చేశాం ... ఐదుసార్లూ ప్రత్యర్థి లక్ష్యాన్ని నిర్దేశిస్తే అన్నింటినీ ఛేదించేశాం... ఫలితంగా వరల్డ్ కప్‌లో టీమిండియా తిరుగులేని ప్రదర్శనతో మళ్లీ పైచేయి సాధించింది... టోర్నీలో ఇప్పటి వరకు అజేయంగా ఉన్న భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగిన సమరంలో రోహిత్ బృందానికే గెలుపు దక్కింది.

ప్రపంచకప్‌లో 20 మ్యాచ్‌లు జరిగినా హోరాహోరీ సమరం కనిపించలేదనేవారికి ఈ మ్యాచ్ సమాధానం ఇచ్చింది. పలు మలుపులతో ఆసక్తికరంగా సాగిన ఈ మ్యాచ్‌లో 12 బంతుల ముందు భారత్ గట్టెక్కింది. 19/2 నుంచి 243/4కు చేరిన కివీస్‌ను 273కే పరిమితం చేసి భారత్ పైచేయి సాధించింది. గత మ్యాచ్‌లకు భిన్నంగా కొంత తడబడి ఆరు వికెట్లు చేజార్చుకున్నా... చివరకు ఫలితం దక్కింది. టోర్నీలో తాను ఆడిన తొలి మ్యాచ్‌లో షమీ 5 వికెట్లతో చెలరేగగా... కోహ్లి తనదైన శైలిలో నిలబడి పరుగులను వేటాడినా త్రుటిలో సెంచరీని చేజార్చుకున్నాడు.

ధర్మశాల: వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టు జైత్రయాత్ర కొనసాగుతోంది. ఆడిన ఐదో మ్యాచ్‌లోనూ గెలుపు బావుటా ఎగరేసిన టీమిండియా పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరింది. ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 50 ఓవర్లలో 273 పరుగులకు ఆలౌటైంది. డరైల్ మిచెల్ (127 బంతుల్లో 130; 9 ఫోర్లు, 5 సిక్స్‌లు) సెంచరీ సాధించగా, రచిన్ రవీంద్ర (87 బంతుల్లో 75; 6 ఫోర్లు, 1 సిక్స్) ఆకట్టుకున్నాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మొహమ్మద్ షమీ (5/54) ఐదు వికెట్లతో ప్రత్యర్థిని నిలువరించాడు. అనంతరం భారత్ 48 ఓవర్లలో 6 వికెట్లకు 274 పరుగులు చేసి గెలిచింది. విరాట్ కోహ్లి (104 బంతుల్లో 95; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగగా, రోహిత్ శర్మ (40 బంతుల్లో 46; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), రవీంద్ర జడేజా (44 బంతుల్లో 39 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. భారత్ తమ తర్వాతి మ్యాచ్‌లో ఈనెల 29న లక్నోలో ఇంగ్లండ్‌తో తలపడుతుంది.

భారీ భాగస్వామ్యం...

ఆరంభంలోనే న్యూజిలాండ్ రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. కాన్వే (0)ను సిరాజ్ అవుట్ చేయగా, ఈ ప్రపంచకప్‌లో తాను వేసిన తొలి బంతికే యంగ్ (17)ను షమీ అవుట్ చేశాడు. అయితే రచిన్, మిచెల్ మూడో వికెట్ భాగస్వామ్యం కివీస్‌ను కోలుకునేలా చేసింది. మరో 25 ఓవర్లపాటు వీరిద్దరు భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. ముఖ్యంగా ఇప్పటి వరకు టోర్నీలో ప్రత్యర్థి బ్యాటర్లందరినీ కట్టడి చేసిన కుల్దీప్ బౌలింగ్‌లో వీరు వేగంగా పరుగులు రాబట్టారు. 12 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రచిన్ ఇచ్చిన (షమీ బౌలింగ్‌లో) సునాయాస క్యాచ్‌ను జడేజా వదిలేశాడు! దీనిని రచిన్ సమర్థంగా వాడుకున్నాడు. ఈ క్రమంలో 56 బంతుల్లోనే అతని అర్ధసెంచరీ పూర్తయింది. ఆ తర్వాత 60 బంతుల్లో మిచెల్ హాఫ్ సెంచరీ అందుకున్నాడు. ఆ తర్వాతా వీరిద్దరు ధాటిని ప్రదర్శించడంతో భాగస్వామ్యం 150 పరుగులు దాటింది. 69 పరుగుల వద్ద మిచెల్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను బుమ్రా నేలపాలు చేశాడు. ఎట్టకేలకు రచిన్‌ను వెనక్కి పంపి షమీ ఈ జోడీని విడదీశాడు. లాథమ్ (5) విఫలం కాగా 100 బంతుల్లో మిచెల్ శతకాన్ని అందుకొని ప్రపంచకప్‌లో భారత్‌పై సెంచరీ సాధించిన తొలి న్యూజిలాండ్ ఆటగాడిగా నిలిచాడు. అయితే ఆ తర్వాత కివీస్ పతనం వేగంగా సాగింది. 243/4తో మెరుగైన స్థితిలో కనిపించిన జట్టు భారత బౌలర్ల ధాటికి చివరి 6 ఓవర్లలో 30 పరుగుల వ్యవధిలో 6 వికెట్లు కోల్పోయింది.

జడేజా అండగా...

భారత్‌కు ఛేదనలో రోహిత్ మరోసారి అద్భుత ఆరంభాన్ని అందించాడు. బౌల్ట్, హెన్రీల బౌలింగ్‌లో చెలరేగి ఫోర్లు, సిక్సర్లతో దూసుకుపోయాడు. అతనికి శుబ్‌మన్ గిల్ (31 బంతుల్లో 26; 5 ఫోర్లు) అండగా నిలిచాడు. అయితే ఫెర్గూసన్ 7 బంతుల వ్యవధిలో వీరిద్దరిని వెనక్కి పంపాడు. ఈ దశలో కోహ్లి పట్టుదలగా నిలబడిన తీరు భారత్‌కు గెలుపు అవకాశాలు సృష్టించింది. శ్రేయస్ అయ్యర్ (29 బంతుల్లో 33; 6 ఫోర్లు), కేఎల్ రాహుల్ (35 బంతుల్లో 27; 3 ఫోర్లు)లతో పాటు చివర్లో జడేజాతో కోహ్లి మూడు అర్ధసెంచరీ భాగస్వామ్యాలు నెలకొల్పడం విశేషం. ఆరంభంలో నెమ్మదిగా ఆడి ఒకదశలో 47 బంతుల్లో 28 పరుగులే చేసిన కోహ్లి ఆ తర్వాత దూకుడు పెంచాడు. 60 బంతుల్లో అతని హాఫ్ సెంచరీ పూర్తయింది. సమన్వయ లోపంతో సూర్యకుమార్ (2) రనౌటైన తర్వాత కోహ్లి, టోర్నీలో తొలిసారి బ్యాటింగ్‌కు దిగిన జడేజా జత కలిశారు. ఆ సమయంలో 16.1 ఓవర్లలో మరో 83 పరుగులు చేయాల్సి ఉంది. ఈ స్థితిలో వీరిద్దరు ప్రశాంతంగా ఆడుతూ జట్టును లక్ష్యంవైపు నడిపించారు. కివీస్ బౌలర్లు అప్పుడప్పుడు కొన్ని మంచి బంతులతో ఒత్తిడి పెంచగలిగినా... భారత్ గెలుపును ఆపలేకపోయారు. పాండ్యా, శార్దుల్ స్థానాల్లో షమీ, సూర్యకుమార్ ఈ మ్యాచ్‌లో జట్టులోకి వచ్చారు.



కోహ్లి (95)

ఈసారి సెంచరీ దక్కలేదు!

మ్యాచ్‌లో ఒకవైపు భారత్ గెలుపు అవకాశాలు మెరుగవుతూ రాగా, మరోవైపు కోహ్లి సెంచరీ చేసి సచిన్‌ను సమం చేస్తాడా అనేది కూడా ఆసక్తికరంగా మారింది. గత మ్యాచ్‌లో రాహుల్‌లాగే ఈసారి జడేజా కూడా సహకరించడంతో ఆఖర్లో సాధ్యమైనన్ని ఎక్కువ పరుగులు కోహ్లి ఒక్కడే చేసి శతకానికి చేరువయ్యాడు. జట్టుకు 35, కోహ్లికి 25 పరుగులు అవసరమైనప్పుడు ఉత్కంఠ పెరిగింది. ఆపై ఈ సమీకరణం 19 పరుగులు, 18 పరుగులకు మారింది. అయితే బౌల్ట్ వేసిన 47వ ఓవర్లో కోహ్లి 6, 4 సహా 11 పరుగులు రాబట్టి 93కు చేరుకున్నాడు. ఇప్పుడు 7 పరుగులు కావాల్సి ఉండగా తొలి బంతికి కోహ్లి 2 పరుగులు తీశాడు. అయితే మూడో బంతిని భారీ సిక్సర్‌గా మలచి ముగించే ప్రయత్నంలో బౌండరీ లైన్‌కు చాలా ముందే క్యాచ్ ఇచ్చాడు. దాంతో అతను ప్రస్తుతానికి 48 సెంచరీల వద్దే నిలిచాడు.



షమీ (5/54)

ప్రపంచకప్‌లో నేడు

పాకిస్తాన్ X అఫ్గానిస్తాన్
వేదిక: చెన్నై

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	5	5	0	10	1.353
న్యూజిలాండ్	5	4	1	8	1.481
దక్షిణాఫ్రికా	4	3	1	6	2.212
ఆస్ట్రేలియా	4	2	2	4	-0.193
పాకిస్తాన్	4	2	2	4	-0.456
బంగ్లాదేశ్	4	1	3	2	-0.784
నెదర్లాండ్స్	4	1	3	2	-0.790
శ్రీలంక	4	1	3	2	-1.048
ఇంగ్లండ్	4	1	3	2	-1.248
అఫ్గానిస్తాన్	4	1	3	2	-1.250

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే.-నెట్ రన్‌రేట్



జడేజా 39 నాటౌట్

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి) అయ్యర్ (బి) సిరాజ్ 0; యంగ్ (బి) షమీ 17; రచిన్ (సి) గిల్ (బి) షమీ 75; మిచెల్ (సి) కోహ్లి (బి) షమీ 130; లాథమ్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 5; ఫిలిప్స్ (సి) రోహిత్ (బి) కుల్దీప్ 23; చాప్‌మన్ (సి) కోహ్లి (బి) బుమ్రా 6; సాన్‌ట్నర్ (బి) షమీ 1; హెన్రీ (బి) షమీ 0; ఫెర్గూసన్ (రనౌట్) 1; బౌల్ట్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (50 ఓవర్లలో ఆలౌట్)** 273. **వికెట్ల పతనం:** 1-9, 2-19, 3-178, 4-205, 5-243, 6-257, 7-260, 8-260, 9-273, 10-273. **బౌలింగ్:** బుమ్రా 10-1-45-1, సిరాజ్ 10-1- 45-1, షమీ 10-0-54-5, జడేజా 10-0- 48-0, కుల్దీప్ 10-0-73-2.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) ఫెర్గూసన్ 46; గిల్ (సి) మిచెల్ (బి) ఫెర్గూసన్ 26; కోహ్లి (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 95; అయ్యర్ (సి) కాన్వే (బి) బౌల్ట్ 33; రాహుల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సాన్‌ట్నర్ 27; సూర్యకుమార్ (రనౌట్) 2; జడేజా (నాటౌట్) 39; షమీ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (48 ఓవర్లలో 6 వికెట్లకు)** 274. **వికెట్ల పతనం:** 1-71, 2-76, 3-128, 4-182, 5-191, 6-269. **బౌలింగ్:** బౌల్ట్ 10-0-60-1, హెన్రీ 9-0-55-1, సాన్‌ట్నర్ 10-0-37-1, ఫెర్గూసన్ 8-0-63-2, రచిన్ 9-0-46-0, ఫిలిప్స్ 2-0-12-0.

యూకీ బాంబ్రీ జోడీకి నిరాశ

కెరీర్‌లో రెండో ఏటీపీ డబుల్స్ టైటిల్ సాధించాలని ఆశించిన భారత టెన్నిస్ స్టార్ యూకీ బాంబ్రీకి నిరాశ ఎదురైంది. స్వీడన్ రాజధాని స్టాక్‌హోమ్‌లో ఆదివారం ముగిసిన నోర్డిక్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)-జూలియన్ క్యాష్ (బ్రిటన్) ద్వయం రన్నరప్‌గా నిలిచింది. గంటా 36 నిమిషాల పాటు జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో యూకీ-క్యాష్ జోడీ 6-7 (8/10), 2-6తో ఆంద్రీ గొలుబెవ్ (కజకిస్తాన్)-డెనిస్ మొల్చనోవ్ (ఉక్రెయిన్) జంట చేతిలో ఓడిపోయింది. ఐదు ఏస్‌లు సంధించిన యూకీ-క్యాష్ ద్వయం తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసింది. రన్నరప్ యూకీ-క్యాష్‌లకు 19,040 యూరోల (రూ. 16 లక్షల 76 వేలు) ప్రైజ్‌మనీతో పాటు 150 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. 31 ఏళ్ల యూకీ ఈ ఏడాది లాయిడ్ హ్యారిస్ (దక్షిణాఫ్రికా) జతగా మలోర్కా ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో డబుల్స్ టైటిల్‌ను సాధించాడు.



రన్నరప్ రష్మిక

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ మహిళల టెన్నిస్ (ఐటీఎఫ్) సర్క్యూట్‌లో తొలి సింగిల్స్ టైటిల్ సాధించేందుకు హైదరాబాద్ యువతార భమిడిపాటి శ్రీవల్లి రష్మిక ఇంకొంత కాలం వేచి చూడాల్సి ఉంటుంది. బ్యాంకాక్‌లోని హువా హిన్‌లో ఆదివారం ముగిసిన ఐటీఎఫ్ డబ్ల్యూ15 టోర్నీలో రష్మిక రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది. ఫైనల్లో ఆరో సీడ్ రష్మిక 2-6, 1-6తో రెండో సీడ్ అయూమి కోషిషి (జపాన్) చేతిలో ఓడిపోయింది. 80 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ఏకంగా పది డబుల్ ఫాల్ట్‌లు చేసి మూల్యం చెల్లించుకుంది. తన సర్వీస్‌ను ఆరుసార్లు కోల్పోయిన రష్మిక ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసింది. రన్నరప్‌గా నిలిచిన రష్మికకు ట్రోఫీతోపాటు 1,470 డాలర్ల (రూ. లక్షా 22 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.





రిత్విక్-అర్జున్ జోడీకి ఏటీపీ చాలెంజర్ టైటిల్



సాక్షి, హైదరాబాద్: అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) సర్క్యూట్‌లో హైదరాబాద్ యువ క్రీడాకారుడు బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ కెరీర్‌లో తొలి చాలెంజర్ డబుల్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఇటలీలో జరిగిన ఒల్బియా ఓపెన్ ఏటీపీ చాలెంజర్-125 టోర్నీలో రిత్విక్ చౌదరీ-అర్జున్ ఖడే (భారత్) జోడీ విజేతగా నిలిచింది. ఫైనల్లో రిత్విక్-అర్జున్ ద్వయం 6-1, 6-3తో ఇవాన్ సబనోవ్-మాతెజ్ సబనోవ్ (సెర్బియా) జంటపై గెలిచింది. ఈ ఏడాది రిత్విక్-అర్జున్ జోడీ పోర్టో ఓపెన్, బ్రాన్‌స్విగ్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టోర్నీలలో ఫైనల్ చేరి రన్నరప్ ట్రోఫీలతో సంతృప్తి పడ్డారు. మూడో ప్రయత్నంలో ఈ జంట తొలి టైటిల్‌ను కైవసం చేసుకుంది. తొలి రౌండ్‌లో రిత్విక్-అర్జున్ 6-3, 6-4తో శ్రీరామ్ బాలాజీ (భారత్)-ఆండ్రీ బెగెమన్ (జర్మనీ)లపై... క్వార్టర్ ఫైనల్లో 6-3, 6-4తో ఆండ్రూ హారిస్-జాన్ ప్యాట్రిక్ (ఆస్ట్రేలియా)లపై... సెమీఫైనల్లో 2-6, 7-6 (11/9), 10-7తో జెబవి-జెడెనెక్ (చెక్ రిపబ్లిక్)లపై గెలుపొందారు. టైటిల్ నెగ్గిన రిత్విక్-అర్జున్ జోడీకి 8,420 యూరోల (రూ. 7 లక్షల 41 వేలు) ప్రైజ్‌మనీ, 125 పాయింట్లు లభించాయి.

ఆసియా అండర్-15 విజేత ఆకాశ్

న్యూఢిల్లీ: పదేళ్ల విరామం తర్వాత ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో అండర్-15 బాలుర సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్‌కు టైటిల్ లభించింది. చైనాలోని చెంగ్డూలో ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో అస్సాం టీనేజ్ షట్లర్ బొర్నిల్ ఆకాశ్ చాంగ్‌మయ్ చాంపియన్‌గా నిలిచాడు. అండర్-17 బాలికల ఫైనల్లో తన్వీ శర్మ రన్నరప్‌గా నిలిచింది. టైటిల్ పోరులో 13 ఏళ్ల ఆకాశ్ 21-19, 21-13తో ఫాన్ హాంగ్ (చైనా)ను ఓడించి స్వర్ణం గెలిచాడు. పదేళ్ల క్రితం 2013లో హైదరాబాద్ కుర్రాడు సిరిల్ వర్మ అండర్-15 ఆసియా జూనియర్ టైటిల్ గెలిచాడు. బాలికల అండర్-17 ఫైనల్లో తన్వీ శర్మ 17-21, 21- 11, 19-21తో కెత్‌క్లింగ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడింది.

ఆంధ్రను గెలిపించిన భరత్, అశ్విన్

రాంచీ: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టు ఖాతాలో వరుసగా రెండో విజయం చేరింది. గుజరాత్ జట్టుతో జరిగిన గ్రూప్ 'సి' మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుజరాత్ 19.2 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌటైంది. ఆర్య దేశాయ్ (35 బంతుల్లో 62 నాటౌట్; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు అర్ధ సెంచరీ చేశాడు. ఆంధ్ర బౌలర్లు స్టీఫెన్ (3/25), కావూరి సాయితేజ (2/45), కేవీ శశికాంత్ (2/22), మనీశ్ (2/47) గుజరాత్ జట్టును దెబ్బ తీశారు. అనంతరం 166 పరుగుల లక్ష్యాన్ని ఆంధ్ర జట్టు 17.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ కోన శ్రీకర్‌భరత్ (41 బంతుల్లో 60; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), అశ్విన్ హెబ్బర్ (36 బంతుల్లో 53; 7 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడి తొలి వికెట్‌కు 10.2 ఓవర్లలో 87 పరుగులు జోడించారు. వీరిద్దరు అవుటయ్యాక విహారి (16 బంతుల్లో 24 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు), రికీ భుయ్ (13 బంతుల్లో 26 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు) ఆంధ్ర జట్టును విజయతీరానికి చేర్చారు. నేడు జరిగే తమ తదుపరి మ్యాచ్‌లో మణిపూర్ జట్టుతో ఆంధ్ర ఆడుతుంది.


శ్రీకర్ భరత్


అశ్విన్ హెబ్బర్


స్టీఫెన్

చాంపియన్ రామ్



ధార్వాడ్ (కర్ణాటక): అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) పురుషుల టోర్నీలో భారత ప్లేయర్ రామ్‌కుమార్ రామనాథన్ సింగిల్స్ చాంపియన్‌గా అవతరించాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో రామ్‌కుమార్ 7-6 (7/5), 7-6 (8/6)తో భారత్‌కే చెందిన దిగ్విజయ్ ప్రతాప్ సింగ్‌ను ఓడించాడు. రామ్‌కుమార్‌కు 3,600 డాలర్ల (రూ. 3 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 20 ఏటీపీ ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. పురుషుల డబుల్స్ గంటా సాయికార్తీక్ రెడ్డి-మనీశ్ సురేశ్ కుమార్ (భారత్) ద్వయం 4-6, 3-6తో ప్రజ్వల్ దేవ్-నితిన్ (భారత్) జోడీ చేతిలో ఓటమి చవిచూసింది.

హైదరాబాద్‌కు నాలుగో విజయం

రాణించిన తిలక్, రోహిత్, రవితేజ

జైపూర్: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టు విజయ పరంపర కొనసాగుతోంది. గ్రూప్ 'ఎ'లో భాగంగా మిజోరం జట్టుతో జరిగిన మ్యాచ్‌లో తిలక్ వర్మ సారథ్యంలోని హైదరాబాద్ జట్టు ఆరు వికెట్ల తేడాతో గెలిచి ఈ టోర్నీలో వరుసగా నాలుగో విజయం నమోదు చేసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన మిజోరం సరిగ్గా 20 ఓవర్లలో 114 పరుగులకు ఆలౌటైంది. అగ్ని చోప్రా (16 బంతుల్లో 28; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), జోసెఫ్ లాథన్‌కుమా (20 బంతుల్లో 24; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. హైదరాబాద్ బౌలర్లు రవితేజ (3/30), సీవీ మిలింద్ (2/18), చింతల రక్షణ్ రెడ్డి (2/20) మిజోరం జట్టును కట్టడి చేశారు. 115 పరుగుల లక్ష్యాన్ని హైదరాబాద్ 15.1 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి ఛేదించింది. రోహిత్ రాయుడు (31 బంతుల్లో 41; 5 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ తిలక్ వర్మ (24 బంతుల్లో 40 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడి హైదరాబాద్ విజయంలో కీలకపాత్ర పోషించారు. ఎనిమిది జట్లున్న గ్రూప్ 'ఎ'లో హైదరాబాద్ ప్రస్తుతం 16 పాయింట్లతో ముంబై జట్టుతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉంది. నేడు జరిగే తదుపరి మ్యాచ్‌లో బరోడా జట్టుతో హైదరాబాద్ తలపడుతుంది.





సద్దుల బతుకమ్మ సందర్భంగా ఆదివారం ట్యాంక్‌బండ్ వద్ద బాణసంచా వెలుగులు

ఎన్‌ఐఏ పేరిట ఐఎస్ దుష్ప్రచారం

- దేశ వ్యతిరేక భావజాలం ఉన్న ముస్లింల సమాచారం ఇవ్వాలంటూ ఫేక్ ఫోన్ నంబర్లు

సాక్షి, హైదరాబాద్: ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడే, లవ్‌జిహాదీలకు ప్రేరేపించే, సోషల్ మీడియాలో ముస్లింలు పెట్టే అభ్యంతరకరమైన మెసేజ్‌లపై సమాచారం ఇవ్వాలంటూ సోషల్ మీడియాలో ఎన్‌ఐఏ (జాతీయ దర్యాప్తు సంస్థ) పేరిట ఓ తప్పుడు సమాచారం సర్క్యులేట్ అవుతున్నట్టు ఎన్‌ఐఏ అధికారులు పేర్కొన్నారు. దేశ వ్యతిరేక భావజాలం ఉన్న ముస్లింల సమాచారం ఇవ్వాలంటూ ఫేక్ ఫోన్ నంబర్లతో ఎన్‌ఐఏ పేరిట ప్రచారం చేస్తున్నట్టు ఎన్‌ఐఏ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఓ వర్గాన్ని ఎన్‌ఐఏ టార్గెట్‌గా చేసుకున్నట్టు కొన్ని తప్పుడు సందేశాలు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ప్రసారం అవుతున్నాయని వెల్లడించింది. నకిలీ ఫోన్ నంబర్లను జత చేసిన ఈ సందేశాలతో ఎన్‌ఐఏకు సంబంధం లేదని స్పష్టం చేసింది. ఎన్‌ఐఏ అధికారులు దీనిపై ఆరా తీయగా..ఈ తరహా సందేశాలతో ఐఎస్ (ఇస్లామిక్ స్టేట్) మోసపూరితంగా భారతీయ యువకులను లక్ష్యంగా చేసుకుంటున్నట్టు తేలిందని పేర్కొన్నారు. ఇలాంటి నకిలీ, తప్పుడు సందేశాలను నమ్మవద్దని, ప్రచారం చేయవద్దని లేదా ఫార్వర్డ్ చేయవద్దని ప్రజలను ఎన్‌ఐఏ అధికారులు కోరారు.

‘లెక్క’ తప్పుతోంది!

గణితంలో 49 శాతం మంది విద్యార్థులు అంతంత మాత్రమే

- మాతృభాషలో కనీసం చదవలేని వారు 19 శాతం
- కరోనా తర్వాత తగ్గిన ప్రమాణాలు.. ఎన్‌సీఈఆర్టీ సర్వేలో వెల్లడి

గణితంలో కొన్ని రాష్ట్రాల్లో విద్యార్థుల పరిస్థితి ఇదీ... (శాతాల్లో)

రాష్ట్రం	కనీస స్థాయి లేనివాళ్లు	పాక్షిక సామర్థ్యం ఉన్న వాళ్లు	కనీస సామర్థ్యాలు ఉన్నవాళ్లు	ప్రమాణాలు మించి
తెలంగాణ	11	38	40	11
కేరళ	7	38	46	9
తమిళనాడు	29	48	20	3
కర్ణాటక	8	36	42	14
మహారాష్ట్ర	11	37	42	10
బిహార్	8	25	48	18
పశ్చిమబెంగాల్	5	26	52	16
హరియాణా	8	41	45	6
గుజరాత్	18	44	31	7

సాక్షి, హైదరాబాద్: కరోనా వ్యాప్తి తర్వాత తెలంగాణ సహా వివిధ రాష్ట్రాల్లో పాఠశాల స్థాయిలో విద్యార్థుల అభ్యసన దిగజారుతున్నట్లు తాజా అధ్యయనం తేల్చింది. ముఖ్యంగా గణితంలో 49 శాతం మంది విద్యార్థులు కనీస సామర్థ్యాలు కనబర్చలేకపోతున్నారని జాతీయ విద్య, పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) సర్వేలో వెల్లడైంది. ప్రధాన రాష్ట్రాల్లో మాతృభాషలతోపాటు గణిత సామర్థ్యంపై ఈ అధ్యయనం జరిగింది. దేశవ్యాప్తంగా మొత్తం 10 వేల ప్రభుత్వ, ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల్లో దాదాపు 90 వేల మంది విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించగా రాష్ట్రం నుంచి 180 స్కూళ్లకు చెందిన 1,500 మందికిపైగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ అధ్యయనం ప్రకారం కరోనా తర్వాత చదవడం, రాయడం విద్యార్థుల్లో పూర్తిగా సన్నగిల్లింది. మాతృభాషలో కనీసం చదవలేని పరిస్థితి ఉన్నవాళ్లు 19 శాతంగా తేలారు. పట్టుమని పది పదాలు తప్పులు లేకుండా చదవగలిగిన వారు 6 శాతం, 20 పదాలు చదివిన వాళ్లు 13 శాతమే ఉన్నారు. ఇక 70 పదాలు తప్పులు లేకుండా చదవగలిగే వాళ్లు 12 శాతంగా తేలారు. లెక్కల్లో బేసిక్స్ కూడా తెలియని విద్యార్థులు ఎక్కువమంది ఉన్నారు. ముఖ్యంగా మూడవ తరగతి వరకూ కనీసం అంకెలు కూడా గుర్తించలేని పరిస్థితి కనిపించింది. రెండంకెల కూడికలు, తీసివేతలు కూడా చేయలేని స్థితిలో 43 శాతం విద్యార్థులు మూడో తరగతిలో ఉన్నట్లు సర్వే గుర్తించింది. గతేడాది రాష్ట్ర విద్యాశాఖ జరిపిన పరిశీలనలో సైతం గణితంలో సగం మందికిపైగా టెన్త్ విద్యార్థులు క్లిష్టమైన లెక్కలు చేయలేకపోతున్నారని వెల్లడైంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇంజనీరింగ్ విద్య వరకూ వచ్చే విద్యార్థుల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించే అవకాశాలున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.